3ప RSVM01A109

మూఁడవ సంపుటము.] [రెండవ భాగము.

# గ్రంథాలయ సర్వస్వము.

ఆంధ్రదేశ గ్రంథాలయసంఘ పక్షమున సంవత్సరమునకు ఆరు భాగములు చొప్పున ప్రకటింపబడు గ్రంథము.

సీ. అక్షరాస్యులకు నిరక్షరాస్యులకును ♦ విద్యసుబోధమై వెలయవలయు
ధనమున్న లేకున్న తగినగ్రంథముజూడ ♦ నభిలాషగలయప్పు డమరవలయు
పదుగురొక్కెడఁజేరి భాషించుతరి వాణి ♦ భువనమోహినియౌచుఁ బొదలవలయు
వీనులచేనైన వీక్షణంబులనైన ♦ మంచిచెడ్డల దృష్టి మనుపవలయు
గీ. దేశమెల్లెడ విజ్ఞానదీపవితతి ♦ వలయునదియెల్ల గనుపింపవెలుఁగవలయు
భుక్తియును ముక్తియు మహానురక్తి మెలఁగ ♦ గ్రంథభాండారములు భువిగ్రాలవలయు.

కార్యస్థానము: బెజవాడ.

బెజవాడ వాణీ ముద్రాక్షరశాలయందు
బి. కే. స్వామిచే ముద్రింపబడియె.

౧౯౧౮

వార్షికమూల్యము. రు 3-౦-౦] [విడిభాగము వెల రు ౦-౮-౦.

# గ్రంథ భాండాగారములనుండ దగిన పుస్తకములు.

ఆంధ్రనాటక పితామహుండను బిరుదుగాంచిన బళ్లారి కృష్ణమాచార్యులవారి నాటకములు.

౧ ప్రహ్లాద. ౨ పాదుకాపట్టాభిషేకము. ౩ ప్రమల. ౪ చిత్రనళీయము. ౫ చంద్రహాస. ౬ సావిత్రి. ౭ ముక్తావళి. ౮ బృహన్నల. ౯ వరూధిని.

వెల ప్రతి ౧కి రూ ౧-౨-౦

బళ్లారి పండిత కే. సుబ్రహ్మణ్యశాస్త్రి గారిచే విరచితమై సరసవినోదినీసభవారిచేఁ బ్రదర్శింపబడి ప్రసిద్ధిగాంచినవి,

౧ శ్రీకృష్ణలీల. ౨ లవ-కుశ. ౩ విభీషణ పట్టాభిషేకము (లంకాదాహనము).

కొన్ని ప్రతులు మాత్రమే ముద్రింపఁబడుచున్నవి. వెల ప్రతి ౧కి రూ ౧-౪-౦

బళ్లారి ధ. గోపాలాచార్యులుగారిది.

౧ రామదాసు వెల రూ ౧-౨-౦

బళ్లారి బి. మాధవరావుగారివి.

౧ నవనాగరిక యువతీప్రహసనము. (Post Puberty Marriage). రూ ౦-౮-౦

౨ సుందరీ విజయము (నాటకము వృద్ధ వివాహము). వెల రూ ౧-౦-౦

పోస్టేజి ప్రత్యేకము.

ఇవిగాక యేలాటి సంస్కృతాంధ్రగ్రంథములుగాని మావద్ద దొరకును. కేటలాగు ఉచితము.

చిరునామా:—ఆంధ్ర గ్రంథాలయము, పోస్టుబాక్సు 73, చెన్నపురి.

# గ్రంథాలయములకు ఉచితము.

౧౯౧౮ సం॥ ఆగస్టు నెల ఆఖరువరకు మాత్రమే.

బందరు కాపరస్తు బ్రహ్మశ్రీ కేతవరపు రామకృష్ణశాస్త్రిగారిచే రచియింపబడిన. "సంగీత పుష్పవేణీనాటకము", ప్రతి ఆంధ్రగ్రంథాలయమునకు ఉచితముగా ఒకగ్రంథముచొప్పున ఇవ్వదలచుకున్నాను. కనుక దయతో ఈదిగువ విలాసమునకు, తమ గ్రంథాలయము పేరున్నూ, పోస్టున్నూ, వివరముగా తెలియపరచినచో, ఒకప్రతి బుక్కుపోస్టుద్వారా పోస్టు ఖర్చులు నేనేవహించి పంపెదను. గ్రంథము చేరినవెంటనే జబాబు వ్రాయప్రార్థితులు. త్వరపడుడు. ఇతరులకు, ప్రతి ఒకటికి రు ౦-౮-౦ లు. పోస్టుఖర్చులు ప్రత్యేకముగా కొనువారే భరించవలయును. ఈగ్రంథము అందరికి ఉపయోగముగా నుండునటుల, క్లుప్తముగా, మంచికాగితముపైనను ముద్రించబడినది. బాలికలకుగూడ ఉపయోగపడునటుల నాటకాంతమున, పాటలు గలవు. ఈ నాటకమువలన పాతివ్రత్యము, సత్యము చక్కగా తెలియుచున్నది. కాన అందరు చదివి ఆనందించవలసినదని, నాకోరిక. ఖరీదునకుగూడ నావద్ద దొరకును. ప్రతివారును తోచినరీతిని, ధర్మముచేసికొని, ఇహపరసౌఖ్యములను సంపాదించుటకుగాను, నాటకాంతరమున చెన్నపురి ఆంధ్రవిద్యానిధి, ఏలూరు గోసంరక్షణసమితి, హిందూ యువజనసంఘ గ్రంథాలయము, అన్నవస్త్రవైద్యవిద్యా దానసమాజముల ప్రకటనలు తెలుపబడినవి. కాన దయయుంచి ఎంతస్వల్ప సొమ్ములయినను, ఆయాకార్యదర్శులపేర పంపినచో, సంతోషపూర్వకముగా స్వీకరించెదరు. ప్రతిగ్రామమున, ధర్మకార్యములగు, గ్రంథాలయములు, సమాజములు నవి, స్థాపనచేసి పుణ్యము కట్టుకొనుడు అని హెచ్చరించుచున్నాను.

చిరునామా:—మద్దుల రామయ్యగారి కుమారుడు వేంకట చిన్నరాజు శ్రేష్ఠి, వర్తకులు,

[illegible] కృష్ణా జిల్లా.

# ఆంధ్ర దేశ గ్రంథాలయముల చరిత్ర.

అయ్యా!

శ్రీ పింగళనామ సం॥రముయొక్క ఆంధ్రదేశ గ్రంథాలయములచరిత్రను తయారు చే ఈ క్రిందవ్రాయబడిన ప్రశ్నలకు జవాబు వ్రాసి ఈ ఏప్రియలు నెల 31 వ తేదీలోగా తప్ప దరని కోరుచున్నాడను. పింగళనామ సం॥ర వృత్తాంతమును మాత్రమే ఇందువ్రాయవలె

ఆంధ్రదేశగ్రంథాలయ
సంఘ కార్యస్థానము
బెజవాడ, ౧౩-౮-౧౮.

అయ్యంకి వేంకటరమణయ్య,
కార్యదర్శి.

---

## ప్రశ్నలు

గ్రామము | తాలూకా | జిల్లా
పేరు

కార్యదర్శినామము | స్థాపన సంవత్సరము

గ్రంథములు:— 1 సంస్కృతము | 2 ఆంధ్రము | 3 ఆంగ్లేయము

పత్రికలు:—

(క) ఆంధ్ర మాసపత్రికలు | (ఖ) ఆంధ్ర వార్తాపత్రికలు | (చ) ఆంగ్లేయమాసపత్రికలు
(డ) ఆంగ్లేయ వార్తాపత్రికలు

సామాజికులు లేక చందాదారులు:— పురుషులు | స్త్రీలు

సగటున ప్రతిదినము వచ్చువారిసంఖ్య

సగటున నెల ఆదాయము | సగటున నెల ఖర్చు

స్వంతభవనముఉన్నదా? | నిల్వసొమ్ము

మాసవారి చందాలుగాక ఇతరసహాయము గలదా?

గతసంవత్సరమునందు చదువబడిన గ్రంథముల సంఖ్య

గతసంవత్సరమున భాండాగారపక్షమున జరిగినసభలు
(కార్యనిర్వాహకసభలు ఇందు జేర్పకూడదు)

శాఖాసంఘములు | సంఘము తెరచియుంచుకాలము

సంఘము "రిజస్టరు" అయినదా? | ఎవరుస్థాపించినది

పాఠశాలలు, గ్రంథప్రకటన, బహుమతి పరీక్షలు,
పురాణపఠనము మొదలగు విద్యావిషయములు

సర్వజనులను ఉచితముగా చదువనిచ్చెదరా?

ఇతర ముఖ్యవిషయములు

కార్యదర్శి సంతకము

మూడవ సంపుటము. | రెండవ సంచిక.

# గ్రంథాలయ సర్వస్వము.

## తుమ్మెదా!

నవరసమ్ములు ♦ నాట్యమాడఁగ
చివురు పలుకుల ♦ చెవుల విందుగ
కవిత లల్లే ♦ క్రాంతహృదయుల
గారవింపవె తుమ్మెదా!

౨

తమలపాకుల ♦ తరళ తరుణిచు
కమలదళముల ♦ కన్నె నవ్వము
అమృతసూక్తుల ♦ కలఁదు స్నిగ్ధుల
నభినుతింపవె తుమ్మెదా!

3

జాతిజాజుల ♦ జాలు సెలుపులు
లేత రోజా ♦ పూఁత యెఱుపులు
ప్రీతి గంధులఁ ♦ బెంచు చతురల
పిలిచి రావే తుమ్మెదా!

౪

మేలి కిన్నెర ♦ మేళవించే
గాలి గలుగగ ♦ రాగమైత్రి
పాల తీయద ♦ నాల భారత
పదముఁ బాడవె తుమ్మెదా!

౫

దేశగర్వము ♦ దీప్తిఁ జెందఁగ
దేశచరితము ♦ తేజరిల్లగ
దేశమరసిన ♦ ధీరపురుషుల
తెలిసి పాడవె తుమ్మెదా!

౬

వసుమతీమణి ♦ వలచి యిచ్చిన
అసమరత్నము ♦ లపహరింపఁగ
కొసరి ముట్టడి ♦ గొనిన ముష్కర
కులము లేదే? తుమ్మెదా!

౭

శ్రీలు పొంగిన ♦ జీవగడ్డయి
పాలు బాఱిన ♦ భాగ్యసీమయి
వ్రాలినది యీ ♦ భరతవర్షము
పగకు సేవ్యమె తుమ్మెదా!

౮

వేదశాఖలు ♦ వెలసె నిచ్చట
ఆదికావ్యం ♦ బలరె నిచ్చట
బాదరాయణ ♦ పరమఋషులకు
పాదు సుమ్మిది తుమ్మెదా!

౯

విపినబంధుర ♦ వృక్షవాటిక
ఉపనిషన్మధు ♦ వొలికె నిచ్చట
విపులతత్త్వము ♦ విస్తరించిన
విశ్వమణి యిదె తుమ్మెదా!

౧౦

సూత్రయుగముల ♦ శుద్ధవాసన
స్తోత్రయుగముల ♦ చండశౌర్యము
చిత్రదాస్యము ♦ చే చరిత్రల
చెలఁగిపోయెనె తుమ్మెదా !

౧౧

పాండవేయుల ♦ పరుసకత్తులు
నిండి మెఱసిన ♦ మహోగ్రణకథ
కండగల చి ♦ క్కనితెనుంగుల
కదిపిపాడవె తుమ్మెదా !

౧౨

లోకమంతయు ♦ కాకఁబెట్టిన
కాకతీయుల ♦ కదనపాండితి
చీకిపోవని ♦ చేవమాటల
చేర్చికూర్పవె తుమ్మెదా !

౧౩

తుంగభద్రా ♦ భంగములతో
పొంగిపొంగిన ♦ పాడిచిత్రుల
శృంగపదవి కె ♦ క్కింపునాగుల
పట్టి చూడవె తుమ్మెదా !

౧౪

పసుపుకొంగుల ♦ ముసుఁగులెత్తఁగ
కొసలు తీర్చిన ♦ కోరకత్తుల
కసరిపోరిన ♦ గండుయోధుల
పసలు పాడవె తుమ్మెదా !

—— రాయప్రోలు సుబ్బారావు.

# మనుచరిత్రము - మానవజీవితము *

మనము నేఁడు ప్రాచీనాంధ్రుల యౌన్నత్యమును గూర్చి విజృంభించుచున్నాము. కాని యాయౌన్నత్యము నకు మూలాధారమేది? గంగానదిమొదలు కావేరి వఱకును వ్యాపించి యొకప్పుడు మహోచ్చదశలో నుండిన మన ప్రాచీనాంధ్రసామ్రాజ్యమా? అది కాదు. ఆసామ్రాజ్య మెప్పుడో యంతరించినది. ఆనగరములు మట్టిపాలైనవి. ఆశిల్పకళ లడుగంటినవి. మహానది మొదలు కన్యాకుమారివఱకు వ్యాపించిన విద్యానగర సామ్రాజ్యమా? అదికూడ మున్నూరేండ్లక్రిందట నే యంత రించినది. ఆనగరములు నేలపాలైనవి. ఆదేవాలయములు పూజాపురస్కారణములులేక బూజుపట్టినవి. కావున, మన పూర్వుల యౌన్నత్యమునుగూర్చి మనము విజృంభించుట శిల్పావశిష్టములైన ప్రాచీన కళలనుజూచియా? కాదు. ఎన్నటికిని నశింపని జీవకళ లుట్టిపడుచుండు మహా శిల్పములు కొన్ని కలవు. మన ప్రాచీనమహామహుల యాదర్శములకు నవియే బహిః ప్రతిమలు

"సప్తసంతానములలోఁ బ్రశస్తి గాంచి
ఖిలముకాకుండునది ధాత్రిఁ గృతియె కాన"

అని వీరాగ్రేసరుఁడు శ్రీకృష్ణదేవరాయలు చెప్ప యున్నాఁడు. ఆవాక్యమును పెద్దనార్యునితో నాతఁడు చెప్పుచున్నప్పుడు తనరాజ్యమును, తనయైశ్వర్యమును, తనదేవాలయములును, తనశిల్పములును-నీశ్వరములని యా తనికిఁ బొడకట్టెను. తన నామమును, తనయశస్సును, నాచంద్రార్కముగా నిలుపఁజాలిన సామర్థ్యము వానికి లేదని యాతఁడెఱుంగును. ఇఁక నట్టి సామర్థ్యము గల మహాశిల్ప మొక్కటియే కలదు. అది కృతి. కావు ననే "కృతిరచింపుము మాకు శిరీషకుసుమ పేశలసుధామ యోక్తులఁ బెద్దనార్య" అని యానతిచ్చియున్నాఁడు.

ఆంధ్రుల సామ్రాజ్యాతిశయము-ఆంధ్రులవిద్య,-

* బ్రహ్మపురాంధ్ర భాషాభివర్ధనీ సమాజ వార్షికోత్సవ సందర్భమునఁ జదువఁబడినది.

ఆంధ్రుల గౌరవము. ఆంధ్రులయాదర్శము- అంతయును లోకమునకుఁ జాటి చెప్పఁగలిగినది మనవాఙ్మయ మొక్కటియే. అందే జీవకళ యుట్టిపడుచున్నది. దానిఁజూచియే మనము గర్వింపవలసియున్నది.

అట్టి యాంధ్రవాఙ్మయము నాదరించినవారైదుగురు కలరు. రామరాజభూషణుఁ డిట్లు చమత్కారముగాఁ జెప్పియున్నాడు:—

"మహిమ మున్ వాగనుశాసనుండు సృజి
యింపన్ గుండలీంద్రుండు తిక్కన్
మహనీయస్థితిమూర్తియై నిలువ
శ్రీనాథుండు ప్రోవన్ మహా
మహులై సోముఁడు భాస్కరుండు వెలయింపన్."

శ్లేషచమత్కారము మాటు యటుండనీ, వాక్యమునందు గొప్పభావ మిమిడియున్నది. వాగనుశాసనుఁడు కావ్య ప్రపంచమును సృష్టిచేసినవాఁడు. కాని, యాప్రపంచ స్థితికిఁ గారకుఁడు కుండలీంద్రుఁడు తిక్కన. తిక్కనకు సమానుఁ డాంధ్రకవులలో లేఁడని మనము చెప్పుచున్నాము. కారణమేమి? నన్నయ సృష్టికర్తయైనను, ఆచార్యుఁడు కాఁడు. తిక్కన యాచార్యుఁడు. వర్ణనాతిశయమున - శబ్దౌచిత్యమున- భావగాంభీర్యమున- రచనాకౌశలమున- రసపోషణమున, మన కాదర్శము తిక్కనయే. ఆతఁడు పెట్టినదే భిక్ష. అట్టి మహనీయస్థితిని బ్రోచినవాఁడు శ్రీనాథుఁడు. ఈతనియందుఁగల విశేషము శయ్యా ధారాశుద్ధి. తిక్కన ప్రసాదించిన మహనీయస్థితి శ్రీనాథుని ధారాశుద్ధివలన స్థిరపడినది.

భావగాంభీర్యమునకు శయ్యాసౌలభ్య మలవడినంత మాత్రమునఁ జాలదు. రీతులు కొన్ని కావలసియున్నవి. అప్పుడే కావ్యభారతికి విద్యపూర్తియగును. ఆరీతులు నేర్పినవారు నాచనసోముఁడును, మంత్రిభాస్కరుఁడును. ప్రబంధరీతులను నేర్పి వారామెను వెలయించిరి. అనఁగా లోకుల యాకర్షణకుఁ బాత్రురాలినిఁ జేసిరి. రామరాజభూషణుఁడు చేర్పని నామ మొక్కటిమాత్ర ముండి పోయినది. దానిని తరువాతివారు చేర్చిరి. ఆ మహాత్ముఁడు పోతన్న. ఈతఁడు శ్రీనాథుని కేవిధమునను దీసిపోఁడు. శ్రీనాథుని ధారాశుద్ధి మత్తేభగమనము వంటిది. పోతనార్యుని ధారాశుద్ధి గజ్జెలగుఱ్ఱమువంటిది. కావున నాతనికంటె నీతఁడు తక్కువవాఁనిగాని, యాతనికన్న నాతఁడు ఎక్కువవాఁనిగాని చెప్పుటకు వీలులేదు.

కావున నన్నయ- తిక్కన- సోముఁడు- భాస్కరుఁడు- శ్రీనాథుఁడు- పోతన- ఆర్వురు- ఈ ఆర్వురు నిరుపమానులు. ఆంధ్రకవితాతారాపథమున దివ్యజ్యోతులు.

వీరి తరువాత వీరియంతటివాఁడని చెప్పఁగల మహాకవి యెవ్వఁడు? ఇక్కడ భిన్నాభిప్రాయములు కలవు. పెద్దనయని యొకరందురు, భూషణుఁడని మఱియొకరందురు, సూరన్నయని యింకొకరందురు, తిమ్మన్నయని వేఱొకరందురు. ఈవిషయమును నిర్ధారణగాఁ జెప్పుటకు ముందు మన మాలోచింపవలసినయంశ మొకటి కలదు. కవులలో హెచ్చుతగ్గులు మనము దేనినిబట్టి యేర్పాటుచేయుచున్నాము? ఎవ్వఁడు నిజమైన కవిత్వమును జెప్పుచున్నాఁడో వాఁడు గొప్పకవియని చెప్పుచున్నాము. కావున నిజమైన కవిత్వమన నేమియో తెలిసికొనవలసి యున్నది. మహాకావ్యములను గొన్నిటిని మనము చదువుచున్నప్పుడు రచనాచమత్కారమునకును కల్పనాకౌశలమునకును, నానందించుచుందుము; కాని గ్రంథపఠనానంతరము శనగలుతిని చెయిగడిగికొన్నట్లయిపోవునేగాని, తృప్తిగానుండదు. ఏదియో యొక లోపమందున్నట్లు పొడకట్టుచుండును. అందు నిజమైన కవిత్వము లేకపోవుటయే దానికిఁ గారణము.

లక్షణమును సంపూర్ణముగా ననుసరించి వ్రాసిన కావ్య ముత్తమకావ్యమని కొందఱి యుద్దేశము. అది నిజమైనచో విజయవిలాసము మూలఁబడి యుండవలసినదే. అలంకారభూయిష్ఠమైన కావ్యమే యుత్తమకావ్యమని కొందఱి యుద్దేశము. అది నిజమైనచో ప్రబంధరాజ వేంకటేశ్వరవిజయవిలాస ముత్తమకావ్యము కావలసి యున్నది. లోకోక్తులను దండిగా గూర్చి చెప్పిన కావ్య

ముత్తమమనికొందఱియుద్దేశము. అదివాస్తవమైన, ఘట్టుప్రభువు వ్రాసిన కుచేలోపాఖ్యానము కావ్యరాజముగా నెన్నవలసియున్నది. నీతిశాస్త్రమును లోకానుభవముతోఁ గూర్చి చెప్పినచో నది ప్రథమకావ్యమని కొందఱందురు. అది సత్యమైన వేమనయే కవిశ్రేష్ఠుఁడు కావలసియున్నది.

ఆ కావ్యములకు గాని, యా కవులకు గాని, మాన్యత్వము లేదని నేనెప్పుడును జెప్పవలసినవాఁడను కాను. కాని ఎన్ని కావ్యముల చదివినను, ఎందఱు కవుల పేర్లు చెప్పినను, అందేదో లోపమున్నట్లే మనసునఁ దోచుచుండును. లోపములేని సంపూర్ణానందము నొసంగు కావ్యములు మూడుమాత్రము కలవు; మనుచరిత్రము- వసుచరిత్రము- ప్రభావతీప్రద్యుమ్నము. పెద్దన్న- భూషణుఁడు- సూరన్న- ఈముగ్గురును త్రిమూర్తులవలె ప్రకాశించుచున్నారు. ఒక్కొక్క రొక్కొక్క విషయమున నాధిక్యము సంపాదించినవారు. వీరిలో నెక్కువ తక్కువ లేర్పాటుచేయుటకు బ్రయత్నించుట వెడఁగుతనము; త్రిమూర్తులలో నెవ్వఁడెక్కువ, యెవ్వఁడు తక్కువ యని నిర్ధారణచేయుటవంటిది. కొందఱు విష్ణువధికుఁడు. కొందఱు శివుఁడధికుఁడు. కొందఱు పెద్దన్నయధికుఁడు, కొందఱు బట్టుమూర్తియధికుఁడు. కాని వారిలో నెక్కువ తక్కువలేర్పాటు చేయుటకుఁ బ్రయత్నింపఁగూడదని నాయుద్దేశము. వారి యాదర్శములు వేఱు. వారిమార్గములు వేఱు. వారి శయ్యలు వేఱు. అట్టిచో వారిలోని తారతమ్యములు నిర్ధారణచేయుట దోషముకాదా? ప్రకృతాంశమగు మనుచరిత్రమును గూర్చివిచారింతము.

పెద్దనార్యుని స్వభావోన్మీలనము- పాత్రపోషణము- రససమ్మేళనము- అన్నియును నిరుపమానములే. కాని, యాతని కవిత్వమున నొక్క గొప్ప విశేషమున్నది. ఆంధ్రవధూటిచొక్కపుంజనుగవఁబోలె యుఱచాటుగాఁ గవిత్వముండవలయునని పెద్దన్నగారి యాశయము. ఆ యుఱచాటుతనము స్వభావోన్మీలనమునఁగాదు- పాత్రపోషణమునఁగాదు- రససమ్మేళనమునఁ గాదు. వేఱొక విషయమునఁబోషింపఁబడియున్నది. శ్రీకృష్ణదేవరాయలు "ఎవ్వరీడు పేర్కొన నీకు౯" అనిచెప్పుట యీవిషయముననే. కవి కావ్యమును రచించుట నిజపాండిత్య ప్రకర్షకుఁగాదు. కవికి నీతిశాస్త్రము తెలియునా లేదా- తర్కశాస్త్రము చదివెనా లేదా - వ్యాకరణ శాస్త్రమున, సంగీతశాస్త్రమున, అలంకారశాస్త్రమున నీతఁడేమాత్రము కృషిచేసె-నను సంశయములు పాఠకులకక్కఱలేదు. గ్రంథపఠనమువలనఁ బాఠకులు కోరునది హృదయవికసనము. అది కలిగింపని కావ్యమును పాఠకులు గౌరవింపరు. పెద్దనార్యుని కీర్తియంతయు నందే యిమిడియున్నది. మానవజన్మమెత్తిన యెల్లవారికి హృదయమున నొకానొక సందేహ మెప్పుడును బాధించుచుండును. ఏకారణముననో మనమీలోకమున జన్మించితిమి. ఆ కారణము మాట యటుండనిచ్చి, మనమీ జన్మమెత్తినందుకు సంపాదింపవలసిన యంశమేమి? అదియట్లు సంపాదింపవచ్చును? అనునది. ఆ యంశ మీమనుచరిత్రమున నాంధ్రకవితామహుఁడు లెస్సగా బోధించియున్నాఁడు.

పిపీలికాది బ్రహ్మపర్యంతముగల జీవకోటియంతయు నానందమను నొక మహావస్తువును సంపాదింపఁగోరుచుండును. మనమేపనిచేయుచున్న నందుకే. ఒక్కొక్కప్పుడు మహాకష్టములను భరించుచున్నాము. ఆ భరించుట యంతయు నా కష్టానంతరము కలుగఁబోవునను కొనుచున్న యానందము కొఱకే. ఆయానందమే లేదని తలఁచినచో - ఆయానందమే కలుగదని తలఁచినచో- మనమాకష్టమును భరించుటకుఁ బ్రయత్నింపము. విధిలేక భరింపవలసివచ్చినను, అది కేవల మనస్తాపముతోనే భరింతుము. వేఁటకాఁడు తుపాకిని బుజముపై వేసికొని పర్వతాగ్రమున కనాయాసముగా నెక్కిపోవుచున్నాఁడు. మృగమును జంపఁగలనుగదా యను నావందాభిలాషణవలననే యాశ్రమ నాతఁడు లక్ష్యపెట్టలేదు. కాని, వాని వెనుక మూటమోసికొనిపోవువానికిని, వానికిని, శ్రమను లక్ష్యముచేయుటలో నెంతయో వాసి కలదు.

యాత్రార్థియగువాఁడు తిరుపతికొండపైకి ననాయాసముగఁ బోవుచున్నాఁడు. దేవాలయములేని కొండపై కెక్కవలసివచ్చినప్పుడు వాని శ్రమ తేటతెల్లమగుచున్నది. కావున లోకమున మనుష్యుఁ డేపని చేయుచున్నను, నెంతటికష్టములు భరించుచున్నను, నానందము సంపాదించుటకే. ఆ యానందము రెండు విధములుగాఁ గన్పడుచున్నది. మొదటి దింద్రియజన్యమైన యానందము.

శా. ఎందే డెందము గందళించు రహిచే
నేకాగ్రతన్ నిర్వృతిం
బెందుం గుంభగతప్రదీపకళికా
శ్రీఁదోప నెం దెందు బో
కుం దే నింద్రియముల్ సుఖంబు గను నా
యింపే పరబ్రహ్మ మా
నందో బ్రహ్మ యటన్న ప్రాఁజదువు సం
తద్బుద్ధి సూచింపుమా.

అని వరూధిని చెప్పుచున్నది ఇంద్రియ జన్యమైన సంపూర్ణానందమే బ్రహ్మమని దీనిభావము.

ఆనందము సంపూర్ణముగానుండవలెనన్న నది యవ్యాజమై యుండవలెను. నగరములలో మానవ సంఘములలో నట్టి యవ్యాజానందము కలుగదు. ప్రకృతి సౌందర్యముగల ప్రదేశములలో నేకాంతముననున్నప్పుడే యట్టి యవ్యాజానందము కలుగును.

బహురత్నద్యుతి మేదురోదరదరీభాగంబులం జొచ్చి మిహికాహార్యమున, నభోవాహినీలహరీ శీతలగంధవాహపరిఖేలన్ మంజరీ సౌరభగ్రహణేందిందిరతుందిలంబులగు కాంతారసంతానములే యట్టి యవ్యాజానందమునకు నాలవాలములు. అట్టి కాంతారములలో,

సీ. మృగనాభి నికరంపు • బుగబుగల్ గలచోట,
జడలేటి తుంపురుల్ • చెదరుచోట,
కడు కవాటీగంధ • వహుఁడు పైకొనుచోట,
గర్పూరతరుధూళి • గప్పుచోట,
పసపురాఁ సెలయేఱు • లిసుక వెట్టినచోట,
చిగురు మావుల సంజ • నిగుడుచోట,
నవమాలికల తీవె • నట్లుట్టిపడుచోట,
మాణిక్యదీపముల్ • మలయుచోట,
ప్రమదమున దేటులెలుగెత్తి • పాడుచోట,
శారికలసంగశాస్త్రముల్ • చదువుచోట,
కీరకలకంఠములు క్రొవ్వి • కేరుచోట,
పావురములారగంబులు • పలుకుచోట

అట్టిచోటనే యీ యానంద మనుభవింపవలెను.
దానికి సాధనములు.

సీ. సద్యోవినిర్భిన్న • సారంగనాభికా
హృతమై పిసాళించు • మృగమదంబు,
కసటువోబీ డెందఁ • గఱఁగి, కట్టల నంటి,
గగుగపు వలచు చో • క్కపుజవాజి,
సారెలెత్తి ఘనసార • తరువులఁ దనుదాన
తోఁరగిన పచ్చక • ప్పురపుసిరము,
గొజ్జంగపూఁబొదల్ • గుటియుంగబటికంపు
దొనలనిండినయట్టి • తుహినజలము
వివిధ కుసుమకదంబంబు, • దివిజతరుజ
మ్ముల వసన ఫలాసవా • మేయ రత్న
భూషణంబులు ... ...

ఇవి యన్నియు నున్నను, కావలసినది యింకొకటి కలదు.

ఉ. ఎన్ని భవంబులం గలుగు
నిక్షుశరాసనసాయకవ్యథా
ఖిన్నత వాడి వత్తలయి,
కేలఁ గపోలము లూది చూపులన్
పిన్నదనంబు దోప, గను
నేదుఱునం బయిగాలి సోకినన్
కన్నవలెంగరంగు నలి
వేణుల గౌఁగిటఁ జేర్చుభాగ్యముల్.
అని వరూధిని చెప్పుచున్నది.

విరహవేదనచేఁ బ్రియునిరాకకై కనిపెట్టుకొనియుండి, వాఁడువచ్చినపుడు ప్రత్యక్షమైయున్న యలివేణిని గౌఁగిలించుకొనఁగోరు ప్రియురాలుండవలెను. అప్పుడా యానందము సంపూర్ణమగును.

ఇట్టి యింద్రియానందమే బ్రహ్మానందమని చెప్పువారి మతము. అదియే సశరీరస్వర్గసుఖమని వారియుద్దేశము. ఇది కాముకుని మతమున నిజమే కాని, యిది తుచ్ఛసుఖము. మీసాలపై తేనెవంటిది. బ్రాహ్మణుఁడు కోరఁదగినది కాదు. ఏలయన శరీరము శాశ్వతముగాదు.

వరూధినికూడ, "ఇట్టి యెలప్రాయము వైదికకర్మనిష్ఫలంబోవఁగ నింక భోగముల బొందుట యెన్నఁడు" అని చెప్పియేయున్నది.

నిమేషమాత్రమే యనుభవింపఁదగినది యీయింద్రియజన్యానందము సకాముఁడు గణింపవలసినదిగాని, యకాముఁడు గణింపవలసినది కాదు. అకాముఁడిది గణించినచో "ఇంద్రియవశగతి జిహ్వాచరణైక నిపుణచిత్తజనిశితాజిహ్మగములపాలై" చెడును. అతఁడు కోరవలసినది బ్రహ్మానందాధిరాజ్యము. ఆరాజ్యమునకుఁ బట్టభద్రుఁడు కాఁగోరువాఁడు, కుటుంబజంబాలపటలమగ్న గృహమేధిమండలములతో సంసర్గంబువిడిచి,

సీ. ముడిచినయ్యొట్టికోఁ • జడమూయ మువ్వన్నె
మెగము తోలుకిరీట • ముగ ధరించి
కకపాలఁ గదార • కటకముద్రితపాణిఁ
గుఱుచలాతాముతోఁ • గూర్చి పట్టి
యుగ్రమైన యొ • డ్డాణంబులకణఁచె
సక్కళించినపట్టు • మక్కళించి,
యారఫూటచ్ఛాయ • నవసులింపఁగఁజాలు
బడుగుదేహంబున • భస్మమలఁది,
మిట్టయురమున నిడుయోగ • పట్టె మెఱయ
కావికుబుసంబుజలకుండి • కయును బూని

యనుదిన తీర్థయాత్రాచరణకేళిఁ బై సమస్తావకాశంబులను జూచుచు సిద్ధి పొందవలెను. అప్పుడాతఁడు సంపూర్ణమైన యానందబ్రహ్మ మనుభవింపఁగలఁడు. కాని, లోకమంతయు నిట్లేయైనచో ప్రాపంచికవ్యవహార మెట్లుజరుగును? కేవల కాముకత్వము లోకమున కెట్లు పనికిరాదో కేవల నిష్కామికత్వముకూడ నట్లే పనికిరాదు. లోకవ్యవహారము జరుగుచుండియు, మనుష్యుడు ఇంద్రియ సుఖ లోలుఁడుకాకుండనుండుటకు గృహస్థాశ్రమమే యుత్తమమైనది. కేవలనిష్కాముఁడగు సిద్ధుఁడుగూడ

సీ. కలరులనన్నతం • గటిజన్నుగృహమేధి
యజమానుఁ డంకస్థి • తార్థపేటి
పండినపెరటికి • ల్పకము వాస్తవ్యంపు
దొడ్డిబెట్టినవేల్పు • గిడ్డికాపు
కడలేని యమృతంపు • నడబావిసంసారి
సవిధమేరునగంబు • భవభర్తృ
మరుదేశపథమధ్య • మప్రపకులపతి
యాకటికొదవు స • స్యముకుటుంబి
బధిరపంగ్వంధ భిక్షుక • బ్రహ్మచారి
జటి పరివ్రాజకాతిథి • క్షపణకాన
ఘాత కాపాలికాద్యనా • థలకుఁ గాన
భూసురోత్తమ గార్హస్థ్య • మునకుసరియె ?

అనిగృహస్థాశ్రమముకన్న నుత్తమమైన యాశ్రమము లేదని చెప్పియున్నాడు. అట్టి గృహస్థాశ్రమమునఁగూడ

ఉ. యౌవనమందు, యాజ్ఞ్యయు, ధ
నాఢ్యుఁడునై కమనీయకౌతుక
శ్రీవిధిఁ గొంకటుల్ కొలిచి
చేసినకూరిమిసోమిదమ్మ సౌ.
ఖ్యావహయై భజింప, సుఖు
లై, తలిదండ్రులుగూడి దేవియుఁ
దేవరవోలెనుండ యిలు
కీర్తిఁగఁగాపురమొప్పు వానికిఁ

ఒకనియొద్ద చేయిచాచి యడుగవలసిన యక్కఱలేనంత ధనము- మంచిచెడ్డల నేర్పాటుచేసి చెప్పఁగలిగి

యనుభవశాలురై, యనురాగయుక్తులైన తల్లిదండ్రులు- వేవు రింటికివచ్చిన, నడికిరేనైన వండనలఁతుక, వలయు భోజ్యంబు లవ్వారిగాఁ బెట్టుచు నన్నపూర్ణవ నుద్దినైన గృహిణి- గడగోఁడు నీడలై క్రీడించు సచ్ఛాత్రులు- ఇట్టిగృహమునకు యజమానుఁడై కాపురము చేయువాఁడు సశరీరస్వర్గ మనుభవించుచున్నాఁడని చెప్పుట యతిశయోక్తియగునా? కూఁకటుల్ గొలిచిచేసిన కూరిమి సోమిదమ్మ సహధర్మచారిణియై యున్నందునఁ దనకుఁ బ్రియములైన యరణులును, దర్భలును, సమ్మలును మొదలగువానిచే- రేపును మాపును హవ్యములతో నగ్నిని తృప్తిపరచుచు నిహసౌఖ్యమును పరసౌఖ్యమును సంపాదింపగల సామర్థ్యము గృహస్థాశ్రమమున నే కలుగును. పెద్దనార్యుని మనుచరిత్రము చదివినప్పుడు మనము నేర్చుకొను గొప్పవిషయమిది.

ఇంద్రియజన్యమైన యానందము తుచ్ఛమైనదనియు, కేవల నిష్కామత్వము లోకవ్యవహారమునకుఁ బనికి రాదనియు- ఇంద్రియలోలుఁడు కాక, నిష్కాముఁడై, లోకవ్యవహారము నడుపవలెనన్న గృహస్థాశ్రమమే యుత్తమమైనదనియు, మనము నేర్చుకొన్నప్పుడు మన కుఁగలిగిన సంతోషమునకు మితిగలదా? అట్టినీతిని దెలియఁజేయు కావ్యమునకు విలువ యెంతయో మన మేర్పాటు చేయఁగలమా?

ఇఁక, మనుచరిత్రము చదివి మఱియొక గొప్ప యంశము మనము నేర్చుకొనవచ్చును. అది మనుష్యవాంఛా నిష్ప్రయోజనత్వము.

మనుష్యుఁడీలోకమున జన్మించినప్పుడు, వాని ప్రాచీనకర్మానుసారముగా, వానికిఁ గావలసిన పరికరములతోనే జన్మించును. కుటుంబ సౌఖ్యమాతఁ డెంత యనుభవింపవలెనో, సాంఘిక సౌఖ్య మెంతయనుభవింపవలెనో, ఆర్థిక సౌఖ్య మెంత యనుభవింపవలెనో, జన్మమెత్తించిన భగవంతునకే తెలియును. కావున, మాకది కావలెనని యు, నిది కావలెననియు కోరికలను మనుష్యుఁ డెప్పుడును బెట్టుకొనఁగూడదు. తనకున్న దానితోఁ దృప్తిపొంది, నిష్కాముఁడై యుండవలెను. ఈ యంశమునే మతకర్తలందఱును విస్తరించియున్నారు. కాని యొక్క విశేషముమాత్రము కలదు. మన హృదయములలో దృఢముగా నేకోరిక నాటుకొనియుండునో, యాకోరిక మనకు సఫలమగును గాని- యట్టి సాఫల్యమువలన మన కానందము కలుగక, చిట్టచివర కా కోరిక వ్యర్థమే యని బోధపడును. పుత్త్రకామేష్టి చేసి, పుత్త్రులఁ గాంచిన దశరథుఁడు పుత్త్రసౌఖ్య మెంతవఱ కనుభవించెను. కావున మనుష్యవాంఛయే నిష్ప్రయోజనము. ఈ యంశమును "డాక్టరు జాన్సను" అను నాంగ్లేయ కవి "మనుష్యవాంఛా నిష్ప్రయోజనత్వము" అను పుస్తకమున విపులముగాఁ జర్చించెను. పెద్దనార్యుఁడుకూడ మనుచరిత్రమున నీ యంశమును బోధపరచెను. ప్రవరుఁడు నిష్కాముఁడే కాని, యాతనికొక్క కోరికమాత్రము బాధించుచుండెను. ఆతనికి గృహస్థాశ్రమమునకుఁ గావలసిన సౌఖ్యములన్నియును గలవు. అయినను తీర్థయాత్రాభిలాష మాయన హృదయము ననుదినమును వేధించుచుండెను. ఇది సిద్ధుని పనిగాని గృహస్థుపనికాదు. కాని, సంకల్పము బలముగానుండుటచే నది యీడేర్పకతప్పదు. కావున, సిద్ధరూపమున భగవంతుఁ డాతనికి బ్రత్యక్షమై యొక పసరిదియదియని చెప్పక వానికాలికిఁ బూసి పోయెను. ఆరహస్యమును చెప్పకపోవుటయే ప్రవరునకు బాధ కలుగఁ జేసెను.

తానొకటితలఁచిన దైవము మఱియొకటి తలుచును. ఔషధసత్త్వము తెలియుటకు హిమవత్పర్వతమునకుఁ బోయినాఁడు గాని, మంచునీటిచే పసరుకరఁగిపోవునను మాటలు మఱచిపోయెను. అప్పుడు,

"హానన్నిట్లు దైవంబ తెచ్చితె, యీ ఘోరవనప్రదేశమునకుఁ సిద్ధోపదేశంబునఁ" అని విచారించినాఁడు. చూడుఁడు. దైవకృత మెట్లున్నదో! ఎన్నియోయేండ్లనుండి కోరుచున్న తీర్థ సందర్శనాభిలాషము నేఁటికి తీరినది; గాని, దానివలన నాతని కేమి సౌఖ్యము కలిగినది! ఆనందమున మునుగుటకు మారు విచారమున నే మునుఁగవలసి

వచ్చెను. కావున, మనుష్యవాంఛ నిష్ప్రయోజనమని యాతనికి బోధపడినది. నీ విచ్చు మనకొక దండము. చేపిని కొట్టవమ్మా యని యడుగుకొనవలసిన యవస్థలో నాతఁడు పడి, "సదనంబునఁ నిల్పుమినుండు పశ్చిమాంభోనిధిలోనఁ గ్రుంకకయమున్న రయంబున హవ్యవాహనా" యని మరలఁ బ్రార్థింపవలసిన యవసరము తటస్థించెను. అట్లే, వరూధినీ గంధర్వులకుఁగల సంకల్పములు కూడ నీడేరినవి. కాని, వాని మూలమున వారుకూడ నానందము పూర్ణముగా ననుభవింపలేదు. ఆ యంశము విపులముగా మఱియొకసారి చర్చింపఁబడును.

ఆంధ్రసోదరులారా, మనుచరిత్రమున మనము నేర్చుకొనవలసిన మహావిషయము లిట్టివి పెక్కుకలవు. పెద్దనార్యుని గౌరవమంతయు నందే యిమిడియున్నది. ప్రాచీన విమర్శకులు అలంకారములు, లక్షణము మొదలగు వానిని విమర్శించియున్నారుగాని, యిట్టి విషయములు విమర్శించి వ్రాయలేదు. ప్రాచీన విమర్శనములు నిష్ప్రయోజనములని నాయుద్దేశముకాదు. ప్రాచీనాశయములందెంత విలువగలదో ప్రాచీనవిమర్శనములందును నంత విలువగలదు. వానికిఁదోడు నూతన మార్గమునఁ గూడ గ్రంథములు విమర్శించి, ప్రాచీనుల యాదర్శములు నూతన మార్గమున నాంధ్రలోకమున వ్యాపింపఁజేయుట విమర్శకులకుఁ గర్తవ్యము. భాషాభిమానులందఱు నా కార్యము నారంభించినచోఁ బ్రాచీనాంధ్రుల గౌరవము తెలిసికొనుటకును, అనుసరించుటకును నిలుపుకొనుటకును గూడ సాధ్యమగును

—మండపాక పార్వతీశ్వరశాస్త్రి.

# పుష్పవిరహము.

మరుమూసి ప్రాణంబు ♦ ముంజేత నుంచి
నవపల్లవ శుభాస ♦ నమునఁ గూర్చుండి
చలిగాలి బాధను ♦ సైరణఁ జేసి
మంచుమున్నీటిలో ♦ మాపటివేళ
నీనామ మంత్రంబె ♦ నిర్మలనిష్ఠ
నక్షర లక్షల ♦ నైన జపించి
యుదయ రాగాగ్నిలో ♦ హోమంబు చేసి
సాక్షాత్కరించెడి ♦ సమయంబటంచు
నీకయి దోసిలి ♦ నిలిపితినిట్లు
ప్రత్యక్షమగు మయ్య ♦ ప్రాణేశ! నాకు
వరమీయుమయ్య ♦ మిప్పుడ దేవ నాకు—
ద్వారంబుఁ దెఱచి నీ ♦ దరిసెనమునకు
నెంతో సేపటినుండి ♦ యీక్షించుచుంటి
నిన్న నే వేళనో ♦ నిలయంబుసొచ్చి
కాళులునిల్పకే ♦ కపికాటు గాఁగ
నేమిభుజించితో ♦ యెఱుఁగను గాని
మాపటినుండియు ♦ మంచినీరైన
నెఱుఁగక యుపవాస ♦ మే సేయుచుంటి
విందాక రావైతి ♦ వెట్లోర్చుదాన
సూర్యపాకంబున ♦ శుచిమీఱ నేఁడు
వేడి పాయసమును ♦ వేడ్కతో వండి
నట్టింటఁ బెట్టితి ♦ నా ప్రాణనాథ!
చల్లారిపోయిన; ♦ కెక్కనేయుదువు
నే వేగ రావయ్య ♦ విందారగింప:—
హృదయేశ! యిటుచూడు ♦ మీ తూర్పుకోన
గారుచిచ్చుదయించి ♦ కాల్చుచున్నాడె
నతిలోకభీకర ♦ మైన యావహ్ని
కలికనై యుండిన ♦ కాలంబునందు
నేమూలడాగనో ♦ యేమిగా గాని
యిప్పుడేనడివీధి ♦ కెగఁ బ్రాకుచుండె
నే నెటు సైరింతు ♦ నీతాపమునకు
నించుక నామీదఁ ♦ గృపగలదేని
వీక్షింపుమిచటికి ♦ విచ్చేసి నన్ను
నీచల్లనగు చూపు ♦ నే కోరుచుంటి

నీదర్శనంబునె ♦ నేఁగోరుచుంటి
నీగానవృష్టినే ♦ నేఁగోరుచుంటి
నాసామి రావయ్య ♦ నన్నుద్ధరింప
తనువుమఱచి యుంటి ♦ తలుపులు తెఱచి
నీరాకఁ గాంక్షించి ♦ నేఁదొంగితొంగి
చూచుచునుండంగఁ ♦ జూపోపలేక
తమచెద్దములనైనఁ ♦ దలఁపంగఁబోక
గాలిసోకినదేమొ ♦ గానియెఱుంగఁ
దగుదుసుంచును దమ ♦ తలలూచికొంచు
సరివాడలోని నా♦సవతులందరును
పకపకనవ్వి ర♦ప్పుటికి నేఁదెలిసి
వలపులమాట! యే♦వ్వారలమాట
నాతలనే పుట్టె♦నా యనుకొంటి
పరిభవమిది గాదు ♦ ప్రాణేశనాకు
ననుఁగృపఁజూచిన ♦ నాఁడె వారలకు
బరిభవమగుఁగాక-♦ పంతింబుదీర
నాసామి రావయ్య ♦ నన్నుద్ధరింప:—
పన్నీటికలయంపి ♦ పైపయిఁజల్లి
మునుకొనిపుష్పాడి ♦ మ్రుగ్గులువెట్టి
చిగురుతోరణముల ♦ సిద్ధంబుచేసి
యత్తరుదినుసుల ♦ నాయత్తపఱిచి
పలుచనిరేకుల ♦ పానుపమర్చి
యెల్లపనుల్ దీర్చి ♦ హృదయేశనీదు
చరణసంసేవకై ♦ సంసిద్ధనైతి
సాదరంబునదాస్య ♦ మంగీకరించి
యాలయికఁదీర్చుకో ♦ నైనరావయ్య!
సమధికగుణసాంద్ర! ♦ వట్పదచంద్ర!

—వేంకట పార్వతీశ్వర కవులు.

# అనవేముని ఉప్పుగల్లు శాసనము

శాసనస్వరూపము—ఇది మూఁడంగుళములవర వెడల్పు పదియంగుళములవర పొడుగుఁగల రాగి రేకులు నాల్గింటిపై రెండు వైపుల వ్రాయఁబడినది. నాల్గురేకులకొక రంధ్రముచేయఁబడి యందొక వలయము వేయఁబడినది. వలయాగ్రముననున్న ప్రతిమ గుఱుతింప వీలుకానంతగ నరిగిపోయినది. ఈ శాసనము కృష్ణాజిల్లా వంతెనలో భూమి త్రవ్వుచుండ నేలలోఁ దొరకినది.

శాసనభావ—శాసనమంతయు శ్లోకములతోఁ గూడియున్నది. గ్రామపు హద్దులు మాత్రము తెలుఁగు భాషగను మిగిలిన గ్రంథమంతయు సంస్కృతముగనున్నది. లిపి యనితల్లికలువచేరు శాసనము లిపికంటె నించుక మోటుగ నున్నది. పూర్ణానుస్వారము పూర్వమందుఁ గల వర్ణములకు ద్విత్వము కలదు. ద వర్ణము డ వర్ణముగను, ధ వర్ణము ద వర్ణముగను వ్రాయఁబడియున్నది. ఈ యను వర్ణము "గ్గ" అని వ్రాయఁబడినది. గుడికి దీర్ఘము, ఏత్వము ఓత్వములకుఁ బొల్లులు లేవు. వ వత్తు బ వత్తువలె నున్నది. ఖ ఛ ధ లోనగు వర్ణములకు నొత్తులు లేవు. వలపలగిలక రేఫ వత్తునకు మాఱు వాడఁబడినది. ట వర్ణము తలకట్టులేని డ వర్ణముగ నొత్తు నైనఁ గలిగియున్నది. ప్రతాపరుద్రునినాఁటి శాసన లిపియు నీలిపియు సమానముగ నున్నది. హద్దులలోనున్న వెలంగపదము వృక్షవాచకమె యైనయెడ నర్ధానుస్వారము చింత్యము. పుట్టియనునది దేవళమునకుఁ బర్యాయపదముగనున్నది. ఇది గ్రంథస్థమగు నర్థమని తోఁచదు. "తెరువుమోఁప" అను పదమునందలి "మోఁప"శబ్దమున కర్థము తెలియరాదు. శ్రీనాథకృతమగు పిరంగిపుర శిలాశాసనములోఁ బ్రకృతశాసములోని రెండు ధ్యానశ్లోకములు కానవచ్చుచున్నవి.

శాసనచరిత్రాంశము- శూద్రవంశము (చతుర్థవంశము) పవిత్రమైనది. అందుఁ గాలక్రమమునఁ బ్రోలరాజు జనించను. ఆయనకు, అహోబిలమునకు శ్రీశైలమునకు సోపానముల నిర్మించిన వాఁడును- పిఁగనారాయణ ఓబు దాంకితుఁడును- కుండి, కృష్ణా, గోదావరీ తరంగణులకు ఉభయతటముల బ్రాహ్మణుల కగ్రహారము లొసంగినవాఁ

డు నగు వేమభూపతి జనించెను. ఆయన కనపోతభూపాలకుఁడు, అన్న వేమనృపతి యను నిరువురు పుత్త్రులు జనించిరి. అన్న వేముఁడు జగరక్షపాల బిరుదాంకితుఁడు. అన్నయగు నన్నపోత భూపుని యనంతర మన్న వేమ నృపతి రాజ్యము (పైతృకము) పరిపాలించెను. ఇతఁడు పూర్వనృపాల దత్తములగు నగ్రహారములు మ్లేచ్ఛులచే నపహరింపఁబడ వానిని జిరుగ సాధించి బ్రాహ్మణుల కొసంగెను. పూర్వరాజులచే నపహరింపఁబడి భాగములు చెడిన "ఉప్పుగల్లు" అను గ్రామము నీయన శా. శ. ౧౨౪౩ సరియగు క్రీ. శ. ౧౩౨౧ సంవత్సరమున బ్రాహ్మణుల కగ్రహారముగ నొసంగెను. శాసన రచయిత అన్నపోతభూపుని యాస్థాన కవియగు బాలసరస్వతి.

చరిత్రపరిశీలనము:—కాకతీయుల పరిపాలనమున కనంతరము రాజ్యము కల్లోలమైనది. మ్లేచ్ఛాదులు విజృంభించి పరరాజ్యముల నాక్రమించిరి. అత్తఱి సామ్రాజ్యము స్థాపించినవారిలో వేమారెడ్డియొకఁడు. ఈయన యద్దంకి రాజధానిగఁ బూంగిదేశముఁ బాలించెను. పూర్వము వంగవోలు తాలూకాలోని కొంత భాగమునకుఁ బూంగిదేశమని పేరుండెనేమో. కొండవీటి కైఫీతులో, నీవేమభూపాలుఁడే కొండవీట సామ్రాజ్యము స్థాపించినట్లు- ధరణకోట త్రవ్వి కొండవీటిలోఁ బుట్టకోటఁ గట్టినట్లు- అంతకుమున్నా భాగముఁ బాలించు కాకతీయుల వధించినట్లు- చెప్పఁబడెనేగాని యిది యదార్థమని తోఁచదు. గోదావరి మండలస్థములగు నొక శాసనములవలనఁ బ్రోలయ వేముని పుత్రుఁడగు నన్నవేముఁడే కొండవీట సామ్రాజ్యము స్థాపించినటుల

"తతోన్న వేమనృపతిః...అపాలయత్
కొండవీడుం రాజధానిం సతిచిత్రామకల్పయత్"

తెలియవచ్చుచున్నది. కైఫీతువ్రాసినవారు అన్నవేముని ప్రోలయవేమునిగ భావించి యటులవ్రాసియుందురు. ప్రోలయవేముఁ డద్దంకి రాజధానిగఁ బాలించినటు లాయన కృతినందిన హరివంశములో

"తే.గీ. తనకునద్దంకి తగురాజధానిగాఁ బ
రాక్రమంబున బహుభూములాక్రమించి
యనుజతనయబాంధవ మిత్రజనుల కిచ్చె
నెదురె యెవ్వారు వేమమహీశ్వరునకు."

అని మున్నెఱ్ఱాప్రగ్గడ చెప్పియున్నాఁడు. ఈ ప్రోలయవేముఁడు శ్రీశైలమునకు నహోబిలగిరికి సోపానములు కట్టించినట్లు ప్రకృతశాసనము- అమరుక వ్యాఖ్యాపీఠిక- అనితల్లికలువచేఱుశాసనము- లోనగునవి వాకొనుచున్నవి. అమరావతిలోని యమరేశ్వరాలయ శాసనములోని "బ్రహ్మకుండి కృష్ణవేణ్ణగోదావరి మహానది తటద్వయ తన్మధ్యదేశదత్తానేకాగ్రహారః" అనుసంశమువలన నితఁడు కర్నూలు, కృష్ణా, గోదావరిమండలములు పాలించినటులఁ దెలియుచున్నది. ఈతఁడు క్రీ. శ. ౧౩౨౪ మొదలు ౧౩౫౦ వఱకు రాజ్యముచేసినటుల శాసనాధారములవలన స్పష్టమగుచున్నది. ప్రోలయవేమునకు "అన్నపోతరెడ్డి, అన్నవేమరెడ్డి, కోమటిరెడ్డి యను ముగ్గురు పుత్రులున్నటులును గోమటిరెడ్డి బాల్యముననె గతించినట్లును చరిత్రకారులు నిర్ణయించిరి. వారి వంశములోన నన్నపోతరాజొకఁడె ప్రోలయవేముని పుత్రుఁడని చెప్పఁబడెను. దీనివలనఁ గృతి గ్రహించుతఱిఁ బోతారెడ్డియొక్కఁడె తనయుఁడనియుఁ బిమ్మట నన్నవేముఁడు కోమటిరెడ్డి కలిగిరనియు తెలియును. ప్రోలయవేముని యనంతర మన్నపోతారెడ్డి పైతృకమగు రాజ్యమును శాంతిపాదుకొల్పి క్రీ. శ. ౧౩౫౦ మొదలు ౧౩౬౨ వఱకు పండ్రెండు సంవత్సరములు పాలించెను. ఇతఁడు పద్మనాయకులతోఁ బోరినటుల వెలుగోటివంశచరిత్రము వాకొనుచున్నది. ఈయన పరాక్రమశాలి. అద్దంకియె రాజధానిగ నీయనయుఁ బాలించినటుల నమరావతిలోని యీయన శాసనమొండు తెలుపుచున్నది. ఈయన పుత్రుఁడు కుమారగిరి బాల్యముననుంటచేఁ గాఁబోలు నీయనతమ్ముఁడన్న వేమభూపాలుఁడు రాజ్యము వహించెను. ఈయనయే ప్రకృత ధర్మప్రదాత. ఈయనయే కొండవీట సామ్రాజ్యము స్థాపించినవాఁడు. ఈయనతండ్రి కృష్ణాగోదావరి * కుండితరంగి

* కుండితరంగిణి=గుండ్లకమ్మ.

ణుల యుభయపార్శ్వముల నగ్రహారము లొసంగినటు
లఁ జెప్పఁబడుటచేతను- పైతృకరాజ్యమునకె యీయన
యాధిపత్యము వహించినటుల వాకొనఁబడుటచేతను- నీ
యన యన్నకాలము సామ్రాజ్యము విస్తరింపఁబడినటు
ల కానరాక పిత్రార్జితము యథావిధిగ నిలిచినటులఁ
దెలియుచున్నది. ఇదియు నొక విశేషమె. అన్నవేమ
నృపాలుఁడు మ్లేచ్ఛాపహృతమగు నుప్పుగల్లు అగ్ర
హారము క్రమ్మఱ బ్రాహ్మణుల కొసంగినటు లీ శాసన
మునందు వాకొనఁబడుటచే, బ్రకృతాగ్రహారము కాక
తీయ సామ్రాజ్యము చెడి రెడ్ల సామ్రాజ్యము స్థిరపడక
మున్న మ్లేచ్ఛులు హరించిరని యూహింపనగును. ప్రో
లయ వేముని కాలమునుండి యన్నవేముని కాలమువఱకు
వీరి సామ్రాజ్యమున మ్లేచ్ఛులు మొదలినటులఁ గానరా
దు గాన నీమ్లేచ్ఛాపహరణము క్రీ. శ. ౧౩౧౦ ప్రాంతము
లోనిదై యుండును. అన్నవేమ నృపాలుఁడు ధర్మా
త్ముఁడనియుఁ బరాక్రమశాలియనియు బండితశిఖామ
ణియనియుఁ బ్రతిశాసనము వాకొనుచున్నది. కాని కొం
డవీటిదండకవిలె యీతఁడు దుష్కృత్య మొనరించిన
టులను దండితాతల గౌరవము చెఱిచినటులు దెలుపు
చున్నది. ఇది యెంతవఱకు విశ్వసనీయమొ తెలియదు.
ఈయన వసంతోత్సవము లెక్కుడు గావించుటచే వసం
తరాజను బిరుదము దాల్చి నాట్యశాస్త్రమొండు రచించి
దానికి వసంతరాజీయమని నామమిడెను. ఈయనను
గుఱించి విశేషాంశములు తెలియరావు. క్రీ. శ. ౧౩౬౨
మొదలు ౧౩౮౦ వఱకు నీయన రాజ్యము పాలించినటు
లితరాధారములు తెలుపుచున్నవి. ఈ నృపుఁడు జగన
బ్బగండ, జగరక్షపాల, వీరనారాయణాది బిరుదముల
దాల్చి రాజ్యము పాలించుచు ప్రకృతధర్మము క్రీ. శ.
౧౩౭౧ లో నొనరించెను. తుదకీ నగపాలుని బద్మనా
యకవీరుఁడగు లింగమనాయఁడు చంపి సింహతలాట బి
రుదమందినటుల వెలుగోటివంశచరిత్రమునఁ గలదు. అం
దాధారముతో నిరూపింపమి యథార్థమిదియని విశ్వసిం
పవీలు కానరాదు. అన్నవేమనృపాలుఁడు స్వల్పకాల
మే రాజ్యము పాలించుటయుఁ బద్మనాయకులకు రెడ్డి
వారికి విరోధములుండుటయుఁ జూడ నిజము కావచ్చున
ని తలంతుము. శాసన గ్రంథకర్తయగు బాలసరస్వతిని
గూర్చి విశేషాంశములు తెలియరావు. పరిగ్రహణ
గ్రామము నిరూపింప నాధారములు చిక్కమి నావిషయ
ము పాఠకులకె వదలుచున్నారము.

—శేషాద్రిరమణకవులు, శతావధానులు.

## అన్నవేముని ఉప్పుగల్లు శాసనము.

### ప్రథమ పత్రము మొదటివైపు.

౧. కళ్యాణంజగతాం తనోతుసవిభుః కాదంబినీ
మేచకః। క్రీడాక్రోడ
౨. తనుఃపయోధిప.యసో విశ్వంభరాముద్వహన్। భాగా
పేతఫణాని
౩. వర్తన వశాన్మదాయయస్యాభవ। న్నిర్యత్నభుజ
గేంద్రహారిమణి
౪. భినీఙరాజనప్రక్రియా। తమోహరేతాంతవ పుష్పవం
తౌ రాకాసు పూ
౫. ర్వాపరశైలభాజౌ। రథాంగలీలామివ దర్శయంతౌ
పురాపు
౬. రారేః పృథివీరథస్య॥ సమామాత్య కిరీటరత్నకలికా
పుంజేనకింజ
౭. ల్కనోవాహిన్యామకరందినో దివిషదాం వేదైస్సదా
మోదినః। పాదా
౮. బ్జాదవతారితా మధుకరశ్రేణీవ లక్ష్మీపతేసౌభాగ్యా
యమహీంభువా
౯. ంజాతిశ్చతుర్థీవరా॥ కాలక్రమేణో ధబభూవతత
స్యాంప్రోల
౧౦. క్షితీశోబుధకామ్యసిద్ధ్యై। స్వచ్ఛాయయాతాపహ
రోజనానాంపయ

### రెండవవైపు.

౧. పయోదావివపారిజాతః। తస్మాద్వేమ మహీపాలో వీ
రనారాయణః ప్ర
౨ భుఃజాతోధర్మప్రతిష్ఠాయైపురానారాయణోయథా।
వేమక్షితీశో

3. వృష మేకపాదంఖంజప్రచారం కలికాలనోపాత్। ద
త్తాగ్రహారద్విజవేదళ
౪. కృపదక్రమైరస్ఖలితంచ కార॥ స్తంభాకీర్తికృతే?
సృజంత్యకుశలాభూమి:
౫. శ్వరానశ్వరా। న్నిస్సామాన్యకృతిర్వి నిర్మలమతి శ్రీ
వేమపృథ్వీపతిః । యేన
౬. శ్రీగిరిరప్యహోబలగిరి స్సోపానమార్గాంకితౌ । విఖ్యా
తౌర
౭. చితౌసనాతన యశ స్తంభావలింభూతలే॥ ప్రాదా
త్కుండితరంగిణీ
౮. ముభయతః కృష్ణాంచగోదావరీం విప్రేభ్యః కిలవేమ
భూతలపతి
౯. స్సారాగ్రహాన్ బహూన్ । నైతచ్చిత్ర మనన్యరాజ
సుకరం నిస్సీమ
౧౦. దానంభువోయేన బ్రాహ్మణజాతిమాత్ర సులభో
వృత్తిః కృతాపణ్యతే?

## ద్వితీయ పత్త్రిము. మొదటివైపు.

౧. యత్కీర్తిలోలమనసామురగాంగనా నామాలోకితుం
చముఖరాగమనం
౨. గ్గమూలంశ్రోతుంచ గీతరచనాంసమమప్రగల్భన
సహా తేనయ
3. శ్రుతిత్వం॥ తస్మాచ్చవేమ నృపతే రుదయాదివాద్రేః
ర్జాతాప్రతాపవరకీర్తినిధీ
౪. కుమారౌ। సూర్యేందుతుల్యమహాసావన పోత భూప
శ్రీమన్న వేమనృపతి
౫. ర్జగరక్షపాలః॥ జిత్వా శ్రీయనపోతభూతలపతిర్వీరా
నరాతీన్ బలాదాకృష్ణ
౬. తటినీతటిద్భువమవత్యాగౌతమీస్రోతసః। ఆవింధ్యా
దటియత్కవీంద్ర
౭. వచనంయస్యాపదానస్తుతౌ ప్రత్యబ్దంప్రతిపత్కు దేశజయి
న స్తత్పూర్వపక్షాయి
౮. తం॥ రక్షోనూనమసావశోక విటపిర్నీల స్తమాలఃపురా
గౌరశ్చంపక భూరుహ

౯. కుసుమితశ్చూతశ్శుకశ్యామలః । ఏవంవేమయఅన్న
పోత నృపతేః కీర్త్యాసితా
౧౦. నాంవ నేభాలేభ్యోబహుధావదం త్రిశఖరా ప్రాచీద
శాంశాఖినాం । తస్య—

## రెండవవైపు.

౧. నుజస్తామరసాయతాక్షుశ్రీయన్న వేమక్షితిపాలరత్నం
సారాగ్ర
౨. గణ్యఃకురికాసహామోవిభాతి నీరావావపారదృశ్వా॥
సోయంభ్రా
3. తురనంతరంనిజమహీభారంవహాన్ పైతృకంరాజ్యశ్రీ
రమణిస్వయ
౪. ంవరపతిశ్శ్రీయన్న వేమప్రభుః। పూర్వంమ్లేచ్ఛనృపా
లకైర పహృతాన్
౫. శిష్టాగ్రహారాన్ బహూన్ దాతుంకాతుకవా నుదార
చరితోహా
౬ గ్రిలోకోత్తరః । శాకాబ్దే గుణరత్న భాస్కరమితే
రాడేశకాంకగ్రహేప్రాదా
౭ ద్వేమయఅన్న వేమనృపతిః శ్రీవీరనారాయణః। గ్రా
మంపూర్వ నృపాలకైర
౮ పహృతంవిచ్ఛిన్నభాగం చిరాద్విప్రేభ్యః పునరిప్పగ
ల్లురితియోనామ్నా జ
౯ నైకీర్తితః । అథగ్రామస్యప్రతిగ్రహితారః । భారద్వా
జగోత్రో మంచెన

## తృతీయపత్త్రిము. మొదటివైపు.

౧ సోమయాజి । అల్లాడసోమయాజి । కేశవార్యః। దే
వనార్యః। సాగి
౨ నార్యః। కొమ్మనార్యః। కామనార్యః। సార్ఘభాగి।
సింగనార్యః। ఏతేభరద్వాజ గో
3 త్రాః పండెనార్యః। రుద్రయాభట్టః ద్విభాగి। కృష్ణ
యార్యః। పెద్దనార్యః। కొమ్మయా
౪ భట్టః। భాస్కరార్యః। ఏతేకౌండిన్యగోత్రాః। కూచే
నార్యః। దామయార్యః। మం

౫ చెనార్య్యః। పెద్దనార్య్యః। కాచనార్య్యః। దేవనార్య్యః।
ఏతే కౌశికగోత్రాః। పి

౬ రయార్య్యః। మారయార్య్యః। కందర్పార్య్యః। అప్పయా
ర్య్యః। మల్లుభట్టః సూ

౭ రయార్య్యః। పెమ్మయార్య్యః। బ్రహ్మయార్య్యః। ఏతే
కాశ్యపగోత్రాః। వల్లభార్య్యః

౮ సూచెనార్య్యః। దండెనార్య్యః। కొమ్మనార్య్యః। దేవనా
ర్య్యః। దేవనార్య్యః। గంగనార్య్యః। సె.

౯ ద్దిభట్టః। కామనార్య్యః। లింగయభట్టః। గంగ్గనార్య్యః।
లక్కినార్య్యః। అ

రెండవ వైపు.

౧ న్నయార్య్యః। పెరుమాండిభట్టః। చతుర్భాగి। విశ్వేశ్వ
రార్య్యః। ద్విభాగిః। లింగ్గ

౨ నార్య్యః। సార్థద్విభాగి। వెన్నయార్య్యః। ద్విభాగి। ఏతే
హారితగోత్రాః। పోత

౩ యార్య్యః। అన్నయభట్టః। ప్రోలయార్య్యః। మల్లయా
ర్య్యః। ఏతే శ్రీవత్సగో

౪ త్రాః। అన్నయార్య్యః। తదితరగోత్రాః। అన్నయార్య్యః
మల్లయార్య్యః। ఎతౌ పు

౫ రుకుత్సగోత్రౌ। అన్నయార్య్యః మైత్రావరుణగోత్రః।
నాగయార్య్యః

౬ గార్గ్యగోత్రః। గుండెనార్య్య దేవరాతగోత్రః। మాధ
వార్య్యః। భార్గవగో

౭ త్రః। కొమ్మనార్య్యః భారద్వాజగోత్రః। దేవనార్య్యః
తిప్పనార్య్య। ఎతే కౌశికగోత్రౌ

౮ ఎతేసదుభాగినః॥ భూస్వద్భిర్ద్విజరాజైశ్చ। కనిభిర్గురు
భిర్వృతః। భూసు

౯ రాణాం సమూహోయం। భవ్యే? తిరుపతాంసభాం।
ధర్మోవిరాజితేయేషా

చతుర్థపత్రము మొదటివైపు.

౧ మానసంపన్నమాశ్రితః। అరివర్గదయానమ్రకృతానియమాది
బలాన్వితః॥

౨ కాంతినిర్మలచిత్తానాం యత్రభూమిసుపర్వణాం। అ
నుగ్రహపరైర్ద్రష్టశా

౩ పో స్తత్యనువిూయ్యతే। అథగ్రామస్యసీమాచిహ్నాని
తూర్పునకు కొలనుగుండు

౪ ఆగ్నేయానకు కనుమేలు। దక్షిణానకు భీమరథి అం
గుండి ఉత్తరం ముఖ

౫ మై కునిపడిపోయికలు? కంభంసీమగాను బెజవాడ
తెరువు మోచె

౬ నైరృతికి మల్లేశ్వర దేవరపుట్టి। పడమటపోతుగట్టు।
పడమటికి దేచు

౭ కుంట పడమటిగట్టు। వాయువ్యానకు అలకోడు।
ఉత్తరానకు నూనె

౮ కుంట ఉత్తరపుగట్టు। ఈశాన్యానకు వెలంగగట్టు।
ఎతేషాం మధ్యవర్తి

౯ క్షేత్రం॥ సామాన్యోయంధర్మసేతుః నృపాణాంకాలే
కాలేపాల

రెండవ వైపు.

౧ నీయోభవద్భిః। ఆత్తంసర్వంభావినోపార్థివేంద్రాన్।
భూయోభూయో

౨ యాచతేరామచంద్రః॥ ఏకైవభగినీలోకే సర్వేషామపి
భూభుజాం

౩ నభోగ్యానకరగ్రాహ్యావిప్రదత్తా వసుంధరా। శత్రు
ణాపికృతాంధ

౪ ర్మంపాలనీయః ప్రయత్నత। శత్రురేవహి శత్రుస్స్యా
ద్ధర్మశ్శత్రుర్నక

౫ స్యచిత్॥ స్వదత్తాద్ద్విగుణంపుణ్యం పరదత్తానుపాల
నం। పర

౬ దత్తాపహారేణ స్వదత్తం నిష్ఫలంభవేత్। స్వదత్తాం
పరదత్తాంవా

౭ గోహరేతవసుంధరాం। షష్టివర్ష సహస్రాణివిష్ఠా
యాం జా

౮ యతేక్రిమిః। అన్నపోతనరేంద్రస్య విద్వాన్ బాలసర
స్వతి। అకరో

౯ దాకరోవాదాం? నిర్మలంధర్మశాసనం మంగళమహా
శ్రీశ్రీశ్రీ...

# వగవకుమా తల్లి - వగవకుమమ్మ!

పదియారు కళలతో ♦ బాగొప్పుచున్న
చందమామ మొగంబు ♦ చాటుగాఁ బెట్టి,
పొగమంచు సన్నంపు ♦ ముసుఁగు వైఁగప్పి
యుత్తరగాడ్పు ని ♦ ట్టూర్పులంబుచ్చి
యాకులపాటుతో ♦ నంగముల్ వడక,
నెఱిపుంచుఁజినుకుఁ గ ♦ న్నీరు కారంగ,
నేలయేడ్చెదవమ్మ ♦ యేలయేడ్చెదవు?
వగవకుమాతల్లి ♦ వగవకుమమ్మ—
నీదుకన్నులనుండి ♦ నీరుకారంగ
భరియింపలేమమ్మ ♦ భరియింపలేము.

* * * *

పాటలీనగరంబు ♦ పాలించు వేళ
మధుమాససౌభాగ్య ♦ మహోన్నతిఁ గాంచి
ధరణికోటను నిల్చి ♦ తనరారు వేళ
గ్రీష్మభానునిరీతిఁ ♦ గ్రీడ కావించి,
యేకశిలాపురి ♦ నేలు కాలమున
వార్షికాంభోధర ♦ ప్రతిభచే మించి
వేగిదేశంబున ♦ వెలసియున్న పుడు
శారదచంద్రికా ♦ పూరంబునించి
తుంగభద్రాసరి ♦ త్కూలంబునందు
హైమసంప్రాప్తితో ♦ నట్టిట్టు నిలచి
చదువుసాములలోన ♦ జాణవైనట్టి
కొడుకుఁగుఱ్ఱలఁ గాంచి ♦ కొమరొందినావు;
తోడివారలలోనఁ ♦ దులలేక నీవు
తలయెత్తికొని నిల్వఁ ♦ గలిగినావమ్మ;
గుణయశోవంతుఁడౌ ♦ కొడుకబ్బుకన్న
కన్నతల్లికి వేఱె ♦ ఘనమున్నె తల్లి!

* * *

కాలమెల్లపుడొక్క ♦ గతినుండఁబోదు
దైవకృత్యంబును ♦ దాటఁగా వశమె?
యావనావిర్భావ ♦ మైన కాలమునఁ
జెయిలొంగక నీకుఁ ♦ జెడ్డవారగుచు
వేదశాస్త్రంబుల ♦ విధులు మీరుచును,
ప్రాచీన మానుల ♦ వాక్యముల్ దాటి
కులమతదూరులై ♦ కొడుకులందఱును
నెగుచుచుండఁగఁ గొంద ♦ ఱీక్షించివచ్చి
యెగురవైచినబంతి ♦ యేపుమీరంగఁ
బండుపట్టినరీతిఁ ♦ బట్టుకొన్నారు.
ఆకారణమున నీ ♦ వానందముడిగి
శోకవారాశులలోఁ ♦ జిక్కియేడ్చెదవె?
నీవేడ్వఁగాఁ జూచి ♦ నిలువలేమమ్మ
వగవకుమాతల్లి ♦ వగవకుమమ్మ

* * *

అదియేమొ వినవమ్మ ♦ యావంకనుండి
తేనెసోనలకన్నఁ ♦ దీయగానున్న
పానకంబునకన్న ♦ బాగుగానున్న
పలుకొంకు చెవులలోఁ ♦ బడుచున్నదమ్మ-
ఔనౌను వినవమ్మ- ♦ అదినిశ్చయముగ-
వింతశాకులలోన ♦ వింతగాఁ బెఱిగి
కాకిని నేఁగాను- ♦ కాను కాననుచుఁ,
గోయిలగుంపులోఁ ♦ గూడియున్నట్టి
వింతకోయిలయొకటి ♦ విపులంబుగాను
కోకోయటంచును ♦ గూయఁగాసాగె.
కోకోయనంగను ♦ గొమ్ముకొమ్మన్న
నర్థమొక్కటిగాన ♦ నాపలుకులను
ధైర్యంబుగొనుమని ♦ తాత్పర్యమేమొ!
ఆగుమాగుము- దాని ♦ నంటివేగతుల
కోకో ప్రతిధ్వనుల్ ♦ గూయఁగాసాగె.
వింతకోయిలపాట ♦ విని మెచ్చివచ్చి
యామూల నీమూల ♦ నాసక్తితోడ
బారులాడుచుఁగోరి ♦ పోరులాడుచును,
అనుకరించుచునుందు ♦ రదిగొ బాలకులు
అనుకరించినవారి ♦ ననుకరించుచును,
రెట్టించి రెట్టించి ♦ ప్రీతిమీరంగఁ
గోయిలబాలుర ♦ కూఁతలేపారు
నేమూలఁజూచిన ♦ నేవంకఁగన్న

కోకోప్రతిధ్వనుల్ ♦ కూడఁగాఁ జొచ్చె
ఆనందసూచకం ♦ బదిగాన నీకుఁ
గష్టముల్ పాసెడు ♦ కాలంబువచ్చె,
వాసంతసంపత్తి ♦ వర్ధిల్లునింక
నీబాలతిలకముల్ ♦ నేర్పుగాంచెదరు,
కోమలగంధులై ♦ కొమరొప్పఁగలరు,
వగవకుమమ్మరో ♦ వగవకుమమ్మ.

* * *

ప్రజలస్వాతంత్ర్యసౌ ♦ భాగ్యంబునిల్పు
నల్పదేశముల మ ♦ ర్యాద గాపాడ
న్యాయధర్మము స్థాప ♦ నంబు గావింపఁ
గంకణంబునుగట్టి ♦ కడుపేర్చుఁబూని,
సంగ్రామవహ్ని ని ♦ స్సందేహముగను
ద్రొక్కి శౌర్యంబుతోఁ ♦ జక్కాడుచున్న
పార్థివోత్తములు నీ ♦ భావి సౌఖ్యంబు
నీదుస్వాతంత్ర్యంబు ♦ నీదు మర్యాద
న్యాయైకబుద్ధిఁ గా ♦ పాడఁబోయెదరు.
అడగకయున్నచో ♦ నమ్మయూంజెట్టి
దడిగినంత నొసంగ ♦ ననుకొను గాన
నప్పుడప్పుడు కోప ♦ మంచుచుండెదరు
కృపలేక కాదమ్మ ♦ కృత్రిమంబిదియు.
ఈకోపవహ్నికి ♦ నీతాపవహ్ని
కినుమంత భయమంద ♦ నేటికోయమ్మ.
వగవకు తల్లిరో ♦ వగవకుమమ్మ.

* * *

"హాలండు" దేశంబు ♦ నందు జన్మించి
యాంగ్లేయదేశంబు ♦ నందుఁ బెంపొంది
శ్వేతవస్త్రిలుగల్గు ♦ సిమలందెల్ల
నల్లిబిల్లిగనల్లి ♦ వ్యాపించినట్టి
స్వాతంత్ర్యమల్లికా ♦ సారభ్యలక్ష్మి
నీపాదములయొద్ద ♦ నిలిచియుండంగ
వద్దని వారేల ♦ పలుకుదురమ్మ?
పలికిన యంత నే ♦ వ్యర్థమైచనునె?
నిన్నఁగన్నులుమూసి ♦ నిదురించియున్న
యమ్మలకక్కలు నేఁడు ♦ హాయిహాయనుచు
తలలెత్తికొనినిల్వఁ ♦ దగియుందురేని
పావనంబులలోనఁ ♦ బావనంబగుచు
దైవతంబులకెల్ల ♦ దైవతంబగుచు
వర్ధిల్లునీపాద ♦ పద్మంబునెవఁడు
త్రాళ్లతోఁగట్టంగఁ ♦ దలపోయునమ్మ
తలపోయుఁచో, వాని ♦ తలఁ బెవ్వఁడైనఁ
లక్ష్యపెట్టునె? యశో ♦ లాభంబుకోరి
భయమున నయమున ♦ బంధనంబులను
ద్రెంపివేయఁగఁగోరి ♦ తెంపొందుఁగాని-
వగపేలనమ్మరో, ♦ వగపేలనీకు,
వగవకుమాతల్లి ♦ వగవకుమమ్మ.

—మండపాక పార్వతీశ్వరశాస్త్రి.

# ఆర్యసమాజ మతము – తద్విమర్శనము.

మన భరతఖండమునందు ఎన్నియో మతములు జాతులు, గలవు. ఈమతములను వైదికములు అవైదికములని స్థూలదృష్టితో మనము విభజించి చెప్పవచ్చును. అనగా వేదము- ధర్మశాస్త్రములు- వీనిని ప్రమాణములుగ గ్రహించు మతములు వైదికములనియు, శ్రుతిస్మృతులను ప్రమాణముగ నంగీకరింపని మతములు అవైదికములనియు తాత్పర్యము.

ప్రప్రథమమున మనభరతఖండమునందు సాంఖ్యమతము అవైదికము పొడసూపెను. పిదప క్రమక్రమముగ బౌద్ధ చార్వాక జైనాదిమతములు, తరువాత మహమ్మదీయ క్రీస్తుమతములు, తదవాంతరభేదములగు బ్రహ్మసమాజాది మతములు వ్యాపించుచున్నవి. ఇవన్నియు కొంచెమెచ్చు తక్కువగ ప్రత్యక్షముగనో పరోక్షముగనో మనవేదములను దూషించు మతములే. కావున ఇయ్యవి అవైదికము

లనవచ్చును. ఆయామతములవారు తమతమమతములు అవైదికములనియు చెప్పుకొనుచునే యున్నారు. సుమారు ౯౦ సంవత్సరములనుండి ఆర్యసమాజమను క్రొత్తమతమొకటి యేర్పడినది. ఈమతమునకు స్థాపకులు శ్రీ స్వామిదయానందులవారు.

వీరు తమమతము వేదసమ్మతమనియు, ఇతరులమతము అనగా ఇదివఱకు హిందువు లనుకొనువారలు కేవలము వేదమునేగాక స్మృతిపురాణేతిహాసముల నంగీకరించుచున్నారు కావున వారిమతము అవైదికమనియు చెప్పియున్నారు. కొంచెమించుమించుగ హిందువులాచరించు సదాచారములన్నియు దురాచారములనియు, అవైదికములనియు వీరుస్పష్టముగ పలికిరి. తదనుయాయు లిప్పుడదేపలుకు పలుకుచున్నారు. హిందువు లనువారలు వేలకొలది సంవత్సరములనుండియు తమమతము వైదికమని చెప్పుకొనుచుండుటయు, ఇతర మతములవారు హిందువులను వేదమతానుయాయులని వ్యవహరించుచుండుటచేతను ఆర్యసమాజమువారిమతము వైదికమా? హిందువులమతము వైదికమా? అనుసంశయము తటస్థులకు కలుగుట సహజము. కావున నేను తటస్థబుద్ధితో ఉభయపక్షములవారినిగూర్చి ఒకింత వ్రాయుచున్నాడను.

ఆర్యసమాజమువారు తమమతము వైదికమనిచెప్పుచు శంకరవిద్యారణ్యాది పూర్వాచార్యమార్గమునకు విరుద్ధముగ కొన్నినిర్ణయములను ఏర్పఱుచుకొని, తమరు స్వకపోలముగ నిర్ణయించుకొనుచున్నామనినచో ప్రామాణికముకాదని ఇతరులందురను తలంపుతో కొంతసాక్ష్యమును సైతమిచ్చినారు. వారిసిద్ధాంతములను తద్విమర్శనమును ఈక్రిందనిచ్చుచున్నాడను.

ఇదివఱకు శంకరవిద్యారణ్యాద్యాచార్యులు ప్రామాణికులగు సకలవ్యాఖ్యాతలు మంత్రబ్రాహ్మణాత్మక భాగద్వయమును వేదమని అంగీకరించిరి. ఆధునికులగు మనయార్యసమాజమువారు. "బ్రాహ్మణభాగము వేదముకాదు." అనినిర్ణయమునుచేసికొనిరి. వారట్లనుటకు ఉపపత్తిని ఇట్లు చెప్పిరి:—

౧. బ్రాహ్మణభాగముకూడ వేదమేయని కాత్యాయనునికంటె భిన్నులయిన ఋషులు చెప్పనందువలనను

౨. అవి వేదవ్యాఖ్యానరూపములగుటచేతను,

3. మనుష్యులు రచించుటచేతను,

౪. పురాణేతిహాససంజ్ఞలు గలవియగుటచేతను,

బ్రాహ్మణగ్రంథములు వేదములనఁబల్లవు. అని ఋగ్వేదాదివేదభాష్యపీఠికయందు స్వామిదయానందులవారు చెప్పిరి.

## బ్రాహ్మణభాగము వేదము కాదను దాని విమర్శనము.

కాత్యాయనునికంటె భిన్నులయినఋషులు మంత్ర బ్రాహ్మణభాగములు వేదమని చెప్పినంతమాత్రముచేత కాత్యాయనుడు చెప్పినదికాదనుటసాహసము. ఇతరఋషులు నిషేధించియుండలేదు. కావున కాత్యాయన మహర్షియొక్కఁడు చెప్పినను బ్రాహ్మణభాగముకూడ వేదమనియే చెప్పవలయును.

ఇదియునుగాక కాత్యాయనమహర్షియొక్కఁడు తప్ప తదితరులు బ్రాహ్మణభాగమును వేదముగా అంగీకరింపలేదనుట అతిసాహసవాక్యము.

౧, "మంత్రబ్రాహ్మణ యోర్వేదనామధేయం" అని ఆపస్తంబమహర్షియు

౨. "మంత్రబ్రాహ్మణమిత్యాహుః" అని బోధాయనమహర్షియు

3. "విధిమన్త్రయోరైకార్థ్యమేకశబ్ద్యాత్" ౨.౧.30 అని జైమిని మహర్షియు.

౪. "ఆమ్నాయః పునర్మంత్రాశ్చ బ్రాహ్మణానిచ" అని అథర్వవేదీయకల్పసూత్రకారుఁడగుకౌశికమహర్షియు

౫. మంత్రబ్రాహ్మణయోర్వేద నామప్రోక్తమృగాదిషు॥ శుక్రనీతి. ౪. ౨౨౧. అని శుక్రాచార్యులవారును బ్రాహ్మణభాగము వేదభాగమని అంగీకరించిరి.

ఉదితేఽనుదితేచైవ సమయాధ్యుషితే తథా। సర్వథావర్తతే యజ్ఞఇతీయం వైదికీశ్రుతిః ॥ మను. ౨.౧౫.

దీనియందు ఉదితానుదితహోమపక్షమును గూర్చిన ప్రసంగము గలదు. ఈ ప్రసంగము ఐతరేయ శతపథ బ్రాహ్మణములందు వివరింపబడియున్నది. మనుస్మృతికారుడు దీనిని గూర్చియే "వైదికీ శ్రుతాం" అని చెప్పెను గావున మనుస్మృతికారుని యభిప్రాయము ననుసరించినను బ్రాహ్మణభాగముకూడ వేదమని చెప్పబడియే యున్నది.

గౌతమాది షడ్దర్శనకారులును, తద్వ్యాఖ్యాతలును, పాణినిపతంజల్యాది మహామునులును, శంకరాచార్యాది సకలాచార్యులును వీరువారని పరిగణనమేల- స్వామిదయానందులవారికంటె పూర్వమునందున్న విద్వాంసులందఱును బ్రాహ్మణభాగముకూడ వేదభాగమనియే అంగీకరించియున్నారు.

ఇదియునుంగాక అతిప్రాచీన వేదవ్యాఖ్యాతయగు యాస్కాచార్యుడుసైతము బ్రాహ్మణము వేదభాగమని అంగీకరించియున్నాడు.

## వేదవ్యాఖ్యానరూపములనుదాని విమర్శము.

బ్రాహ్మణభాగము వేదవ్యాఖ్యానరూపమగుటచేత వేదమని చెప్పబడవగదని దయానందులవారు చెప్పియున్నారు. వేదముకాదనుటకు ఈయుపపత్తిచాలదు. తాము వేదమని నమ్మెడి అథర్వవేదసంహితయందుసైతము కొన్ని మంత్రములు వ్యాఖ్యానరూపములయి యున్నవిగదా? అప్పుడు వారిసిద్ధాంతము వారికే విరోధమగుచున్నది.

## మనుష్యులురచించిరనుదాని విమర్శనము.

బ్రాహ్మణగ్రంథములను మనుష్యులు రచించిరనుట సాహసము. వేదములెల్లు భగవన్నిర్మితములో బ్రాహ్మణగ్రంథములుకూడ భగవన్నిర్మితములని ఆచార్యులు ఋషులు అంగీకరించిరి. వేదములందును ఇట్లేగలదు.

మం. ఋచస్సామానిఛందాంసి పురాణంయజుషాసహ।
ఉచ్ఛిష్టాజ్జజ్ఞిరే సర్వేదివిదేవాదివిశ్రితః॥అథర్వ ౧౧.౭౨౪

అరేఽస్యమహతో భూతస్య నిశ్వసితమేతద్య దృగ్వేదో యజుర్వేదః సామవేదోఽథర్వాంగిరస ఇతిహాసః పురాణంవిద్యా ఉపనిషదః శ్లోకాః సూత్రాణ్యను వ్యాఖ్యానాని వ్యాఖ్యానాన్యస్యైవైతాని సర్వాణి నిశ్వసితానీతి॥
బృహదారణ్యకోపనిషత్. ౪. ౪. ౧౦.

ప్రజాయత ఋగ్వేదో యజుర్వేద స్సామవేదోఽథర్వాంగిరస ఇతిహాసః పురాణమ్॥ శతపథ. ౧౪. ౫. ౬.

ఇట్లే తైత్తిరీయారణ్యకమునందును బ్రాహ్మణగ్రంథములు సైతము సంహితాభాగమువలెనే భగవత్కృతములనియే కలదు. కావున బ్రాహ్మణగ్రంథములు పౌరుషేయములని స్వాములవారు చెప్పినది ప్రమాణరహితమని చెప్పితీరవలయును. బ్రాహ్మణగ్రంథములు పౌరుషేయములగునెడల సంహితాగ్రంథములుకూడ పౌరుషేయములే అగును.

## పురాణేతిహాససంజ్ఞలు గలిగియుండుట.

పురాణేతిహాససంజ్ఞలు కలిగినంతమాత్రముచేత వానిని వేదములని చెప్పగూడదనుట అర్థరహితము. ఇతిహాసములు లిఖుచుగ వానియందుండుటచేత అయ్యవి భగవత్కృతములుకాదని ఒకచోట స్వాములవారు చెప్పిరి. కాని అదియు అసంగతమే. ఋగ్వేదమునందుసైతము యమయమీ సంవాదాదికము, ఉర్వశీపురూరవేతిహాసమున్నగు అసంఖ్యాకములగు ఇతిహాసములున్నవి. అట్టి ఇతిహాసములున్నను మనస్వాములవారును, మనము, మిగిలినవారందఱును, ఋగ్వేదాదిసంహితలను వేదములని ఎట్లుగ్రహించుచున్నారమో అట్లే బ్రాహ్మణగ్రంథములనుకూడ వేదములనియే గ్రహించితీరవలయును. ఇతిహాసములున్నంతమాత్రముచేత బ్రాహ్మణగ్రంథములు అవైదికములయి అప్రమాణములగునెడల ఇతిహాసములుగల ఋగ్వేదాదిసంహితలుకూడ అప్రమాణములగునుగదా! కావున శ్రీస్వాములవారు బ్రాహ్మణగ్రంథములు వేదములుకావనుటకు చూపినయుపపత్తులకు సమాధానమిచ్చినాడను. కావున బ్రాహ్మణగ్రంథములుకూడ వేదములేయని మున్మాటికి చెప్పుచున్నాడను.

ఎవ్వరేని యిందులకు వ్యతిరేకముగ దగిన ప్రమాణము లగపఱచి నిర్ణయించునెడల ప్రత్యుత్తరమిచ్చుటకు సిద్ధముగ నున్నాఁడనని చెప్పి ఈవిషయమును విరమించుచున్నాఁడను.

## ధర్మశాస్త్రములు వేదవిరుద్ధ గ్రంథములా !

ఆర్యసమాజమతమువారు ధర్మశాస్త్రములు వేదవిరుద్ధార్థబోధకములని స్వకపోలకల్పితమగు నొకసిద్ధాంతమును చేసికొని సనాతనధర్మానుయాయులనుచూచి పరిహాసించుచున్నారు. కాని మఱల శ్రీస్వాములవారు తమ సత్యార్థప్రకాశికయందు అచ్చటచ్చట ధర్మశాస్త్ర గ్రంథములనుండి ప్రమాణవచనముల సంగ్రహించియేయున్నారు. ధర్మశాస్త్రములు వేదవిరుద్ధార్థ బోధకములని ప్రాచీనాచార్యులెవ్వరనియుండలేదు.

అందఱిచేతను మాన్యగ్రంథముగ పరిగ్రహింపబడిన భారతమునందు

శ్లో. శ్రుతిస్మృతీమమైవాజ్ఞే యస్తేఉల్లంఘ్యవర్తతే ।
ఆజ్ఞాచ్ఛేదీమమద్రోహీ నమద్భక్త నాత్రసంశయః॥ అనియు

మనుస్మృతియందు,

శ్లో. శ్రుతిస్తు వేదో విజ్ఞేయోధర్మశాస్త్రంతువైస్మృతిః।
తేసర్వార్థేష్వమీమాంస్యే తాభ్యాం ధర్మోహినిర్బభౌ॥

అనియుఁగలదు. రెండునుధర్మవిషయమునందు ప్రామాణ్యములేయని ప్రామాణికులందఱుఅంగీకరించినారు. పూర్వమీమాంసాశాస్త్రకారులును ఇట్లేపలికిరి.

కవికులచూడామణి యగు కాళిదాస మహాకవి ఉపమానముగ "శ్రుతేఃవార్థం స్మృతిరన్వగచ్ఛత్" అని ప్రయోగించియున్నాఁడు. దీనివలనధర్మశాస్త్రములు వేదవిరుద్ధార్థబోధకములు కావని సుస్పష్టమగుచున్నది. సుప్రసిద్ధములయినగాని ఉపమానముగ నెచ్చటగ్రహింపరు గదా ! సంగతిసందర్భములిట్లుండ ఇదివఱకున్న ఆచార్యులందఱును, మహర్షులందఱును అంగీకరించినవిషయమునకు విరుద్ధముగ శ్రౌతసిద్ధాంతమొకదానిని ఏర్పఱచి విధిలేక తామే మఱల అందులకువ్యతిరేకముగ ధర్మశాస్త్ర వచనముల ప్రమాణములుగా చూపుటయే శ్రీస్వాములవారి సిద్ధాంతము దుర్బలమని చాటుచున్నది. శ్రీస్వాముల వారికొక ధర్మశాస్త్రములేకాదు. గృహ్యశ్రౌతసూత్రములునైతము ప్రమాణగ్రంథములు కావట -ఇదియేవింతలోవింత. ఇన్నిసంవత్సరములకు ఉపనయనము చేయవలయును, ఈయాశ్రమమందిట్టిపనులు ఆచరింపవలయును, ఇట్టిదండమునుధరింపవలయును- మున్నగు సకల విషయములు గృహ్యసూత్రముల సహాయములేకయు, ధర్మశాస్త్రసహాయములేకయు మనము తెలిసికొనలేము. కేవలముసంహితాభాగమువలన మనము ఈవిషయమును గ్రహింపవచ్చుననుట పిచ్చిమాట. వేదమునుచదివినవాఁడెవ్వఁడును ఈ మాట అనఁజాలఁడు. శ్రీస్వాములవారు తాము అనన్యగతికముగ ఆయాకాలములందు చేయవలసిన సంస్కారములాచరింపవలయుననుటకు వేదమంత్రములను ప్రమాణముగ గనంబఱచజాలక ధర్మశాస్త్రవచనములనే ప్రమాణముగ నిచ్చినారు.

## గుణకర్మలచేత జాతి నిర్ణయము ?

సాధారణముగ మాలమాదిగెలు జీవనము చక్కఁగా జరుగునను తలంపుతో క్రీస్తుమతమునందు చేరుచున్నటుల, ఆర్యసమాజమతము వ్యాప్తియందున్న తావులలో శర్మలు- వర్మలు అను ఉపాధులను పెట్టుకొనవచ్చునను తలంపుతో శూద్రాదిజాతులవారు ఆర్యసమాజమునందు గొట్టెదాటుగ ప్రవేశించుచున్నారనుట అతిశయోక్తి కాదు. జాతి యనుశబ్దమువల్లనే జన్మచేత జాతి సిద్ధించుచున్నదని యర్థమగుచుండ గుణకర్మలచేత జాతిసిద్ధించునని చెప్పుట స్వాములవారి స్వకపోలకల్పితములలో నొకటి. నిజముగా ఆర్య సమాజమువారు హీనజాతులవారిని ఉచ్చజాతులవారిని ఒకచోట కలిపి వారిచేత పరస్పరముభోజన ప్రతిభోజనాదికమును జరుపుచుండబట్టియే హీనజాతులవారు ఆర్యసమాజమతమునకు మూగుచున్నారు. శ్రీస్వాములవారుగాని వారి తరువాతవారుగాని గుణకర్మలననుసరించి వర్ణముల నేర్పఱుచవలయు

నను అర్థముగల వేదమంత్రము నింతవఱకు ఒకదానినిగాని గనంబఱచలేదు. కనంబఱచలేరు. ఇట్టి స్వకపోలకల్పితముగ సకల ప్రాచీనాచార్యమతములకును, మహర్షి మతములకును విరుద్ధముగ పలుకు వచనములందు పరప్రత్యయనేయబుద్ధులగువారు కొందఱు తాత్కాలికముగ తమకేదో గొప్పకలుగునను తలంపుతో విశ్వాసముంచి ప్రవర్తించినను చిట్టచివరకు దానివలన గొప్పయనర్థమును తప్పక పొందగలరు. కావున స్వకపోలకల్పితమునను సరించి చరించుట యధర్మమని చెప్పి ఈ విషయమును విరమించెదను.

శిక్షాధ్యాయమునందు పూజ్యుల యాచరణములందు అశాస్త్రీయము లున్నయెడల వానిని వదలి శాస్త్రీయములున్నయెడల గ్రహించుట యుక్తమని చెప్పఁబడియున్నది. కావున మనమును అట్టే గుణమును గ్రహించి తక్కిన దానిని వదలెదము.

శ్రీ దయానందసరస్వతీస్వాములవారు చెప్పినదానిలో ఒక బ్రహ్మచర్య పరిపాలనము తప్ప తక్కినవన్నియు అశాస్త్రీయములును, అనర్థదాయకములును అని విధిలేక చెప్పవలసివచ్చినందులకు చింతించుచున్నాడను. బ్రహ్మచర్య పరిపాలనమునందును ఉన్నదికొంత లేనిది కొంత కలిపి యేమేమియో వ్రాసియున్నారు. ఇత్యాది చాలవఱకు నిర్మూలమయియున్నది. దానిని అవకాశము ననుసరించి విమర్శించెదను.

౧ ఋతుమతీ వివాహమే ఆచరణీయము.
౨ పితరుల నుద్దేశించి శ్రాద్ధాదికము నాచరింపగూడదు.
౩ భగవంతుని కవతారములులేవు.
౪ గంగాదితీర్థములందు స్నానమొనర్చుట పుణ్యకరము కాదు.
౫ భగవన్నామ స్మరణవలన లాభములేదు.
౬ భగవద్విగ్రహముల బూజింపఁగూడదు.
౭ ఉపనిషత్తు లప్రమాణములు.
౮ షడంగములు వేదవిరుద్ధార్థ బోధకములు.
౯ బ్రాహ్మణ, కల్పసూత్ర, గృహ్యసూత్రాదికములు వేదానుసారులు కావు.
౧౦ పుట్టుకకును వర్ణమునకును సంబంధములేదు.

మున్నగువానిని స్వయముగ సిద్ధాంతముల నొనర్చినారు. ఒక్కదానికైనను వేదమంత్రమును ప్రమాణముగ గనంబఱచలేదు. వేదములను అన్వయించు నిమిత్తము వ్యాకరణాది షడంగము లేర్పడియుండగా షడంగములు వేదవిరుద్ధార్థబోధకములని మన స్వాములవారభిప్రాయపడినారు. వారి శిష్యప్రశిష్యులన్నో బాహాటముగ షడంగములు వేదవిరుద్ధార్థ బోధకములని సభలలో చాటుచున్నారు. ఆ గ్రంథముల ముఖ్యమొగముగాంచని వారలింతకంటె యేమి యనఁగలరు ?

శ్రీస్వాములవారు ప్రాచీనాచారపరాయణులును, సనాతనాగరకులును యేవగించుకొనునట్టి "నియోగ" మను (అనగా స్త్రీపురుషు లిరువురు పరస్పరమితరత్ర ఉండుట సంభవించునట్టి కాలమునందును, మఱికొన్ని కాలములందును ఇతర పురుషుని భర్తగా పరిగ్రహించి అతనివలన దేహసౌఖ్యమును పొందవచ్చును. ఇట్లే పురుషుడు స్త్రీలను గ్రహింపవచ్చును) లజ్జావిహీన కృత్యమును సదాచారమునుగా తమ సత్యార్థ ప్రకాశికయందు వ్రాసియున్నారు. అట్లు క్రమముగ ౧౧ భర్తలను పరిగ్రహింపవచ్చుననియు వారనుజ్ఞ నిచ్చియున్నారు.

ఇత్యాది జుగుప్సాకరమని కాబోలు శ్రీ చిలకమర్తి లక్ష్మీనరసింహముగారు స్వాములవారి చరిత్రను వ్రాయుచు చరిత్రకారు డున్నది ఉన్నట్లు వ్రాయుట కర్తవ్యమని యెఱింగియు ఈ విషయమును జారవిడిచినారు. అంతటితో ఊరకుండక వారంగీకరింపని విధవా పునరుద్వాహమును అంగీకరించిరనియు వ్రాసినారు.

—కనుపర్తి మార్కండేయశర్మ.

# గ్రంథ విమర్శనము — "పద్మావతి"

పద్మావతి గ్రంథకర్త పెనుగొండ వాస్తవ్యులగు గొద్దము రంగారావుగారు. ఇది అనంతపురమునందున్న ఎ. పి. కవిగారి బి. బి. గ్రంథమాలలో నైదవగ్రంథముగఁ బ్రకటింపబడినది. వెల రు ౧—౮—౦.

కాకతీయరాజ్యరమాభుజంగుఁడు శూరశిఖామణియగు రుద్రదేవుడు చోడోదయుని సుతయగు పద్మావతిని పెండ్లాడుట యిందలి కథ. పలనాటివీరులలోఁ జేరొందిన నాయకురాలను నాగాంబ తనప్రభువగు నలగామరాజునకుఁ బెండ్లిగాకుండఁజేయనెంచి - అంతకుమున్న నలగామునకు వాగ్దత్తమైన పద్మావతిని, రుద్రదేవునికిప్పింపుమని నాయకురాలు కామరాజును ప్రేరేపణఁజేయుటతోఁ గథాసూత్రమారంభింపఁబడినది. నాయకురాలియాజ్ఞ పాలింప రుద్రదేవునకుఁ బద్మావతినంటఁగట్టవలెనని కామరాజు పాటుపడసాగెను. భీమరాజనువాఁడు (వర్ధమాన పురాధిపతి) మహాదేవరాయలు (రుద్రదేవునితమ్ముడు) కాకతీయసామ్రాజ్యసేనాపతియగు జేతిరెడ్డికిఁ బద్మావతినిప్పించి, జేతిరెడ్డిని సైన్యముచేసికొని రుద్రదేవుని మట్టుపెట్టఁదలంచిరి. కానఁ బ్రతినాయకులు మహాదేవరాయలు, భీమరాజు. నాయకుఁడు రుద్రదేవుడు. నాయిక పద్మావతి. ఇది కథాసందర్భమునుబట్టి నిరూపించిన నాయికానాయక నిరూపణము. వీనిని గ్రంథకర్త యెటులఁబాటించెనో పాత్రములనెటులఁ బోషించెనో తెలిసికొందము.

పద్మావతి - గ్రంథకర్త పద్మావతిపాత్రమును పోషించుటలోఁ జాలలోపము లొనరించెను. పదునాలుకవత్సరముల వయస్సుగలది పద్మావతి. హిందూసుందరుల స్మరించినచో నవానస్త్రీడావతి కాఁదగినదియె. కానియీయమ పలుమారులు సిగ్గుపట్టము విడచినది. ఈయమ మేనమామ కామరాజొకమారు, "అమ్మా మానువుకొండకు వత్తువా! అటరుద్రదేవుఁడు నిన్నుఁబెండ్లాడు"నన-ఒకట్లైయె మేనమామతో మానువుకొండకుఁ జేరినది. రుద్రదేవుని పెట్టిగఁజూచినది. కాదుకాదు. రుద్రదేవుని ప్రతిబింబమును, చూడఁగానే వలపు-పరవశము. ఇంతలో రుద్రదేవునిరాక- పద్మావతి లజ్జవహించుట. ఈకావ్యరీతులన్నియు జరిగినవి. రుద్రదేవుఁడీకొలఁది వెచ్చమునకె మురిసి పద్మావతిని"యెప్పుడేని చూచిపోవత్తువా" యని ప్రశ్నించె, ఆయమ "ఎప్పుడుపిలిచికొనిన నపుడువత్తు"ననె. ఇదియా మోహస్వరూపము! ఇది ప్రణయనిర్ణయమా! ఇందు రుద్రదేవుఁడు కీచకునికంటె భోగలంపటుఁడుగను పద్మావతి తారకంటె వలపులాడిగను చిత్రింపఁబడినది. ఇంతితోఁ బద్మావతి యూరుకొనక తనపై వలపుదల్చిన జేతిరెడ్డి మెడలో దండవేసెను. ఇప్పటికీయమ యిద్దఱిని సమముగాఁ బ్రేమించినది. ఇదిచూచి కామరాజు కోపించి బెదరించిపోయెను. విషముత్రాగి పడియున్న రుద్రదేవునకుఁ బద్మావతి పరిచర్యసల్పెను. రుద్రదేవుఁడు సేదదేరి నిన్నె పెండ్లాడెదనని పద్మావతిచేతి కుంకమము పెట్టి ప్రమాణము కావించెను. ఇఁక జేతిరెడ్డి గతి యెటులమాయనో తరువాత పద్మావతికొన్నాళ్ళకుఁ దనతండ్రితోఁ దాను రుద్రదేవుని వరించినటులఁ జెప్పికొనినది. జేతిరెడ్డినో యని భీమరాజడుగ లేదనియెను. చూచితిరా! ఈయమ బొంకులాడితనము.

హేమలత- ఈయమ భీమరాజుకొమార్తె. పద్మావతికి మేనత్త. ఈయమ మూర్ఖురాలు!. రుద్రదేవునిజూచి మోహపోయినది. పద్మావతికిఁ గిట్టదు. తండ్రిమాట వినదు. మగడువద్దు. తండ్రి కాకతీయమహాదేవరాయని పెండ్లాడుమన "ఆకాకినికాల్చిరి. ఆగాడిద నింకేమనవలెను. ఆభర్త కగ్గిపెట్టు"మనినది. ఈ వెంకిపిల్ల యెవ్వని వరింపలేదు. వలపు నెవ్వనికిఁ గట్నమీయలేదు. విషము త్రాఁగినది. కథామధ్యమున దుర్మరణమఁదినది. ఈపాత్ర మేల కల్పింపఁబడినదో గ్రంథకర్త యీపాత్రమునకు కథాసూత్ర మెంత సంబంధింపఁజేసెనో తెలిసికొన వీలులేదు.

మంగమ్మ— స్థిరనాయకుని పుత్రి. ఈ తండ్రి

బిడ్డలకథ యుండుకేనిలేదు. వీరియిరువురు దహనమొందుట- వీరి జీవితము- కథకు నెంతయేని సంబంధించినది కాదు. మంగమ్మ కన్యాత్వము ఫలశూన్యమైనది.

నాయకురాలు నలగామరాజునకు లంజెయనియు నలగాముని 'ప్రియతమా' యని సంబోధించెననియు గ్రంథకర్తగారు వ్రాసిరి. నాయకురాలు వీరయువతి. రాజ్యకరణప్రజ్ఞాశాలిని. వీరచరిత్రప్రణీత మొదలు నేఁటివఱకున్న చరిత్రకారులు నలగామునకు నాయకురాలకు లంకెలు గట్టలేదు. ఇది చరిత్రవిరుద్ధము. ఈ యుభయపాత్రములు వ్యభిచారదోషదూషితములగుటఁ దక్క ప్రకృతకథ కించుకేని సంబంధింపఁ జాలవు. విశుద్ధబ్రహ్మచర్యవ్రతాచారలోల యగు నాయకురాలిని కులటగ మార్చి నలగామునికి ముడిపెట్టుటకంటె దోషమింకొకటి లేదు. బ్రహ్మనాయఁడు, గండుకన్నమనీఁడు, పేరనీడు, బాలనద్దేవులు, రేచఁడు లోనగు పాత్రములు కేవలము కవితా సృష్టికి గాని కథాసృష్టి కించుకేని యుపయోగింపవు. రుద్రదేవుఁడు అనతమ్ముఁడొనరించు ద్రోహోద్యమములు గ్రహింపమియుఁ, దత్కాలమునకే కృష్ణవర్మయె కొండచిలువయి యుద్ధపడుచు సమానపశక్తుల జూపుటయుఁ, ప్రకృతకథ కించుకయు సంబంధముగ లేదు. కృష్ణవర్మయెవఁడో, రుద్రదేవుని కెట్టి సంబంధముఁగలవాఁడో, ఆతఁడు రుద్రదేవునియందు విశ్వాసము కలవాఁడగుట కెద్ది హేతువో నెంతయేని తెలియదు. బాలచంద్రునితల గన్నమనాయఁడు నఱకబోవ కత్తివిఱుగుట- చేతాళుఁడు రేచనికిఁ బ్రత్యక్షమగుట- పిడుగుల వాన- ద్రవ్యరాసి తమకు తామె పైకివచ్చుట- లోనగు నమానుష కార్యములు వర్ణింపఁబడుటచేఁ గథా సందర్భమా యాభాగములలోఁ బురాణములతోఁ బోలుచున్నది. మహాదేవరాయలతో దురాలోచన మొనరించు భీమరాజు పద్మావతిని హరించి యాదగిరిలో దాఁచెను. ఆయమ యటనుండి తప్పించుకొని యటకెంతయో దూరమందున నల్లగొండకు, తరువాత గోదావరి మండలములోని సామర్లకోటకు ధవళేశ్వరమునకుఁ, బిమ్మట నెల్లూరునకు రెడ్డిపాలెమునకుఁ గాళహస్తికిఁ బోయెను. సమీపమున నొక పల్లెలో గొల్లవేషమునుండి యావును గొని పాలు పెరుగమ్ముకొనుచు లక్ష్మక్క యను పేరు వహించెను. ఆవల యేలూరు, బెజవాడ, వర్ధమానపురి, కర్నూలు మండలములోని గోణాచలము, శ్రీశైలమునకుఁ బోయి తుదకు శ్రీశైలమునఁ దాతలనాఁడు వలఁచిన రుద్రదేవుఁడున్న వార్తవిని యటనున్న మల్లికార్జునయోగి వద్ద భిక్షుకురాలై వసించెను. పద్మావతి యొనరించిన కాలిప్రయాణము- తిరిగిన గ్రామములు- పడిన పాటులు- పరిశీలించి యీ యమకు మల్లికార్జునయోగి చెంతఁ జేరువఱకెంతవయస్సో నిర్ణయింతము.

గండుగన్నమనాయఁడు బాలచంద్రుని చంపఁ బ్రయత్నించి చంపకమాలలఁ గొనిపోయిన మఱుసటినాఁడు నాయకురాలు కామరాజుతోఁ- బద్మావతి రూపవతి, ఆయమను నలగాముఁడు పెండ్లాడకుండఁ జేసి రుద్రదేవుని కంటగట్టమనినది. తరువాత కామరాజు పద్మావతిని రుద్రదేవునివద్దకు హానుమకొండకుఁ గొంపోయెను. తత్క్షణమే వలపుకలిగెను. కాని బద్మావతికి నవలారచయిత కల్పనము చొప్పునఁ బదునాల్గేండ్లకుఁ దక్కువయుండవు. అప్పటికి బాలచంద్రుఁడు పురిటి పాప. తరువాత బాలచంద్రుఁడు పెద్దవాఁడై పెండ్లిపేరంటములు చేయించికొని పద్మావతిని వెదక బయలుదేరి సీతక్క యను పరిచారిక వేషముదాల్చె. బాలచంద్రుఁడు వివాహితుఁడగుటచే వెలకు నప్పటి కిఱువదివత్సరములువాఁడై యుండును. బాలచంద్రుని పుట్టుకనాటికున్న వయస్సు పదునాలు సంవత్సరములు, బాలచంద్రుని వయస్సు యిఱువది సంవత్సరములు, కలిపినఁ బద్మావతి యాదగిరి నుండి విముక్తురాలగువఱకు ముప్పదియాఱేండ్ల చిన్నది. తరువాతఁ గాళహస్తివఱకు, సామర్లకోటవఱకు, శ్రీశైలమువఱకుఁ జేసిన కాలిప్రయాణములు నాలుగు సంవత్సరములనుకొనినను గథానాయికకు శ్రీశైలములోని యాశ్రమము చేరువఱకు నలువది వత్సరములు వయస్సుండును. ఈనలుబదియేండ్ల పెండ్లికుమార్తెకు రుద్రదేవునకుఁ జరిగిన వివాహసంబంధ మెంతపరిహాసాస్పదమైనదో పద్మావతి యాంధ్రదేశమంతయుఁ గాకివలెఁ దిరుగుట

యెంతరసాభాసము తెలుపవీలులేదు. రుద్రదేవుని కీలెక్కచొప్పున నలుబదినాలుగు వత్సరములు వయస్సుండును. ఇట్టిబద్మావతి చిక్కదని మఱియొక పిల్లను విచారించికొనెను. ఇరువురకు బరస్పరము మోహము కలిగినది. ఇంతలో మహాత్సంభవయగు పద్మావతిని రుద్రుడు పెండ్లాడెను. రుద్రదేవుని వలచిన మనోరమ- నిరాశావశురాలయ్యువిచారపడక తనతండ్రి యూరుపేరు లేని కృష్ణవర్మను పెండ్లాడుదువా యన లజ్జచే దలవంచి నాయనా! నీకు సమ్మతమైన నాకు సమ్మతమె యనినదట. ఇట మనోరమ పాత్రము పాడుచేయబడినది. తాను వలచినవాని విడచి పాతివ్రత్యము సంకల్ప నిశ్చలము ప్రకటింపక, లేని మగనికన్న యున్న గ్రుడ్డి బావ మేలని నటుల నలభ్యుడగు రుద్రదేవునికంటె కృష్ణవర్మయె చాలుననుకొనుటకు సిగ్గుపడని మనోరమ ప్రకృతి పరమాసహ్యాకరముగ నున్నది. కథయందలి పాత్రము లన్నింటిలో గామరాజును వరించిన సత్యవతియే కృతార్థురాలు. ఉపాయాంతరమున గథమధ్య గడతేర్చిన మంగమ్మ హేమలతల సత్యవతీ మనోరమలను గ్రంథకర్త యొనరించిన భాగుగానుండునది. బ్రహ్మనాయకునకు విషప్రయోగముచేయబోయిన వేషధారి యెవ్వరో యది కథ కెటుల సంబంధించునో గ్రంథకర్తగారు నిర్ణయింపలేదు. పద్మావతిని దాచెనను గోపముతో భీమరాజుపైకి రుద్రదేవుడు దాడివెడలెను. భీమరాజువెఱచి పాఱి గుహాలోదూరి యట బెబ్బులిచే గతించెను. అటనుండి యుదయచోడుని యూరడింపవలయునని బయలుదేఱ నాతడు వెఱచి పిచ్చియెక్కి రక్తము గ్రక్కి మరణించెను. అక్కడితన రుద్రదేవుని విజయములు రెండు నిరర్థకములైనవియె.

రుద్రదేవుడు పద్మావతి కానరామి వివాహముచేసికొనసెంచి రాజ్యము మంత్రిపైని విడచి, త్రిపురాంతకము, కడప, నెల్లూరు, పల్నాడు, రేనాడు, వేగిదేశము, రాజమహేంద్రవరము, సామర్లకోట, విశాఖపట్టణము, విజయనగరము, శ్రీకాకుళము, కళింగపట్టణము, గోపాలపురము, ఛత్రపురము, పిల్లలకొలను తిరిగెను. ఎచ్చట తనకు సరిపడిన పిల్ల చిక్కలేదట. కడకు శ్రీశైలములోని మాకరాజు అను రైతు కొమార్తె మనోరమ నచ్చినది. రుద్రదేవునియంతటి చక్రవర్తి తెలుగుదేశమంతయు దిక్కుమాలి కన్యకొఱకు వెదకెననుటకంటె విరుద్ధవాక్య మింకొకటిలేదు. రుద్రదేవుడు తన రాజ్యమునసె యున్న యెందఱు సామంతులు, ఎందఱు చక్రవర్తులు తమతనయల గొనిరారు! ఘోటక బ్రహ్మచారిని త్రిప్పినటుల రుద్రదేవుని పల్లెల బట్టణముల ద్రిప్పుట ఆపాత్రమునకుగల యౌచితి గంగ గలుపుటయే. ఇంకను కథాలోపములు పెక్కులు కలవు. భాషాలోపములకు లెక్కలేదు. నవలాసంప్రదాయములు లేమి ప్రకృతాఖ్యాయిక కాశీమజిలీకథవలె నున్నది. వర్ణనల కడమియక, గ్రంథకర్త కథకె యెక్కుడుగ నవకాశమొసంగుట ప్రశంసనీయము. (శే. ర. క.)

# మూడవ కృష్ణామండల గ్రంథాలయ ప్రతినిధుల మహాసభ

౧౯౧౭ సం॥ మార్చినెల ౩౧వ తేది ఉదయము ౭ గంటలకు ఈ సభ గంపలగూడెమునందు కూడెను. సభాభవనమంతయు ప్రతినిధులతోడను ప్రేక్షకులతోడను నిండెను. నూరుమంది ప్రతినిధులు విచ్చేసిరి. ప్రథమమున బందరు జాతీయకళాశాల విద్యార్థులు జాతీయగీతమును పాడి సభను ప్రారంభించిరి. అంతట ఆహ్వానసంఘాధ్యక్షులగు శ్రీ గాడిచెర్ల వేంకటగోపాలకృష్ణారావు బహద్దరుగారు ఈ క్రింది యుపన్యాసమును జదివిరి:—

## ఆహ్వానసంఘాధ్యక్షుల ఉపన్యాసము.

"గ్రంథాలయసంపదలో తక్కుంగల తాలూకాలకం

టి బాల్యస్థితిలోయున్న మాతాలూకాలో ఈ మీరా నరించిన సమావేశము పురోవృద్ధి సూచకము. వాఙ్మయసౌధమునకు గ్రంథాలయమే పునాది. ఏమండలమందు భాషాపరిజ్ఞానము వృద్ధిగానున్నదో పరిశీలింపదలంచిన నట గ్రంథాలయముల సంఖ్యనెరింగిన జాలును. ఆంధ్రగ్రంథాలయము లన్నిటిలో నున్నత పదము నధిష్ఠించి కేవల భాషాసేవకే జీవితసర్వస్వము వెచ్చించు దేశసేవకులతో గూడుకొనిన విజయవాడలోని రామమోహన గ్రంథనిలయపు జలువయే మన యీ సమావేశమునకు ముఖ్యహేతువైనది. భాషాసేవలో పవిత్రస్థానము వహించిన బెజవాడకు సమీపముననున్న మా తిరువూరు తాలూకా ముఖ్యముగ గ్రంథాలయసంపదలో మిగుల వెనుకపడి గాఢనిద్రగాంచుచున్నది. ఈ ప్రతినిధుల యాదర్శములు సభాధ్యక్షుల యుపన్యాసములు, మా తాలూకాలో గ్రంథాలయ బీజముల విరివిగా నాటి భాషాలతల నల్లిపెట్టునని మేమందరము సంతసించుచున్నారము. గ్రంథాలయముల ఉపయోగములు బోధించి, గ్రంథాలయములు స్థాపింప సంచారకార్యదర్శి యీ తాలూకాకే తెంచువరకు నిట భాషాభివృద్ధి కాజాలదు. గ్రంథాలయములలో గ్రామచరిత్ర లుంచుట, గ్రామమందలి చిత్తరువులు శాసనాదులు చేర్చుట, ప్రాచీన గ్రంథముల సేకరించుట, పుస్తకభాండాగారముల విధ్యుక్తధర్మమే. కాని యీ విషయమున నెంతయు గ్రంథాలయములు వెనుకబడియున్నవి. ఇట్టి లోపములు సంస్కరించుకొనుటకే నేడిట సమావేశమైతిమి. మా తిరువూరు తాలూకాలో మూడు గ్రంథాలయములు గలవు. ఒకటి గంపలగూడెములోని శ్రీ కృష్ణరాయ పుస్తకభాండాగారము. దీనికి మాసమునకు రు ౨౦ లు చందాలు వసూలగును. శ్రీ గంపలగూడెం కుమారరాజా వారీ నిలయమునకు పదివందల రూప్యముల విలువగల తమ ౫౦౦ గ్రంథముల దయచేసిరిగన వారీ గ్రంథనిలయము నెంత ఉన్నతపదవిలోనికి తేనున్నది వాకొనబనిలేదు. ఇదియే మా తాలూకాకు మాత్ర గ్రంథాలయము కాగలదు. రెండవది తిరువూరులోని రాజా వెల్లంకి చిన వేంకటరామారావు బహద్దరుగారి గ్రంథనిలయము. దీనికి నడిమి తిరువూరు రాణీగారు రమారమి ౮౦౦ రూపాయల విలువ గలిగిన రెండువందల పుస్తకములును ఒక బీరువాయును దయచేసిరి. మూడవది రెడ్డిగూడెము లోనిది. దీనికి ౧౫౦ పుస్తకములు గలవు. దీనిలో మూడు భాగముల గ్రంథము లా గ్రామవాస్తవ్యులు భాషాభిమానులు అగు దేవలరాజు కేశవరాజుగా రొసంగిరి. ఇంక నీ తాలూకాలో గ్రంథనిలయములు లేవనియే చెప్పవచ్చును. ఈ తాలూకాయం దీ యుద్యమమును విరివిగ వ్యాపింపజేయుటకై విశేష ప్రయత్నములను జేయవలయును."

పిమ్మట ఈ సభకు శ్రీ తల్లాప్రెగడ సూర్యనారాయణరావు పంతులుగారు అగ్రాసనాధిపత్యమును వహింపవలెనని శ్రీ కాశీనాధుని నాగేశ్వరరావుగారు ఉపపాదింపగా శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావు గారు ఆమోదించిరి. అంతట కరతాళధ్వనుల మధ్యమున శ్రీ సూర్యనారాయణరావు పంతులుగారు అగ్రాసనాధిపత్యమును వహించి తమ గంభీరోపన్యాసమును జదివిరి.

## అధ్యక్షుల ఉపన్యాసము.

పరబ్రహ్మాత్మికాం దేవీం। భుక్తిముక్తిఫలప్రదాం।
ప్రణమ్యస్తౌమితామేవ। జ్ఞానశక్తిం సరస్వతీం॥

భాషాసేవాపరాయణులగు మీనయనంబులకు భాషాస్వరూపంబుదక్క మరియెద్దియును గోచరంబు గాకుండుట సహజంబు. మా యాంధ్రవిద్యానిలయంబు తత్కారణంబున తమ మనోదృష్టింబడి దానిచే త్రోయఁబడుచున్న నాకిపుడు మీచే పెద్దతీకం బిప్పించినది. ఆత్మసామర్థ్యంబు నెరుంగనివాడనయ్యుండిన మీరొసంగిన యీగౌరవంబును సత్కారంబుగ నెంచి యెగుబుజంబున నుండియుందును. కాని యీగ్రంథాలయ వాఙ్మయ వ్యవహారంబుల నానభిజ్ఞతను నే నెరింగినవాడనగుటచే మీసన్మానము సమగ్రముగా దలంపకయు పెద్దల నియోగంబు నుల్లంఘించుట మంచిదికాదనియెంచి మీయాహ్వానము నంగీకరింపవలసిన వాడనైతిని. ఈరూపమున నీవిధ

మగు వాఙ్మయమునుఁ బరిశీలింప నవకాశము కలుగఁజేసి
నందులకును ఈప్రాంతముల నెన్నండును జూడ నవకాశ
ముకలుగని నాకీమహాచే నట్టిలాభము కలిగించినందులకును
మీకెంతయు కృతజ్ఞుండ నగుచున్నవాడను. సభాకార్య
నిర్వహణము మీదయ ననుసరించియున్నదిగాని సభాధ్య
క్షుని ప్రయోజకత్వమునఁ లేదు. రాతికి ప్రాణప్రతిష్ఠంజేసి
యధిష్ఠాతంజేసిన నదియె పూజ్యంబగును. తద్భావముమా
రినప్పుడదియె బొమ్మరాయి యగును. త్రొక్కినరాయి
మ్రొక్కినదైవముగదా! పలువురమనస్సు లెచ్చట నేకీభ
వించి పనిసేయునో యచ్చట మున్నులేని శక్తికూడ నా
వేశము కాగలదు. జ్ఞానప్రదాతలగు మీభావనాబలంబున
నాశక్తిసామర్థ్యంబు లత్యల్పంబులయ్యును కార్యసాధనో
త్సాహ మత్యంతమగుచున్నది.

## జ్ఞానము

దైవదత్తము. దానికి సాంగత్యవిశేషమున నుద్బో
ధముకలుగును. తోడివారలతమయంతవారిగ, ఒకొక్కప్పు
డు, తమకంటె నెక్కువవారిగగూడ జేయుచుండును. ఈ
జ్ఞాన మొకనాటిదికాదు. ఒకచోటిదికాదు. దానికాదిలేదు
అంతములేదు. ఆద్యంతశూన్యంబగు నీజ్ఞానాంబుధినుండి
ధీవిశాలురు తమబుద్ధివైశాల్యము కొలంది ప్రజ్ఞాబుద్ధులసం
గ్రహించి వానిని క్రమక్రమముగా విజృంభింపజేయుదురు.
అయ్యది తోడివారలకు వాగ్రూపముననో లిఖితరూపక
ముననో లభింపజేయుచుందురు. వాగ్రూపకమైనయెడల
నక్షరాస్యులకును నిరక్షరకుక్షికినికూడ నుపయోగపడును.
లిఖితరూప మొక్కయక్షరజ్ఞునకే విదితమగును. కాని వా
గ్రూపక మామొక్కయుపాధితోడనే యంతరింపగలదు.
లిఖితరూపకము యుగములకొలది నిలచియుండును. గ్రం
థములన నివియెకదా! వాగ్రూపకముగూడ స్వరయంత్ర
మూలమునను, సంజ్ఞాలేఖన మూలమునను చిరస్థాయిగ
నిలువ నాధారము లేర్పడినవి.

కించిజ్జ్ఞుండును, మితాయుష్మంతుండునునగు మా
నవునకు నాడు లభించినజ్ఞానము నాటితోడనే యంతరిం
చి చిరస్థాయిగ నిలువకుండినయెడ నీజన్మ బంధవిమోచ
నకు మార్గమే లేక యుండియుండును. యుగయుగముల

లభియించిన జ్ఞానము నిల్చియుండుటచేతనే యైహికాము
ష్మిక సౌఖ్యంబులు రెండునుఁగూడ నొకనాటికన్న నొ
కనాడెక్కువగ లభించుట కవకాశము గలుగుచున్నది.
అదిలేకున్న గాలికివిడచిన పారతికకర్పూరమువలె యెప్ప
టిజ్ఞానమప్పుడు శైణ్యమునంది మరల యథాస్థితికి రావ
లసివచ్చుచుండును. శబ్దరూపమును వర్ణరూపకముగ మా
ర్పగలిగిన యావ్యక్తిమహిమ మెట్టిదియోగాని ఆమహావ్య
క్తిజగత్తంతకును మోక్షసాధనమయినది. లిపియేలేకుండిన
మనకు వ్యాసుడులేడు. వాల్మీకి లేడు. కాళిదాసు
లేడు. తిక్కన లేడు. నన్నయలేడు. షేక్స్పియర్
లేడు. వారివారిగ్రంథములు లేవు. గ్రంథాలయము
లు లేవు. జ్ఞానము గ్రంథస్థముగావించు టది తన
కొక్కనికొరకే కాక యన్యులకుకూడ నుపయోగప
డవలెనను నుద్దేశముతోడగదా. అది యెంత విపులముగ
నుపయోగపడిన దానికంత చరితార్థత. గ్రంథస్థమయిన
జ్ఞానమునకూడ తరతమభేదమున్నది. ఏది యెట్టివారి
కుపయోగపడవలెనో అది యట్టివారికి లభింప జేయవలె
ను. వ్యత్యస్తమయిన యెడల వ్యర్థకాలక్షేపమగును.
ఈపనులకొరకే గ్రంథాలయము లేర్పడినవి. గ్రంథాల
యములవలన ముక్తియు, భుక్తియుగూడ నున్నవి. మన
దేశము ముక్తివిద్యకు మూలస్థానమని సర్వమతములవా
రును ఒప్పుకొనియే యున్నారు. దానినిగూర్చిన జ్ఞాన
వ్యాపనముమాట యటుంచి ముందుగ భుక్తికనువగు జ్ఞా
నమును వ్యాపింపజేయు మార్గమునుగూర్చి యాలోచింత
ము. తిష్ఠ కుదిరినగాని నిష్ఠ కుదురదు. మనకు భుక్తి
బాగుగ నుండవలెనని మనదేశము బాగుండవలెను. మ
నయుపాధులు బాగుండవలెను. - వివేకి యగువానికెల్ల
దేశమునకై పాటుపడుటయు దేశాభ్యుదయమును లక్ష్య
మునందుంచుకొనుటయు, విధ్యుక్తము. 'స్వయంతీర్ణః
పరాంస్తారయతి' దేశాభ్యుదయమునకు

## దేశభాషల యభివృద్ధి

ముఖ్యసాధనము. దేశభాషయందు జ్ఞానము వెల్లిరిసి
నగాని కాలాకాలవివక్షతలేకుండ అక్షరాస్య నిరక్షరా
స్యభేదములేకుండ జ్ఞానము దేశమున వ్యాపింపదు. మన

భారతరామాయణములం జూతుడు. ఒక్క అక్షరాన్ననయు మాత్రమేవచ్చి తక్కినవాఁకి రాకుండపోయినవా? ఉగ్గుపాలతో పట్టువడినభాష యెంతచిక్కఁగల భాషయైనను అనర్గళముగ పట్టువడును. తపన్య మెంత సులువైనదైనను పట్టిచ్చుచునే యుండును. ఆంగ్లేయభాషకన్న చిక్కఁగలభాష యున్నదా? ఆంగ్లబాలురులం జూడుడు. ఎంతజాతీయముగ, యెంతధారాళముగ, యెంతసులువుగ మాట్లాడుదురో? మన మెన్నినాళ్లు యెంతెంత శ్రమపడి యభ్యసించినను, ఆజాతివాని జాతీయత మనకు లభించునా? ప్రయత్నసాధ్యమే యగుననుకొన్నను దేశమునందది యెంతమందికి లభ్యముగాఁగలదు. లభ్యమైనను అది యాయొక్కనికే యుపయోగముగాని తోడిదేశమున కది యేమియుపయోగము? దేశభాషలలో గ్రంథములు వర్ధిల్లవలె. దేశాభివృద్ధికలుగవలె. మన

## యాంధ్రభాష

కేవలస్వతంత్రభాష కాక మొదటినుండియును సంస్కృతమువలనను సంస్కృతభాషావేత్తలవలనను అభివృద్ధినందిన భాషయగుటచే తద్భాషాస్వరూపస్వభావములు తెలిసినఁగాని ఆంధ్రభాషాస్వామ్యము కుదరదు. భాషాస్వామ్యములేకుండ వ్రాసిన గ్రంథములు సుబోధములు గాకుండి చేయవలసినంతపని చేయనేరవు. వారికి గ్రంథరచనయు సులభసాధ్యముకాదు. ఎంతజ్ఞానవేత్తలయినను భాషాప్రాభవములేనివారు వ్రాసిన గ్రంథములు దుర్గ్రాహ్యములుగానే యుండును. భావముల స్పష్టీకరించుటకు భాషా సౌలభ్యమావశ్యకము. ఆంధ్రభాషా స్వామ్యము గీర్వాణభాషవలనగాని లభింపదు. ఆంగ్లభాషయే మనకు జీవనాధారమై రాజభాషయగుటచే దేశమునందు ఆంధ్రభాషాభ్యాసముపోయి నిత్యకృత్యభావములను కూడ ధారాళముగ మనమిపుడాంధ్రభాషను వ్యక్తీకరింపలేకున్నాము. పుట్టుకలో భావము లాంగ్లేయభాషను బుట్టుచున్నవి. వాని నాంధ్రీకరించి ఆభాషరానివారికి దెలుపుటకై యెట్లో వెపల గ్రక్కుచున్నారము. ఇట్టి దుస్థితిలో దేశభాషయున్నపుడు మనమెంతజ్ఞానవంతులమును ప్రతిభావంతులమునైననేమి మనయూహల నెట్లు దేశీయులకు వ్యక్తపరుపఁగలుగుదుము? పాశ్చాత్యులైహికసాధనములం దెక్కువకృషిచేసి వానియందు మేరమీరిన విజ్ఞానము సంపాదించియున్నారు. ఆముష్మిక విషయముల మనదేశ మెట్లువర్ధిల్లినదో యట్లే పాశ్చాత్యదేశములు నైహికజ్ఞాన మంతసంపూర్ణముగ సంపాదించినవి. పాశ్చాత్యవిజ్ఞానము భాషాస్వామ్యముగల దేశభాషావేత్తలకడ లేదు. వారువ్రాసిన గ్రంథములవలన దేశమునకుగలుగు ప్రయోజన మత్యల్పము. పాశ్చాత్యజ్ఞానసంపాదకులకు దేశభాషరాదు. విద్యావంతు లీమాదిరివారై గ్రంథములు వ్రాయుచున్నపుడు ఆగ్రంథములవలన సామాన్యజనుల కెట్టియభివృద్ధి కలుగునో జెప్పెడిదేమి? ఆంధ్రసాహిత్యమును పాశ్చాత్యవిజ్ఞానమును జతగా నభ్యసించుటకు తగినయిరవు ఏర్పడుటకు దేశభాషాప్రాధాన్యములగు బడులు బయలుదేరువరకును దేశముయొక్క దుస్థితి యిట్లుండవలసినదే. మనమాంధ్రులముకదా?

## ఆంధ్ర సాహిత్యము

నిప్పుడు ప్రత్యేకముగ సంపాదించుటకు ఒక్కబడియైన దేశమునందున్నదేమో చెప్పఁగలరా? దేశభాషలయందు విద్వత్పరీక్షల విశ్వవిద్యాలయమువారు పెట్టినారా! దానివంక నెవ్వరైన జూచుచున్నారేమో కనిపెట్టితిరా? ఆపరీక్షలకు విద్య నభ్యసించుటకు సాధనము లున్నవా? పరీక్షలయం దుత్తీర్ణులైనవారికి బొట్టబోసుకొనుసుపాధులున్నవా? మదరాసురాష్ట్రమున గవర్నరుపనిచేసిన సర్ థామస్ మన్రోగారు ౩౧-౧౨-౧౮౨౪ తేదీని ఈస్టుయిండియా కంపెనీవారికి వ్రాసిన యుత్తరసారాంశమందు కేవలజ్ఞానమువలన ప్రయోజనమునుగూర్చి యీక్రిందిరీతిని వ్రాసియున్నారు. 'ఏయుగమందుగాని యేదేశమునందుగాని కీర్తియును, ధనమును, అధికారమును, అనవిద్యేజ్ఞానము సంపాదింపవలెనని కోరిక పుట్టించుచుండును. దేశపరిపాలనమునగల వివిధధర్మములయందు తమశక్తిసామర్థ్యములనుబట్టి తమకున్న ప్రజ్ఞయంతయు వినియోగింపరేని దేశసేవచేయు మహత్కార్యమునకు

తమశక్తియెల్ల ధారవోయరేని యెవ్వరెన్నివిద్యల నేర్చిన నేమిప్రయోజనము? విశ్వవిద్యాలయమువారు ఆంగ్లేయ భాషాపరీక్షలకడ దేశభాషలను చేరకుండ కొట్టినారు. పాలకులు వారివిధ్యుక్త ధర్మమును నీవిధముగ విసర్జించి యున్నప్పుడు దేశభాషవృద్ధిలోనికివచ్చెడుమార్గములేదు. దేశీయులువారికర్తవ్య మెరుంగకున్నారు. గ్రంథాలయములవారు ఈపనులకుపూనుకొని, ఆంధ్రగీర్వాణసాహిత్యము పూర్వపుమార్గమున వృద్ధిపొందిదానితోడ పాశ్చాత్య విజ్ఞానము జతపడుమార్గమున విద్యాశాలలు స్థాపింపవలయు. లేకున్న కొంతకాలమునకు గ్రంథాలయములు అలంకారవిద్యార్థులు గావలసివచ్చును. గ్రంథాలయము లొకవైపున జ్ఞానసంపాదనకు తెరవు ఆరయవలయు. ఒకమూల జ్ఞానవ్యాపనకు మార్గ మాలోచింపవలయు. రెండుచేతుల రెండునుబట్టి పనిచేసినగాని మనకు కావలసినకార్యము కావలసినంతత్వరలో కానేరదు. ఆంధ్రసాహిత్యాభివృద్ధికై సర్వసాధనములుగల ఆంధ్ర సాహిత్య పరిషత్తువారు పూనుకొనుట విధ్యుక్తధర్మము. కాని యాసంస్థాపన యేటేట విందులారగించుటతోడ నే సంతుష్టిపొందుచున్నదిగాని తన విధ్యుక్తధర్మము నెరవేర్పకున్నది. ఇప్పుడు

## స్వరాజ్యము

ను గురించిన యాందోళనము దేశమున నెక్కుడుగ జరుగుచున్నదికదా? దేశవిద్య కభివృద్ధిలేకున్న స్వరాజ్యమెక్కడిది? దేశీయులందరునుకూడి రాకుండిన స్వరాజ్యము మనకలవడునా? నాగేశ్వరరావుపంతులుగారి పుణ్యమాయని, ఆంధ్రపత్రిక బయలువెడలి, దేశము నలు తట్టుల దిరిగి, స్వదేశ విదేశపరిస్థితుల దేశమున నలువురి చెవుల బడవేయుచున్నది. తన్మూలమున దేశీయులిప్పుడు తమకును, అన్యదేశములకును గల తారతమ్యమును గ్రహింపగలుగుచున్నారు. దానితోడ నాందోళనము తల చూపినది. ఇంతలో బెసెంటమ్మ బయలుదేరినది. స్వరాజ్యసమితుల దేశము నలుతట్ల మొలక లెత్తజేసినది. మనబండారము బయలుపడి, మనలోపములు మనకు దెలియుచున్నవి. ఇంతకొలదికాలములో నింతకృషిజరుగుటకు గ్రంథాలయములును, పఠనమందిరములే, సహాయకారులయినవి. దేశహితైకాభిలాషు లందరును, ఈగ్రంథాలయోద్యమమునకు మ్రొక్కవలసియున్నది. 'తిలకు' మహాశయుండు బెసెంటమ్మగారు పాడుచున్న యీ స్వరాజ్యపుపాటను ఎన్నినాళ్ళనుంచి పాడుచున్నవారు కారు? ఎంతలెంతలు కష్టములకు పాలైనారుకారు? దేశవిద్యాభివృద్ధికై యెంతకష్టపడినారు? తోడిదేశీయులు వెనుకబడియున్నారు. ప్రయోజనము లేకపోయినది. మహారాష్ట్రదేశమునను బంగాళమునను దేశవిద్య యెంత విరివిగ ప్రబలినదో జూచితిరా?— ఒక్క 'ఆంధ్రపత్రిక' బ్రతుకుటకు మనదేశమునం దెన్నోబాములు పడుచున్నది, రెండువేలకు మించి చందాదారులు లేరు. మహారాష్ట్రమునందు గల 'కేసరి' పత్రికకు ముప్పదివేల మంది చందాదారులున్నారు. బంగాళమునందు 'హితవాదికి' ఇరువదివేలమంది యున్నారు. దేశభాషయందంతజ్ఞానము విజృంభింపబట్టియే 'తిలకు'మహాశయునకు ఆంగ్లదేశమున కిప్పుడుబోవనున్న స్వరాజ్యప్రతినిధుల వెచ్చమునకై ధనము సేకరించుటలో, ఆశ్రయముగ వేనవేలుజనులు పోగుపడి, ఆయన వచ్చిరాకమును పే వేల కొలది ధనమును పోగుచేసి ఒకమాసముదినములలో దాదాపు రెండులక్షలరూప్యముల నొసంగినారు. ఈఒక్క నిదర్శనముచాలదా? స్వరాజ్యప్రాప్తికిని దేశవిద్యలకును సంబంధమున్నదనుటకు పదుగురును వృద్ధిపొందినగాని స్వరాజ్యము రాదు. స్వరాజ్యములేకున్న స్వతంత్రత లేదు. "సర్వం పరవశందుఃఖం సర్వమాత్మవశం సుఖం" పదుగురును కలియుటకు దేశవిద్యలే సాధనములు.

## ఆంధ్రరాష్ట్రము

కావలెనని ఆంధ్రదేశమిప్పుడు కృషిచేయుచున్నది కదా? దాని యాదర్శమేమి? భాషాప్రయుక్తరాష్ట్ర నిర్మాణముకాదా? భాషతో రాష్ట్రము విభజనము గావలయునని కోరువారు తద్భాషావ్యాప్తి కెంతపాటుపడవలయు? భాషావ్యాప్తికి పరమసాధనము వాఙ్మయము.

వాఙ్మయ మెంతవిజృంభణముగానుండిన దేశమున కంత యభివృద్ధి. రాజకీయాందోళనమందు పనిచేయువారంద రును రాజకీయవిషయముల నుద్బోధించు గ్రంథసంపాద నమునకు గడంగవలయు. ఆ వాఙ్మయ మిప్పుడు నామ మాత్రముగ నున్నది. రాజకీయవాఙ్మయము విస్తరిల్లిన గాని, స్వరాజ్యమువలని ఫలము తెలియదు. స్వరాజ్యసం పాదనమైనకాని నిరంకుశాధికారబలము తగ్గదు. అదిత గ్గినగాని దేశమున కేది ముందుగావలెనో యది లభింప దు. దేశమునకు ముందు కావలసినది

## నిర్బంధోచిత ప్రారంభవిద్య

అన్నిపనులు జరుగుచున్నవి. దీనికి డబ్బులేదు. ఎప్పటి కప్పుడు ఏదోయొక సమాధానము. దీనికి డబ్బులేదు సరే. జనుల యజ్ఞానమును తమ స్వయంసహాయమున దేశమున వెడలగొట్టజూచు నీ గ్రంథాలయమున కేల దొరతనమువారు సహాయముచేయరాదు? దీనికి వారిప్పు డు చేయుచున్న సహాయమేమి? గౌరవనీయులగు పోల వరం జమీందారుగారు రేపువచ్చెడి చట్టనిర్మాణసభలో దొరతనమువారు మనరాష్ట్రమున, ఈనిలయములకు చే సిన సహాయమేమియో కనుగొన ప్రశ్న వేసియున్నారు. రాష్ట్రము మొత్తముమీద నీవెచ్చ మెంతయో తేలగల దు. మనమండలములో నిది మనమెరుంగుదుము. దొ రతనమువారి ప్రత్యక్షసాహాయ్యము సున్న. స్థానిక స్వపరిపాలనమువారి సహాయము రెండింటికి. అంగలూ రునకు జిల్లాబోర్డువారు, రామమోహన భాండాగార మునకు బెజవాడ మ్యునిసిపాలిటీవారు. ద్రవ్యమును ఉపాధ్యాయులును లోపముగాని ప్రారంభవిద్య నిర్బం ధముగా నభ్యసింపజేయుటకు వేరాటంకములేదని దొర తనమువారు చెప్పుచున్నారు. నిర్బంధమునకు మున్ను దానిప్రయోజనము జనులకు బోధపడవలయును. లేకు న్న తత్కార్యము లాభదాయకమయ్యును జనులయసం తృప్తికి కారణమగును. జనసామాన్యమున, ఆ ప్రయో జనము వ్యాప్తముచేయుటకు గ్రంథాలయములకన్న వే రుమార్గ మేమున్నది? బాలకులు నేడో, రేపో, పూన నున్న యీకార్యమునకు ముందుగా సాధనసామగ్రి స న్నాహము చేయవలదా? భూమి దున్నకుండ విత్తులు చల్లినప్రయోజన మేమి? టీకాలు వేయుట జనసామాన్యము న కలుగురికిని మంచిదయని తెలియుట కెంతకాలము ప ట్టినది? గ్రంథాలయములు, అక్షరాస్యులకును నిరక్షర కుక్షికినిగూడ జ్ఞానదాయకములుగదా! వీనిమూలము న విద్య యూరూరను వ్యాప్తమయిన, విద్యవలని ప్ర యోజన మనుభవసిద్ధమై తమ పిల్లలకు విద్య నభ్యసింప జేయ నలవాటుపడుదురు. అప్పుడే నిర్బంధము సహ్య మగును. "సర్వారంభాః తండులప్రస్థమూలాః" అన్ని కార్యములకును ధనము కావలెను. ధనము వచ్చుమార్గ ము లేకున్న నేకార్యమును నెరవేరదు. గ్రంథాలయ ము లత్యుత్సాహముతో దేశోపకారమునకై బయలుదే రుచున్నవి. వానికి ధనము పల్లెటూళ్ళలో విద్యావిహీ నులకడనుండి రావలెను. వారికి లాభము తెలియదు. వారియ్యరు. ఆపయిన నిచ్చెదరను నాశతో బయలు దేరిన గ్రంథాలయములకు తిండిలేదు. శూరత్వముతో నారంభమయిన కార్య మట్టె గుంటపూవులు పూయు చుండును. దొరతనమువారి సాహాయ్యమే వీరికి గలిగిన పూనినకార్యము దినదినము 'మూడుపువ్వులు నాలుగు కాయలు'గ వృద్ధినొంది, యీపాటికి యీయుద్యమము దేశమున వేరునాటియేయుండును. బరోడాసంస్థానము నందు ౧౯౧౦ సంవత్సరమున నీయుద్యమము ప్రారంభ మయినది. ఆరాజ్యమున ౩౯ పట్టణములును, ౪౨౬ పెద్ద పల్లెలును గలవు. ఇప్పుడు అచ్చట ౪౪౦ గ్రామగ్రంథా లయములును, ౩౯ పట్టణగ్రంథాలయములును, 3 జిల్లా గ్రంథాలయములును స్థాపింపబడినవి. దొరతనమువా రీయుద్యమమునకు, ఏటేట దాదాపు ౫౦,౦౦౦ రూ ప్యములు వెచ్చబెట్టుచున్నారు. దేశమంతయు కృష్ణా జిల్లాకు మించిలేదు. తన్మూలమున జనుల యుత్సాహ ము కలిగి దొరతనము సహాయమువారి సంపాదించుటకై, ఆలయస్థాపనకు కావలసిన ద్రవ్యములో మూడవవంతు చందాలమూలమున పోగుచేసికొనుచున్నారు. స్థానిక స్వపరిపాలనమువారొకవంతును రాష్ట్రీయ పరిపా లనమువారొకవంతును సహాయము చేయుచున్నారు.

ఈరీతి సహాయము అధమము మన పాఠశాలల కిచ్చు విరాళములవలె సగభాగమిచ్చి ధనసహాయము చేసినను, గ్రంథాలయములు దేశమునకు మిక్కిలి యుపకారకములై యుండును. రామమోహన భాండాగారమెంత యుత్సాహపూరితులచేత నున్నది!

## గ్రంథాలయ సర్వస్వము

ఒక్కదానిని ప్రకటించుటకు ధనాభావముచే వారెట్టి చిక్కులుపడుచున్నారో చూచితిరా? చేతిచమురు భాగవతమెన్ని నాళ్ళాడుదురు? ఈపత్రిక గ్రంథాలయవిద్య నేర్చుకొనువారికి, ఉపాధ్యాయునివలె పని జేయుచున్నది. ఏమూల నేమిపనిజరుగుచున్నదో, ఎట్టి పనులు గ్రంథాలయాభివృద్ధి కుపయోగకరములో, ఎచ్చట మంచిమంచిగ్రంథములు దొరకునో దొరతనమువారి సహాయ్యముగాని, తదితర సహాయ్యముగాని, యెట్లు సంపాదింపవలెనో, తోడివారెట్లుసంపాదించిరో మున్నగు విషయములనన్నింటిని ప్రకటించి, తన జన్మసార్థక్యమును గావించుకొనుచున్నది. నేనెఱిగిన కొన్ని గ్రంథాలయములు తలయెత్తుచున్నవి కేవల ద్రవ్యసహాయమునగాదు ధనాభావముచే కవుల నాశ్రయించి భిక్షాటనముచేసి బ్రతుకుచున్నవి. ఆదరణలేక కవులే కటకటంబడుచున్నారు. గ్రంథములిమ్మని వీరువారిని పీకికొనితినుచున్నారు. వారు బాధపడుచున్నారు. కవుల కీగ్రంథాలయముల మూలమున నింకొకచిక్కుకూడవచ్చినది. మును చెప్పుడైన, అప్పుడప్పుడు ఒకరొక్క రెవ్వరైన పదింటనైదింట ఊరికొకగ్రంథము కొనెడివారు. ఇపుడు గ్రంథాలయమున నుచితముగ లభ్యమగుటచే ఆకొలదియమ్మకముకూడ వారికి నశించినది. కవుల యనిష్టసహాయ్యము వలన నెన్నినాళ్లు గ్రంథాలయములు నిలువబడగలవు? కేవలస్వశక్తినే చేయుపనులకును, సహాయసంపదలతో జరుగు పనులకును, నుండు నుత్సాహతారతమ్యము మీరెఱుంగనిదికాదు. ఆసహాయము దొరతనమువారివద్దనుండియే వచ్చినచో, ఎంతసంతోషజనకముగనుండును! అది అటుండనిండు. గ్రంథాలయములు కట్టుదిట్టముగా పనిజేయుటకై అవి గట్టిపునాదులపై నుండవలెను. అవి పరపతిసంఘములవలె రిజిష్టరీఅగుట అవసరము. ఇప్పటి నిబంధనలనుబట్టి అయినయెడల దొరతనమువారికి సుంకముకూడ చెల్లింపవలసియున్నది. దొరతనమువారు దీనికయినను తగు నేర్పాటులు చేయవలసియుండును. ఈ విషయమై చట్టనిర్మాణసభ్యులు దొరతనమువారిని మేల్కొలుపుదురుగాక. అదిగాక,

## ప్రకృతిశాస్త్రజ్ఞానము

దేశమున వెల్లివిరియుటకై దేశభాషలందు గ్రంథములు వ్రాయించవలెను. ప్రకటనాలయములు ద్రవ్యాభావముచే నీ విషయమున చేయగలిగినంత పని చేయలేకున్నవి. ఒకటిరెండు వ్రాయించుసరికే వాని ఆయువు మట్టమగుచున్నది. గ్రంథము లమ్మిగాని విరాళములను గొనిగాని వారిపని చేయించవలెను. విరాళములను ఇచ్చు లవిడిగా నిచ్చువా రరుదు. పిఠాపురాధీశ్వరులవంటి విద్యాపోషకులు దేశమున నెంతమందియున్నారు? గ్రంథములు అంతగా నమ్మవు. అయమ్మకమయినను ఆశ్రయింపునుబట్టి యున్నది. దొరతనమువారికీ పని సులభసాధ్యము. ఏటేట వారు కొంతసొమ్ము దేశభాషా గ్రంథములకొరకు వెచ్చపెట్టవలెను. ఒకరినో ఇద్దరినో నియమించి వ్రాయించుటకన్న పోటీలకువ్రాయించి అందులో మేలైనవానికి పారితోషికము లియ్యవలెను. గ్రంథముల స్వత్వము గ్రంథకర్తలకువదలివేసి వానిని పాఠగ్రంథముల క్రింద నిర్ణయించిన, విషయముల గట్టిపునాదిగలవారు ఆపని కియ్యకొందురు. ఒక్కరొక్కరుగ వ్రాసిన గ్రంథము ఉత్తమముగానుండకుండిన అన్నింటిని సమీకరణముచేసి మేలిభాగముల నేర్చికూర్చిన వలసినన్నిగ్రంథములు బయలుదేరును. రాజావలంబనము లేక చేయుకృషి తెప్పలేక యీదు విడి యీత వంటిది. దొరతనమువారు దేశభాషయందు ప్రకటించు దేశభాషా గ్రంథములన్నియును గ్రంథాలయముల కుచితముగ నిచ్చుట కర్తవ్యము. దొరతనమువారుచేయు సాహాయ్యమెట్టిదైనను

## స్వయంసహాయము

చేసికొనక తప్పదు. గ్రంథాలయాభివృద్ధికి సొమ్ము కావలయును కదా! స్వయం సహాయమువలన ప్రజలలో నీసొమ్ము లభ్యమగు మార్గము చూడవలయు. మనదేశమున ధర్మాదాయములకును దేవాదాయములకును కొరత లేదు. పూర్వమున విద్యాదానము ద్రవ్యము లేకయే మనదేశమున ఉచితముగా సమకూరుచుండెడిది. భృతికాధ్యయనము గర్హ్యముగ గూడ నెంచబడెడిది. ఆ కారణమున విద్యాప్రదానమునకు వేరుగ నాదాయములు లేవు. దేవాదాయ ధర్మాదాయములు మునుపటికన్న నిప్పుడు విశేషముగ లాభము నొసంగుచున్నవి. వలయుసొమ్ములకన్న హెచ్చుసొమ్ములను సేకరించుచున్నవి. ఆ సొమ్ముల పరిపాలనములనుగూర్చి శ్రీ వల్లూరు సూర్యనారాయణరావుగారు పట్టుదలతో చేయుచున్న కార్యము సంస్తవనీయము. వారు ప్రజల కృతజ్ఞలకు పాత్రులు. దేవాదాయములనుండి మత గ్రంథాలయములను మత విద్యాపాఠశాలలను నేర్పాటుచేయవచ్చును. మఠములుగూడ గ్రంథాలయములను తమయాదాయమునుండి నేర్పరచవచ్చును. మావైపుల వెంటపాడులో నొక మఠమున్నది. దానికి వేలకొలది సొమ్ము రాబడియున్నది. అందలి నిత్యవ్యయము అత్యల్పము. అనవసర వ్యయము అత్యధికము. ఆసొమ్ములు విద్యాప్రదానమునకును గ్రంథాలయకార్యములకును కొంతవరకు వినియోగించిన దేశమున కెంతయో మేలు కలిగెడిది. పనిచేయువారు లేరు. చెప్పువారేగాని చేయువారరుదు. ధర్మాదాయముల సొమ్ములు ఇట్టివిద్యాభివృద్ధియందు నుపయోగించు సాధనముల నారయవలయు. ఊరూరను పల్లెటూళ్ళలో గ్రామఖాయిదా లుండును. ఆ సొమ్ములో కొంతసొమ్ము దీనిక్రింద నుపయోగపరుపవలయును. పరపతి సంఘములవారు తమరాబడిలో కొంతభాగము దీనికీయవచ్చును. వర్తకులు ధర్మమునకని కొంతసొమ్ము పోగుచేయుచుందురు. పట్టణములలో నీసొమ్ము వేలకొలదియున్నది. ఆసొమ్మేమగుచున్నదో సరిగా లెక్కచూచి పోగుచేయువారు మాత్రము లేక్కువ. ఇచ్చుటయును కష్టమే. అందులో కొంతభాగమైనను గ్రంథాలయములక్రింద వ్యయపరుపవచ్చును. మనసు కుదిరిన మార్గము లేకపోలేదు. దేశమున ధర్మము తక్కువగ లేదు. క్రియావంతులు తక్కువగ నున్నారు. ఆక్షేపణలు హెచ్చు. ఐకమత్యము పూజ్యము. ఈమండలముననే, దానినిగూర్చి యోజింతము. ఐకమత్యముకలిగి పనిచేయుచున్న పాతకృష్ణాభాగమునకును క్రొత్తగవచ్చిచేరిన గోదావరీమండల భాగమునకును భేదమారయుడు. మనమండలమునం దిప్పుడున్నవి ౧౪౦ గ్రంథాలయములు. ఇవి ఏభాగమున హెచ్చుగ నున్నవో చూచిన క్రియావంతుల వలని లాభము తెలియగలదు. పాతకృష్ణామండల భాగమున నిప్పుడు పనిచేయువారు హెచ్చుగనున్నారు. వారికి వారిప్రాంతములందు పలుకుబడి హెచ్చు. ఆచుట్టుపట్టుల కుపోవు నవకాశములు మెండు. అందుచేతను ఆ భాగమున పనివృద్ధిగనున్నది. పాత గోదావరీమండలభాగమున కబుర్లవారేకాని పనిచేయువారంతగ కనుపడరు. కార్యోత్సాహము ఉండిన మాత్రముచాలదు. క్రియాకౌశలముకూడ నుండవలయును.

## గ్రంథాలయములు

ఉండవలసినవిధానమునుగూర్చి యోజింతము. ఇందుండవలసినవేవి? గ్రంథములు సరే. శాసనములు, నాణెములు. దేశపటములు, చిత్రపటములు, పత్రికములు, పూర్వపత్రములు, శిలావిగ్రహములు, 'మేజిక్కులాంతరులు,' ఇంకనెయ్యవి జ్ఞానదాయకములో అవియన్నియు పోగుచేయవలెను. గ్రంథములు ముద్రితములు, అముద్రితములుకూడ నుండవలెను. అముద్రితములు ఎన్ని ప్రతులు సంపాదించిన అంతమంచిది. దొరకినతోడనే అముద్రిత గ్రంథముల-గ్రామ గ్రంథాలయముల వారికడనుండు గ్రంథములు కొలదిగనుండ నుగాన-తెలిసినవారు గ్రంథములను జదివి కథాంశమును కవికాలమును పేరునువ్రాసి గ్రంథములతోగూడ కేంద్రగ్రంథాలయమునకో మాండలిక గ్రంథాలయమునకో పంపవలెను. అన్నియు ఒకచోట జేరిన పదిలపరచుటకును కావలసినపని జరుగుటకును గూడ

అవకాశము గలుగును. అముద్రిత గ్రంథములు పోగుచేయుట కష్టసాధ్యమేగాని అంతగ ద్రవ్యవ్యయముతో కష్టించి పనిచేసిన మనదేశమున నెన్నియో యముద్రిత గ్రంథములు బయలుదేరును. ఒక్కమూల కొలదికాలము పనిచేసి 'ఆంధ్రపరిశోధకమహామండలివారు ౧౨౦౦ అముద్రిత గ్రంథములను జేర్చినారు. ఒక్కొక్కప్పుడు ఈ యముద్రిత గ్రంథములకు విలువ అమూల్యముగనుండును. ఈ గ్రంథసంపాదనమువలన వివాదగ్రస్తములగు పూర్వవిషయములెన్నియేని సంశయనివారణమునందును. కప్పుపడిన మహానుభావుల చరిత్రములు బయలుపడును. భాషయొక్క వృద్ధిక్షయములు తెలియును. పుట్టుపూర్వోత్తరములు విడిపోవును. శబ్దతత్త్వము విమర్శింపననువుపడును. దేశముయొక్క పూర్వస్థితికిని యిప్పటిస్థితికిని తారతమ్యము తెలియును. ఇట్టివే ఇంక నెన్నియేని ఉపయోగములున్నవి. 'ఆంధ్రపరిశోధకమహామండలి' వారు ఆంధ్రదేశముయొక్క కృతజ్ఞతకు పాత్రులు. దానిని స్థాపించిన శ్రీయుత చెలికాని లచ్చారావుగారి యాశయము సంస్తవనీయము. దానినిగూర్చి శ్రీ వంగూరి సుబ్బారావుగారు తీసికొనుచున్న పరిశ్రమ మెంతయును ప్రశంసనీయము. ఆంధ్ర గ్రంథాలయమున సంస్కృత గ్రంథములుకూడ నుండవలెను. అవియేగదా మనకు ప్రమాణములు. శ్రుతిస్మృతుల యాంధ్రీకరణము అవసరము. ఈపని కొంతవరకు జరిగినది, జరుగుచున్నది. ఇది కష్టసాధ్యమైనపని. కేవలము ఈపని, భాషాంతరీకరణములనుజూచి చేయదగినపని కాదు. శ్రుతులర్థము చేసుకొనుటకు కేవలము, సంస్కృతసాహిత్యము చాలదు. షేక్సుపియరు, చాసర్ల యింగ్లీషునకు వారికాలములనాటి నిఘంటువులు కావలసివచ్చినట్లులే, వేదార్థమునకు, ప్రత్యేక-నిఘంటువున్నది. స్వరమునుబట్టి అర్థభేదములున్నవి. అవి యన్నియును విచారించి, బుద్ధిసూక్ష్మత కొలది గ్రంథకర్తభావమును గ్రహించి తెలుగుచేయుట అవసరము. అటుపయిన వేదములందు ప్రమాణబుద్ధికూడ గ్రంథకర్తకుండవలయును. అదిలేకుండ మనయుద్దేశమున కనువుగా యిప్పటి, ఆచారముల ననుసరించి అర్థముచేయబడునేని దానికి, అంగవైకల్యము సంభవించును. వేదము భాషాంతరీకరణమునుబట్టి ముందుగ తెలిసినయెడల ప్రమాణమువలయునప్పుడెల్ల వేదమునందలి ఆయాభాగములను తీసిచదివి ప్రమాణముక్రింద నొసంగుచుందురు, దానిని సభలలో నుచ్చరింపవలసివచ్చునెడల మొదల నపస్వరములతో మొదలిడి యాపరిహాసమును వదల్చుకొనుటకై కష్టించి కావలసిన భాగములను స్వరయుక్తముగ నేర్చుకొని పండితు లనిపించుకొనుటకు ప్రయత్నింతురు. ఎట్లయినను నేర్చుట కర్తవ్యము. ప్రమాణమునకు శ్రుతికంటె మిన్నయగునది లేదు. కాన నెదుటివారికి నమ్మకము పుట్టించుటకై సులభసాధ్యంబైనచో, అన్నిటికిని ప్రమాణముగా, దానినే, ఉపయోగింతుము. బైబిలు, ఎన్ని భాషాంతరీకరణములందినదో వేదముకూడ నన్ని భాషాంతరీకరణముల నందవలెను.

తెలుగుదేశమున కంతకును కేంద్రగ్రంథాలయ మొక్కటుండిన చాలును. మండల మండలమునకును వేరువేరు గ్రంథాలయములుండవలయును. పిమ్మటివి గ్రామగ్రంథాలయములు. ఇవన్నియును మీరెరింగినవే. గ్రామగ్రంథాలయమున గ్రంథములెచ్చుగ నుండుట యసంభవము. కాన వానికి వలయుపుస్తకముల పేర్లు గ్రంథాలయసంఘమువారు విమర్శనాసంఘమును, యేర్పాటుచేసి తయారుచేయించుట అవసరము. ఆపట్టిక లేనియెడల పల్లెటూళ్ళకు, నేయేగ్రంథములు, ఉపయోగమో తెలియబోదు. తెలిసినవారికైనను నామరూపములు చూచినమాత్రమున గ్రంథము బాగోగులు బోధపడనేరవు. చదివిచూచినవారు చెప్పినదానిని బట్టి మంచిచెడుగుల నిర్ణయింతుము.

## విమర్శనసంఘము.

ఈ సంఘమేర్పడుటవలన గ్రంథములు నిష్పక్షపాతబుద్ధితో విమర్శింపబడి మంచిగ్రంథములు మనకు దెలియుచుండును. చెడుగ్రంథములు మనకంటబడనేపడక చదివినవి మంచివే చదువుదుము. విమర్శనసంఘముచేత మఱియొకపనికూడ చేయింపవలెను. ఇది ప్రకటనాల

యములకు లాభము. ప్రకటనాలయములకు గ్రంథములు నియతికాలములలో కావలయును. ఆ గ్రంథములు మంచివైనయెడల ఆయాలయము జనసమ్మతమై యాదరణీయమగును. మంచి గ్రంథములు వారికి లభ్యమగు మార్గము మనము చూడవలెను. లేకున్న వారు దొరికినదే దో ముద్రించి మనల వేధింతురు. కవులగువారు గ్రంథాలయమునకు బోకతప్పదు. వారికి విమర్శనసంఘము నుగూర్చియు, విమర్శకులను గూర్చియు, నచ్చజెప్పి, వారి గ్రంథముల విమర్శనసంఘమునకు బంపునట్టు చేయవలెను. ఈసంఘమున యోగ్యతాపత్రము బడసిన గ్రంథములు, ఎవ్వరి ప్రోత్సాహము లేకయే ప్రకటనాలయమునకు, ఆదరణపాత్రములగును. అన్ని ప్రకటనాలయములకును, ఒక్క గ్రంథమే కావలసివచ్చినయెడల గ్రంథకర్తకు ఎక్కువలబ్ధి కలుగును. విమర్శనసంఘమున విమర్శకులెంత యెక్కువగనుండిన నంత మంచిది. గ్రంథకర్త ఆ సంఘ విమర్శకులలో తమ యిచ్చవచ్చినవారిని చీట్లమూలముననో మఱియొకరీతినో, ఏరికొని తన గ్రంథమును వారి విమర్శనకు పాత్రము జేయవచ్చును. గ్రంథాలయమువారు గ్రంథమునందలి కథాంశము, అందలి గుణము, గ్రంథకర్తనామము, విలాసము సంవత్సరమునకో, అర్థసంవత్సరమునకో, ప్రకటించుచుండవలయును.

## గ్రంథాలయ కార్యదర్శి

శక్తివంతుడై యుండవలయును. అమెరికాదేశమునందు ఒక్క గ్రంథాలయ వాఙ్మయమున పదివేలరూపాయల విలువగల గ్రంథములున్నవట. ఆదేశమున వానిని నడుపుట యొకశాస్త్రముగా నున్నదట. అంతగా గాకున్న కొంచెముగనైనను, గ్రంథాలయము నడుపుమార్గముల కార్యదర్శులు కొలదిశిక్షనొందుట ఆవశ్యకము. ఆశిక్షకు వలయు నేర్పాటులు, కేంద్రగ్రంథాలయమువారు బరోడాయందువలె చేయవలయు. రామమోహన గ్రంథాలయమును కేంద్రగ్రంథాలయముక్రింద భావింపవచ్చును. కార్యదర్శులు గట్టివారుండినగాని జరుగవలసినకార్యములు బాగుగాజరుగవు. గ్రంథాలయము బాగోగులు కార్యదర్శినిబట్టియుండును. ఇవి సరస్వతీనిలయములు. వీనియందు దేశీయుల కెంతఆదరముండునో దేశమున కంతవృద్ధియుండును. దేశభాషలయందు గ్రంథములు మెండయిన దేశమున జ్ఞానము వృద్ధియగును. జ్ఞానము వృద్ధిఅయినకొలది సౌఖ్యమువృద్ధియగును. సౌఖ్యమువృద్ధిఅయిన మనస్సునకు స్థైర్యము హెచ్చును. స్థైర్యము హెచ్చిన ఐహికాముష్మికజ్ఞానము సంపాదింపనవకాశముండును. ఐహికమునందు జ్ఞానము వృద్ధిపొందిన ఆముష్మికమునకు దారియేర్పడును. ఆదారిదొరకిన జన్మబంధవిమోచనమగును. అదియే మనుజుని పరమావధి. దానియందు లక్ష్యముంచి ఏకాగ్రభావముతో గ్రంథాలయముల యత్యుచ్ఛదశనందించి, దేశమున జ్ఞానము వెల్లివిరియజేసి, తోడివారలకును, దేశమునకును జ్ఞానప్రదాయకులమై సరస్వతీసేవ సేయుదుమేని, సర్వశ్రేయములును సమకూరును.

సీ. అక్షరాస్యునకు ని◆రక్షరాస్యునకును
సద్యస్సుబోధమై◆వెలయవలయు
ధనమున్న లేకున్న◆తగినగ్రంథముజూడ
నభిలాషగలయప్పు◆డమరవలయు
పదుగురొక్కెడజేరి◆భాషించుతఱి వాణి
భువనమోహిని యగుచు◆బొదలవలయు
వీనులచేనైన◆వీక్షణంబులనైన
మంచిచెడ్డల దృష్టి◆మనుపవలయు
గీ. దేశమెల్లెడ విజ్ఞాన◆దీపవితతి
కలయునదియెల్ల గనుపింప◆వెలుగవలయు
భుక్తియును ముక్తియు◆మహోన్నతి మెలగ
గ్రంథభాండారములుభువి◆గ్రాలవలయు.

(అనంతరము గతవత్సరమున ఈ మండల గ్రంథాలయసంఘము చేసిన పనినిగూర్చి, మండలగ్రంథాలయ సంఘ కార్యదర్శులలో నొకరగు దుగ్గిరాల వేంకటసుబ్బయ్యగారు వ్రాసిన కార్యనివేదికమును కొండాలి శివరామకృష్ణారావుగారు చదివిరి. పిమ్మట, ఈమండలమునందున్న రామమోహన ధర్మగ్రంథాలయము (బెజవాడ)

కేంద్రగ్రంథాలయముగను, ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘముగను నాలుగు దినముల క్రిందటనే చేయబడిన దని అయ్యంకి వేంకటరమణయ్యగారు జెప్పిరి. తరువాత శతావధాని జూపూడి హనుమచ్ఛాస్త్రిగారు వ్రాసి పంపిన పద్యములు చదువబడినవి.

అనంతరము భీమవరము తాలూకాయందున్న గ్రంథాలయములనుగూర్చి నిడమర్తి లక్ష్మీనారాయణగారును, ఎర్రుపాలెం గ్రంథాలయమును గూర్చి మాదిరాజు లక్ష్మీకాంతరావుగారును, దొండపాడు గ్రంథాలయమును గూర్చి గుత్తా వీరయ్యగారును, గంపలగూడెం గ్రంథాలయమును గూర్చి పేట బాపయ్యగారును, రెడ్డిగూడెం గ్రంథాలయమునుగూర్చి అయ్యదేవర లక్ష్మీనరసింహం గారును, తిరువూరు గ్రంథాలయమునుగూర్చి చెరుకుపల్లి పట్టాభిరామయ్యగారును, తేల్ప్రోలు గ్రంథాలయమునుగూర్చి జొన్నల సుబ్బారెడ్డిగారును, జగ్గయ్యపేట గ్రంథాలయమునుగూర్చి ములుగు సుబ్రహ్మణ్యంగారును, ఆంధ్రభాషాభివృద్ధిని గూర్చి ధూపాటి వేంకటరమణాచార్యులుగారును, ధూపాటి వరదాచార్యులుగారును చెప్పిరి. వివిధగ్రంథాలయములనుండి వచ్చిన ప్రతినిధులు తమతమ గ్రామములయందు తాము చేయుచున్న పనులయందు తమకు సంభవించుచున్న కష్టనిష్ఠురములను గూర్చి విపులముగా చెప్పుకొనిరి. ఈ యనుభవములను విని సభ్యులెల్లరు ఆనందమును ఆమోదమును దెల్పిరి. వీరి యనుభవములు పరస్పరము దెలుపుకొనుటవలన అమితోపయోగము గలిగినది. భోజనములు చేయువేళ మించిపోయినప్పటికిని, సభ్యులలో ఒక్కరైనసభనుండి వెడలిపోక, మిక్కిలి ఉత్సాహముతోను, ఓపికతోను, వివిధ గ్రంథాలయములనుగూర్చిన యనుభవములను చెవియొగ్గి వినిరి.

అనంతరము ఈ తీర్మానములు చేయబడినవి:—

౧. జ్ఞానాభివృద్ధికిని న్యాయ స్వాతంత్ర్యాదర్శముల రక్షణార్థమును, జన్మనునిరంకుశవర్గమును మాటుపరచి ప్రపంచమున శాశ్వతముగ శాంతిని నెలకొల్పుటకు యుద్ధముచేయుచున్న మిత్రమండలివారికి ఈ ఘోరసంగ్రామమున శీఘ్రముగ సంపూర్ణజయము గలుగునుగాత యని పరమేశ్వరుని ఈ సభవారు ప్రార్థించుచున్నారు.

అగ్రాసనాధిపతి.

౨. కృష్ణాజిల్లాయందున్న అన్నిపట్టణములయందును ముఖ్య గ్రామములయందును గ్రంథాలయములను గాని పఠనమందిరములను గాని స్థాపింపవలెననియు, గ్రంథాలయోద్యమాభివృద్ధికై ప్రకటింపబడుచున్న గ్రంథాలయ సర్వస్వము" నకు ప్రోత్సాహమును కలిగింపవలెననియు, జనుల నీసభవారు ప్రార్థించుచున్నారు.

ఉ. కాశీనాధుని నాగేశ్వరరావుగారు.
అ. కానూరి చలపతయ్యగారు.
శంకర వేంకటరామయ్యగారు.

ఈ తీర్మానముమీద మాట్లాడుచు శంకర వేంకటరామయ్యగారు ఇట్లు చెప్పిరి.

ప్రభుత్వమువారుగాని ప్రజలుగాని గ్రంథాలయములను స్థాపించు ప్రయత్నమునందు విశేష ధన ప్రయాసలు ప్రస్తుతస్థితిలో పడరు, గనుక, వీని స్థాపించుభారము కేంద్రగ్రంథాలయముపై చాలవఱకు ఆధారపడియుండును. వీరు సంచార కార్యదర్శిని నియమించి ఆయన వీలుకొలది గ్రామములను దర్శించి ప్రతిగ్రామమందును ఒక యభిమానిని సంపాదించి ఆయనద్వారా ఆ గ్రామములోవచ్చు పత్రికలను, ఆ గ్రామమందుగల గ్రంథములను ఒకచో చేర్చి గ్రంథాలయములు స్థాపించవలయును. ఈ ప్రకారముగా సంవత్సరమునకు కొన్ని కొన్ని నూతన గ్రంథాలయములను స్థాపించవలయును. ప్రస్తుతము మన ఆంధ్రదేశమందు విశేష అభివృద్ధిలోనుండి ఆంధ్రదేశమధ్యమగు బెజవాడయందు నెలకొల్పబడిన రామమోహన ధర్మపుస్తకభాండాగారము కేంద్రగ్రంథాలయముగా మార్చినారు గనుక వారిమీద ఈ బాధ్యతపడినది. వారు దీనిని వహించుట యెంతయు సమంజసము.

దానిమీద అయ్యంకి వేంకటరమణయ్యగారు ఇట్లు చెప్పిరి:—

ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘమునకు దుర్భాక జగన్నాథశర్మగారిని ఇదివరకు కార్యదర్శిగ నియమించితిమి. ఆయన సుమారు మూడు మాసముల కాలము పనిజేసిరి; పిమ్మట దేహమునందు అస్వస్థతగ నుండుటచేతను, ఇతర ఇబ్బందుల వలనను పని చేసి యుండలేదు. ఈ నెల మొదటి తేదీనుండి యీ వేరొకరిని నియమించితిమి. ఒక్క కృష్ణాజిల్లాయందే సుమారు ౧౬౦౦ గ్రామములు గలవు. ఆంధ్రదేశమునందు ౧౨ జిల్లాలుగలవు. ఈ పంద్రెండు జిల్లాలయందును ౨౦,౦౦౦ కంటె ఎక్కువ గ్రామములు గలవు. గ్రంథాలయ సంఘము ఆంధ్రదేశమందంతటను పనిచేయవలసియున్నది. అందుచేత ఒక్క కార్యదర్శితో ఇన్ని గ్రామములయందును నూతనగ్రంథాలయములను స్థాపించుటయన్న అసంభవమగు కార్యము. కొంతవరకయిన పని జరుగవలెనన్న జిల్లాకొక కార్యదర్శియైన తప్పక ఉండితీరవలెను. అన్ని జిల్లాలకును కలిసి ఇప్పుడున్న ఒక్క కార్యదర్శివలన మండల గ్రంథాలయోద్యమమునకు మాత్రము కొంత సహాయము కాగలదుగాని, నూతనముగ గ్రామములందు గ్రంథాలయములను స్థాపించు పని కాజాలదు. కాబట్టి కృష్ణాజిల్లాయందుకూడ గ్రామగ్రంథాలయములను విరివిగ స్థాపించుటకై ప్రత్యేకముగ నొక కార్యదర్శిని నియమింపవలెను. ఒక కార్యదర్శికి సాలునకు రు ౪౦౦ లకు తక్కువ వ్యయము కాదు. ఈరూపాయలను వసూలుజేసి వెంటనే ఒక కార్యదర్శిని నియమించి, కార్యకారులయ్యెదరని ప్రార్థించుచున్నాడను. అంతేగాని ఒక్కరు పనిచేసెదరన్న, అది ఎన్నటికిని జరుగదు.

ఈ తీర్మానము అందరిచే ఏకగ్రీవముగ నంగీకరింపబడినది.

3 (ఏ) కృష్ణాజిల్లాయందున్న గ్రంథాలయములకును పఠనమందిరములకును, డిస్ట్రిక్టు తాలూకాబోర్డులయొక్కయు, మ్యునిసిపాలిటీలయొక్కయు ద్రవ్యములనుండి విరాళము లియ్యవలసినదని ఈసభవారు కోరుచున్నారు.

(బి) ఈజిల్లాయందున్న గ్రంథాలయము లన్నింటికిని ప్రభుత్వమువారిచే ప్రచురింపబడుచున్న వ్యవసాయిక ఆరోగ్య పరిశ్రామిక వాణిజ్య ప్రచురముల నన్నిటిని ఉచితముగా నొసంగవలెనని ప్రభుత్వమువారిని ఈసభవారు ప్రార్థించుచున్నారు.

౪ రాబోవు వత్సరమునకు కృష్ణామండల గ్రంథాలయ సంఘమునకు వీరు సంయుక్త కార్యదర్శులుగ నుండవలెనని ఈసభవారు తీర్మానించుచున్నారు:—

౧ నిడమర్తి లక్ష్మీనారాయణగారు
౨ దుగ్గిరాల వేంకటసుబ్బయ్యగారు
3 కొడాలి శివరామకృష్ణారావుగారు
౪ చెంగల్వల సత్యనారాయణమూర్తిగారు

౫ ఆంధ్ర గీర్వాణ సాహిత్యము దేశము నలుదిక్కుల పూర్వపు ప్రౌఢత్వమునకు వచ్చుటకును, సాహిత్యవిజ్ఞానము దానికి జతపడుటకును గ్రంథాలయములు ఆంధ్రసాహిత్యవిద్యాశాలలు నెలకొల్పవలెననియును, అందు కొరకై పనిజేయుచున్న కొవ్వూరు ఆంధ్రగీర్వాణవిద్యాలయమును వృద్ధిపరచుటకు దేశీయులెల్లరును సహాయము చేయవలెనని ఈసభవారు ప్రార్థించుచున్నారు.

# మూడవ గుంటూరుమండల గ్రంథాలయ ప్రతినిధుల మహాసభ.

ఈ సభ సత్తెనపల్లి పురమున ది ౬-౬-౧౯ తేది ఉదయము ౯ గంటలకు రాచకీయ సభాభవనమున సమావేశమయ్యెను. అచుట్లూరు కాపురస్థులు శరణురామస్వామి చౌదరిగారి జాతీయ గీతముతో సభ ప్రారంభమయ్యెను. ఆహ్వాన సంఘాధ్యక్షులగు శ్రీయుత అత్తలూరి సుబ్బారావుపంతులుగారు ప్రతినిధులకు స్వాగత

మిచ్చిరి. అనంతరము రాయసం వేంకటశివుడు పంతులు యం. ఏ.; యల్. టి. గారు అగ్రాసనాధిపత్యము వహించి ఈ ప్రారంభోపన్యాసమును నిచ్చిరి:—

## అధ్యక్షుల ఉపన్యాసము.

### మిత్రులమరణము.

ఒక వత్సరములోనె ముగ్గురు పండితులను గోలుపోవలసిన దురదృష్టము మనమండలమునకుఁ గలిగెను. గత సంవత్సరమున రేపల్లెయందుఁ గూడిన ద్వితీయ గుంటూరుమండల గ్రంథాలయ సభ కగ్రాసనాధిపత్యము వహించిన వంగిపురము కృష్ణమాచార్యులు బి. ఏ. యల్. టి. గారు కొన్ని నెలల క్రిందట పరలోక ప్రాప్తిఁజెందిరి. వీరు సంస్కృతాంధ్రభాషలలో నసమానపాండిత్యమును గాంచి, జనకజాపరిణయాది నాటకములను రచించి, తమ కోమలస్వభావముచేతను, నిష్కల్మషప్రవర్తనముచేతను జనుల ప్రోగడ్తలకుఁ బాత్రుఁడయ్యెను. నిరుడు రేపల్లెలోనే జరిగిన వర్ణాశ్రమధర్మసభ కగ్రాసనాధిపతులగు జంధ్యాల గౌరినాథ శాస్త్రిలుగారు ఈ మధ్యనే మృతినొందిరి. వీరు గీర్వాణభాషయందు సమధిక సాహిత్యమును సంపాదించి, ఋజువర్తనమును స్వమతాభిమానమును గలిగి యుండిరి. రెండు మాసముల క్రిందట చెన్నపురిలోఁ జనిపోయిన రెంటాల వేంకటసుబ్బారావుగారు కృష్ణామండలమున జన్మించి ప్రథమమున గుంటూరున నుద్యోగముననుండిరి. వీరు ఆంగ్లేయభాషలో షేక్స్పియరు నాటక వ్యాఖ్యానములును, కథలామణిలేఖలును, ఆంధ్రమున నవలలు పత్రికలును రచించి తమకుఁ గల యుభయభాషా పాండిత్యముచేతను, గ్రంథరచనా నైపుణ్యముచేతను లోకమును రంజింపఁజేసిరి. ఈ ముగ్గురి మరణమువలనను గలిగిన నష్టమునకు మనమెంతయుఁ జింతిల్లవలయును.

## గ్రంథాలయ చరిత్రము.

గ్రంథాలయోద్యమము నవీనమయ్యెను, ఒకవిధముగ మిగుల పురాతనమైనదనియు చెప్పవచ్చును. గ్రంథాలయ చరిత్రకాలమును మూఁడు భాగములుగ విభజింపవచ్చును. మొదటి కాలమున గ్రంథరచన వాగ్రూపముగనుండెను. రెండవది వ్రాతప్రతులకాలము. అక్షర సాహాయ్యమున నాకాలమునఁ జెట్లు బెరడు మొదలగు వస్తువులమీఁద పుస్తకములు వ్రాయఁబడుచు వచ్చెను. మూఁడవది ముద్రణా గ్రంథముల కాలము.

### (౧) వాగ్రూప గ్రంథములు:—

మనుష్యుని మానసవీథిని జ్ఞానోదయ మయినపుడె గ్రంథాలయ స్థాపన మారంభమయ్యెననవచ్చును. ప్రాచీనకాలమున జ్ఞానము లిఖిత రూపమునఁ గాక, వాగ్రూపముననె నిక్షేపింపబడెను. తక్కిన దేశముల స్థితి మనకంతఁగఁ దెలియదు గాని, భరతఖండమునఁ బుస్తకములు వాగ్రూపముననుండు కాలము వేదకాలమని మనకు బాగుగఁ దెలియును. జ్ఞాపకముంచుకొనుట కనువగు రూపమున గ్రంథములపుడు పద్యరూపముననుండెను. మన పూర్వికులశ్రేంతో శ్రమకోర్చి, తాము పఠనముచేసి, తమపిల్లలకు నేర్పనిచో, మన వేదములును శాస్త్రములును నశించియేయుండును. దీనిని సూచించుటకె, వేదములను ప్రప్రథమమున వ్రాయించి ముద్రింపించిన మోక్షమూలరు పండితుఁడు, హిందూపండితులను "ప్రాగ్దేశపు సంచార గ్రంథాలయము"లని వ్రాసెను. ఇప్పటికిని వేదాధ్యయన తత్పరులగు కొందఱు తమ సంతకమునైన జేయనేరనివారి నన్నటవ్వటఁ జూచుచున్నాము.

### (౨) వ్రాతప్రతులకాలము:—

మనుష్యుడు తాను సముపార్జించిన జ్ఞానమును ముఖ్యముగ లిఖితరూపమునఁ బ్రకటీకృతము చేయుచున్నాడు. లేనిచో కొంతకాలమునకు వాఙ్మయము నశించిపోవును. జ్ఞానము లిఖితరూపమునొందినచో నశింపదను సంగతిని గమనించియే మనపూర్వికులు, అట్టి లిఖితపుగుర్తులకు అక్షరములు (నశింపక నిలుచునవి) అని నామమిడిరి. అక్షరములు మొదట చెట్ల బెరడుమీఁదను, పత్రములమీఁదను, తాళ్ళమీఁదను, మంటిమీఁదను

వ్రాయఁబడెను. కొన్ని సంవత్సరముల క్రిందటనే, అస్సిరియా దేశమున భూమిలోనుండి త్రవ్వగా, అందు గుర్తులుగల యనేకవేల సంఖ్యగల యిటుకలు గానవచ్చెను. వీనిని బాగుగఁ బరిశీలింపగా, ఇవి యన్నియును ఆ దేశమున వేలకొలఁది సంవత్సరముల క్రిందట నా దేశము నేలిన పండిత మిత్రుఁడగు నొక రాజుయొక్క పదివేల పుస్తకములని తెలియవచ్చెను. బాగుగ విభజింపఁబడి నామకరణము చేయఁబడిన యీ పుస్తక సముదాయములోఁ జాల భాగము లండను బ్రిటీషు ప్రదర్శనశాలకుఁ గొనిపోఁబడినవి. ఈజిప్టు దేశములో నాలుగు వేల సంవత్సరములకుఁ బూర్వమే యనేక వ్రాయసకాండ్రు మత గ్రంథములను రాజకీయ గ్రంథములను లిఖించిరి. గ్రీసులో పిసిస్ట్రేటసను రాజు, యూరిపిడీసను కవి, అరిస్టాటిలను శాస్త్రవేత్తయును గొప్పభాండాగారములను ప్రోగుచేసిరి. అలెగ్జాండ్రియాలోఁ బ్రాచీనకాలమున విఖ్యాతినొందిన రెండు పుస్తకభాండాగారము లుండెను. వీనిలో నొక దానిలో ౪౦ వేలును, రెండవ దానిలో రెండు లక్షలును పుస్తకము లుండెను. కాని దాదాపుగ నీ గ్రంథములన్నియును దేశము శత్రురాజుల వశమగుటవలన నాశనము చేయఁబడెను. వేదకాలమునకుఁ బిమ్మటి కాలమున హిందూదేశమునందలి యార్యులు పశ్చిమదేశీయులగు నొక జాతి ఫినీషియనులతో సంపర్కము గలిగి వారివలన నక్షరముల యుపయోగము నేర్చిరని తెలియవచ్చుచున్నది. తరువాతి కాలమునందు బౌద్ధమతము ప్రబలముగ నుండినప్పుడు, వెలసిన నలందవిశ్వవిద్యాలయ గ్రంథ భాండాగారమునఁ జాల గ్రంథములుండెనట. వేయి సంవత్సరముల క్రిందట మన తెలుఁగుదేశమున నెల్లూరు ప్రాంతపు దేశమునకు వేఁగి దేశమను పేరు గలదు. ఈ పేరు దీనికి వచ్చుటకుఁ గారణము, ఆ దేశము కొన్ని పర్యాయములు శత్రురాజులచేఁ దగులఁబెట్టఁబడెననియు, అందువలన నప్పటి ప్రాచుర్యములోనుండిన యనేక తాళపత్ర గ్రంథములు నశించెననియుఁ గొందఱు చెప్పెదరు.

(3) ముద్రిత గ్రంథములు: — [illegible] పుస్తకములు సామాన్యముగ నశింపవుగాని, ముద్రింపఁబడినచో నవి యెన్నఁడును లయమునొందక బాగుగఁ బ్రచురమగును. యూరపుఖండమున అచ్చువేయుట కనిపెట్టఁబడినప్పటినుండియును లోకమందంతటను గ్రంథరచనకును గ్రంథప్రాచుర్యమునకును మంచి సౌకర్యము లేర్పడెను. కావున నిటీవల నెల్లెడలను మంచి గ్రంథాలయములు వెలసెను. బ్రిటీషు దీవులలో కెల్ల మిక్కిలి గొప్ప పుస్తకాలయము లండనులోని బ్రిటీషు మ్యూజియములోనున్నది. దీనియందు ౨౦ లక్షలకు మించిన ముద్రితగ్రంథములును, ఏఁబదియాఱు వేల యముద్రితపుస్తకములును గలవు. ఆనగరముననే పాఠకులకు సులభముగ పుస్తకములు దొరకు నింకొక గ్రంథాలయము 'పేటెంటుఆఫీసు' అను చోటనున్నది. ఇదియును దొరతనమువారి యాజమాన్యముక్రిందనే యున్నది. దీనిలో లక్షకుమించిన పుస్తకము లున్నవి. ఆక్స్‌ఫర్డునందలి బాడ్లియను గ్రంథాలయమున ౮ లక్షలకు పైగా ముద్రితములును ౪౧ వేలకుఁ బైగా నముద్రితములును నగు పుస్తకము లున్నవి. ప్రాచ్యదేశసంబంధములగు గ్రంథములు దీనియందుకంటె నెచ్చటను నధికముగఁ గానరావు. జర్మనీదేశము ఉత్కృష్టగ్రంథాలయముల పుట్టినిల్లు. కాని, సౌకర్యముల విషయమై అమెరికా సంయుక్తరాష్ట్రముల గ్రంథాలయములే ప్రథమములుగా నెన్నఁదగినవి.

హిందూదేశపు గ్రంథాలయములలో కలకత్తాలోని సార్వభౌమిక పుస్తకాలయము మిక్కిలి పెద్దదని చెప్పవచ్చును. దీనియందుండని యాంగ్లేయగ్రంథములు సామాన్యముగ నే దేశమునను దొరకవని చెప్పెదరు. చెన్నపురిలోని కానిమెరా సర్వజన పుస్తకాలయము ౧౮౯౬వ సం॥న స్థాపించిరి. మన దేశములో బరోడాసంస్థానము గ్రంథాలయములకుఁ బ్రసిద్ధికెక్కియున్నది. ఇందలి ముఖ్యపట్టణమునఁ గల కేంద్రగ్రంథాలయమున డెబ్బది వేల గ్రంథములు గలవు. ఈ భాండాగారమున కనేక శాఖలు గలవు. ఆ సంస్థానమున 3 పట్టణములలో కేంద్రగ్రంథాలయములును, 3౭ పట్టణములలోను, 323 పల్లెల

లోను సామాన్యగ్రంథాలయములును స్థాపింపఁబడి యున్నవి.

ఇంక మన తెలుఁగుదేశపుగ్రంథాలయచరిత్రసంగ్రహముగఁ జెప్పవలయును. పదునారవ శతాబ్దానంతరమున, తంజావూరు తెలుఁగునాయకరాజులపరిపాలనములో నున్నప్పుడు, అచ్చటి ప్రభువులు సంస్కృతగ్రంథముల వ్రాతప్రతులను ప్రోగుచేసిరి. ౧౭వ శతాబ్దమున నా దేశము మహారాష్ట్రుల యాధీనమయ్యెను. తంజావూరి ప్రభువగు శరభోజిరాజు ౧౭౭౦ మొదలు 30వ సంవత్సరమువరకును కాశీనగరమున నివసించునపుడు పెక్కుగ్రంథములను సంపాదించెను. ఇప్పు డాభాండాగారమున ౧౮ వేల గ్రంథముల ప్రతులున్నవి. ఇవి దేవనాగరి, తెలుఁగు, కన్నడము, గ్రాంథి, బంగాళి మొదలగు భాషలలో నున్నవి. అం దనేకము లముద్రితములును, మరికొన్ని ముద్రితములును నగు గ్రంథములు గలవని చెప్పుచున్నారు.

చెన్నపురిలో బ్రౌనుదొరగారిచేత స్థాపింపఁబడిన ప్రాచ్య లిఖిత పుస్తకభాండాగారము మంచి స్థితిలో నున్నది.

౧౮౮౬ సంవత్సరమున విశాఖపట్టణమున స్థాపింపఁబడిన సరస్వతీనిలయసార్వజనిక గ్రంథాలయమునుఁ, ౧౯౦౦వ సంవత్సరమున రాజమహేంద్రవరమున నెలకొల్పఁబడిన వీరేశలింగ పుస్తకభాండాగారమును, ౧౯౦౪వ సంవత్సరమున హైదరాబాదులో నారంభింపఁబడిన కృష్ణదేవరాయాంధ్రభాషానిలయమును, ౧౯౧౧వ సంవత్సరమున బెజవాడలో స్థాపింపఁబడిన రామమోహనరాయధర్మపుస్తకభాండాగారమును ముఖ్యములైనవి.

## గ్రంథభాండాగారసంఘములు.

ప్రపంచములో గత ౨౫ సంవత్సరములనుండియును గ్రంథాలయములలో నెన్నియో మార్పులు గలిగినవి. పూర్వము, పుస్తకభాండాగారమనిన విద్వాంసుల కుపకరించు గ్రంథములు నిక్షేపింపఁబడియుండుచోటు అని తలంచుచుండెడివారు. ఇప్పుడన్ననో, గ్రంథాలయములు, అందఱి జనుల జ్ఞానోత్తేజమునకు నుపకరించెడి సాధనములని భావింపఁబడుచున్నవి. ప్రజాప్రభుత్వ ప్రజాస్వాతంత్ర్యములు వ్యాపించెడి ప్రకృతకాలమున గ్రంథాలయములు పండితులకేకాక, జనసమూహమునకును ఉపయోగకరములని భావింపఁబడు టొకవింత గాదు. గ్రంథాలయములు స్వాభావిక విద్యావిధానములలో నంతర్భాగములనియె అమెరికావారు తలంచుచున్నారు. ౧౮౭౭ సంవత్సరమున లండనులో జరిగిన ప్రథమ నానాదేశీయ గ్రంథాలయసభవారిచే "విద్యాలయసంఘ" మొకటి స్థాపింపఁబడెను. ఈసంఘము వారు సభలుచేయుచును, పత్రికాప్రకటన మొనరించుచును, పరీక్షలు జరుపుచును, విద్య నేర్పుచును ఉండురు. యూరపుఖండములో ననేకదేశములలో గ్రంథాలయసమాజములు స్థాపింపఁబడినవి.

లోకములోని పుస్తకాలయసమాజములలో మిగుల గొప్పదియు ముఖ్యమగునదియును అమెరికా గ్రంథాలయసమాజము, ౧౮౭౬వ సంవత్సరమున నెలకొల్పబడెను. ఆదేశమున అనేకగ్రంథాలయములు నూతన పద్ధతుల చొప్పున స్థాపింపఁబడి పనిచేయుచున్నవి. అచ్చటి గ్రంథాలయములలో, శిశువిద్యకు దోడుపడు సాధనములున్నవి. ఇచటనుండు బొమ్మలు పటములు మొదలగునవి పాఠశాలకుఁ బంపఁబడి వానియం దుపయోగింపఁబడుచున్నవి. అమెరికాదేశపు నవీనపద్ధతుల ననుసరించి యేర్పడిన బరోడారాష్ట్రీయ కేంద్రగ్రంథాలయము చర్యలోఁగూడ ననేకశాఖలు గలవు. ఇందలి బాలశాఖయందు పిల్లలకుఁ వారివారి వయసునకు దగిన పుస్తకములున్నవి. వానినిఁ జక్కఁగఁ బ్రదర్శించుటకు విద్యాధికారిణియుఁ గలదు. పాఠకులకు వినోదము గలిగించు క్రీడలున్నవి. మ్యాజిక్‌లాంతరు మొదలగు సాధనసామగ్రివలన సామాన్యజనులకు విద్యనేర్పఁబడుచున్నది.

౧౯౧౪వ సంవత్సరమున ఏప్రిల్ ౧౦వ తేదీని

బెజవాడలో నేర్పడిన "ఆంధ్రదేశగ్రంథభాండాగార సంఘము" కూడ నిదే యుద్దేశములతో స్థాపింపఁబడినది. వీని ముఖ్యోద్దేశములు, నూతనగ్రంథాలయస్థాపనయు ఆంధ్రగ్రంథభాండాగారాభివృద్ధియును. వీరు గ్రంథాలయసర్వస్వమను పేరుతోనొక గ్రంథమునుగూడఁ బ్రకటించుచున్నారు. ఇంక ఆయాజిల్లాలలో గ్రంథాలయము లేర్పరుచుటకును, ఉన్నవానిని బాగుపరచుటకును, ప్రత్యేకమండలగ్రంథాలయసమాజము లేర్పరుపబడినవి.

## గ్రంథాలయముల ప్రయోజనము.

ఆంధ్రమండలములలో గ్రంథాలయోద్యమము దిన దినప్రవర్ధమానమగు చున్నది. మన గుంటూరుమండల మీవిషయమున నగ్రస్థానము వహించియున్నది. ఇప్పుడీమండలమున ౧౩౬ గ్రంథాలయము లున్నవి. జనసామాన్యమునందు విద్యావ్యాపనముచేసి, వారియందు నీతి, జ్ఞానము, దేశాభిమానము వెంపొందించుటయే గ్రంథాలయముల ముఖ్యోద్దేశము. సామాన్యజనులు పఠించుటకుఁ దగిన పుస్తకము లిచట నిక్షేపింపఁబడు చున్నవి. స్త్రీలకును పిల్లలకును నుపయోగపడు పుస్తకములు, బొమ్మలు మొదలగునవి కొన్నిట యందుఁజేర్పఁబడు చున్నవి. కొన్ని గ్రంథాలయముల వారు రాత్రిపాఠశాలలుజరపుచును, నిమ్నజాతులవారి విద్యాభివృద్ధికై పాటుపడుచును ఉన్నారు. మ్యాజికు లాంతరు మొదలగు సాధనములవలనను, ఉపన్యాసములు కరపత్రములు మొదలగువానివలనను సామాన్యజనులలో విద్య నెలకొల్పఁబడు చున్నది. దినపత్రికలు మొదలగు వార్తాపత్రికలు చదువఁబడు చున్నవి. వేయేల హైందవులలోనిపుడు నూతనముగ జనించిన జాతీయభావమును, ఆంధ్రుల మనస్సులలో నవీనముగఁ గలిగిన ఆంధ్రోద్యమాభిమానమును, ఈగ్రంథాలయోద్యమమునకు సహకారులై, తాము దానిమూలమున నభివృద్ధి నొందు చున్నవి.

## ఆంధ్రదేశమునందలి మార్పు.

ఈ నూతనోద్యమ ప్రభావమువలన పల్లెలు మెల్లగ పట్టణములుగ మారుచున్నవి. ఏ చీట్లాటలలోనో దిగి, సొమ్మును స్నేహభావమును గోలుపోవుచును, ఒండొరులమీఁద దోషారోపణము చేసికొనుచును మనశ్శాంతిని బోగొట్టుకొనుచునుండు జానపదులిపుడు ప్రాతస్సాయంసమయములందు గ్రంథాలయమున కరిగి, వార్తాపత్రికలు చదువుచు సద్గ్రంథకాలక్షేపముఁ జేయుచున్నారు. గ్రామవాసులయ్యును, తాము సంపాదించు జ్ఞానవిశేషముచేత విశాలహృదయులై, మహాకవుల యుదారభావనలలోను, శూరాగ్రేసరుల పౌరుషములలోను పాలుగొనుచున్నారు. తాము నదివఱి విషయములందు వీరికి మిగుల శ్రద్ధయుండుటచేత, వీరులోకములోని సంగతుల సత్యాసత్యములు గ్రహించుచున్నారు. ఇంక సభలెట్లుచేయవలయునో, సమాజము లెట్లు నడుపవలయునో నలుగురిలోనెట్లు మెలఁగవలయునో వీరుబాగుగ గుర్తెఱుఁగుచున్నారు. తాము మనసార నిజమునినమ్మినచొప్పున నడచుటకు వీరు ప్రయత్నించుచున్నారు.

ఇంక నగరవాస్తవ్యు లందరన్నో కొన్నిచోట్ల వీనికి విరుద్ధగుణములు గానిపించుచున్నవి. గ్రంథాలయాది సంగతులు వీరికిఁ గ్రొత్తవి కాకపోవుటచేతను, లోకజ్ఞానమున జానపదులకంటె సామాన్యముగ వీరధికతగాంచియుండుటచేతను, పట్టణవాసులయం దిట్టియభివృద్ధి గానిపించుటలేదు. వార్తాపత్రికలు తమయిండ్లకడకే వచ్చుటచేత, వారు వానియెడల నిర్లక్ష్యముగలిగి, లోకసమాచారముల నెంతో యశ్రద్ధతోఁ దెలిసికొనుచున్నారు. తమ వ్యాపార సంబంధమగు తొందరయే దీనికిఁగొంత మిషగా వారు చెప్పుచున్నారు. వార్తాపత్రికలలోని తంతి సమాచారములకే తీరిక లేనివారు గ్రంథపఠన మెట్లు చేయఁగలరు ? పాపము వీరికి దీరికగల దినములందుఁ గొంత సంతోషకరమగు వ్యాయామము ఉండవలయునుగదా. వీరు విద్యాధికులగుటచేత, చీట్లాట మొదలగునవి పామరజనులవలె వీరిని నిందాపాత్రులనుగఁజేయఁజాలవు గాఁబోలు ! ఒకానొక పెద్దమనుష్యుఁ డీమధ్యనాతో మాట్లాడుచు, పల్లెటూళ్ళలోఁ దాను మంచిపనులఁ జేయఁగలనుగాని, పట్టణములలోఁ జేయఁజాలనని చెప్పెను. అందఱియందును పైనిజెప్పినట్టి చర్యలు

కానవచ్చునని నేను జెప్పను. పట్టణవాసస్థులు జానపదులకుఁ దామన్నివిధముల మార్గదర్శకులుగ నుండునట్లు నడచుకొనెదరు గాక !

## గ్రంథాలయములవారి విధులు.

ఇపుడు తెలుఁగు మండలములందు గ్రంథాలయముల మూలమున జనులలో నూతనమగు నేకీభావము గలుగుచున్నది. సామాన్య సభలు జరుగునప్పుడును, సాంవత్సరీకోత్సవ సమయములందును, వివిధజాతులవారు వివిధ ప్రదేశములనుండి వచ్చి యొకచోట గుమిగూడి అందఱికిని ప్రియమగు సంగతులు చర్చించుచుండుటచేత, వారిలోఁ జెప్పనలవిగాని స్నేహభావము గుదురుచున్నది. ఇదియెంతయు శుభసూచనము. కాని యట్టి సమయములందు వారు వినోదములతోనే కాలము పుచ్చక, ఒకరి యందుఁ గానవచ్చు సుగుణము లింకొకరలవరచుకొనుచు దుర్గుణబీజములను దమ యుల్లములనుండి పెరికి పారవైచుటకు వలసిన మనోబలమును సంపాదించుచు, తమ జ్ఞానము నభివృద్ధిచేసికొనుచు నుండవలయును. లేనిచో, నిట్టి సభాసమావేశములు, సామాన్యముగ జరగు పెండ్లి పేరంటములవలె క్షణభంగురమగు సంతోషమునుమాత్రమె నిచ్చుచు అర్థము తెలియకచేయు నైమిత్తికకర్మలవలె నిష్ఫలములగును.

దేశమునునింకను విరివిగ పుస్తకాలయములు వెలయవలయును. ఊరూరను పఠనమందిరములును, గ్రంథభాండాగారములును స్థాపనగావలయును. కాని యిది యొకటియె చాలదు. మా గ్రంథాలయమునందెన్నియో పుస్తకములున్నవని జెప్పుకొనుటకంటె, నేను వానిలో నిన్ని పుస్తకములు చదివి నామిత్రులచేనిన్ని చదివించితినని గుర్తెఱుఁగుట మంచిది. చదివిన యంశములను మననము చేయుచు, ఇతరులతోఁ జర్చచేసి వాని యాదార్థ్యమును విమర్శనముల మూలమున గ్రహింపవలయును.

## ఆంధ్ర గ్రంథముల దురవస్థ.

ఆంధ్ర గ్రంథములనిన జనుల కాదరభావము లేకపోవుట కొక కారణము, చూచుటకు వానియాకృతి బాగుగ లేకపోవుటయె. పనికిమాలిన కాకితములమీఁద లెంకెపోతండములగు తప్పులతో ముద్రింపఁబడు పుస్తకములు చేతఁబట్టుటకేమి ప్రోత్సాహకరముగ నుండును ? ఇప్పటి ముద్రాశాలాధికారులలో, ఆనందముద్రాశాలాధిపతులును, వావిళ్ళ వారును, ఇంకఁ గొందఱును—భారతాది సద్గ్రంథములను మంచికాకితములమీఁద మంచి యక్షరములతో నచ్చొత్తించినందులకై మిగుల వందనీయులు. కాని సామాన్యముగఁ దెలుఁగు పుస్తకములు వెనుకటి తీరుననే యున్నవి. భారతాదియుద్గ్రంథములు చిన్నచిన్న భాగములుగ ముద్రించి సరసమగు వెలలకమ్మవలయును. చూచుటకును, చేతఁబట్టుటకును నందముగ నుండినఁగాని, బాలురును పామరజనులు నేగాదు, ఎల్లవారును పుస్తకముల సేవగించెదరు.

౨౦ సంవత్సరములకుఁ బూర్వముకంటె నిపుడు చదువుట కన్నిగొన్ని యాంధ్రగ్రంథము లున్నవి. కాని, అన్యభాషలనుండి భాషాంతరము చేయఁబడి యన్యదేశపు పరిస్థితులనే వర్ణించు నవలలు సామాన్యముగ జనరంజకముగ నుండఁజాలవు. స్వదేశీయుల ప్రస్తుతాచారములు ప్రదర్శించు నవలలు మూఁడు నాలుగుకంటె నిపుడు తెలుఁగున లేవనియే చెప్పవచ్చును. భావికాలపు వారికిని విదేశీయులకును మనపద్ధతులు స్థితిగతులను బాగుగ బోధింపఁగలవి, ప్రస్తుతమున నాంధ్రమున వ్రాయఁబడు కావ్య నవలానాటకములకంటె, వ్యవహార సంబంధములగు పత్రలేఖనారూపకమగు వాఙ్మయమె యని చెప్పనగును!

ఏ దేశమునఁగాని, ఏ కాలమందుగాని, మహాకవులును గొప్పగ్రంథకర్తలును లెక్కకు మిక్కిలిగా నుండరు. మనదేశమునఁ బ్రస్తుతమున గొప్పకవులు కొందఱుండియును, మనకుఁ జదువను మంచికావ్యములధికముగ లేకున్నవి. దీనికిఁ దగుకారణములు లేకపోలేదు. కవిత్వ ధోరణిగలవారు ప్రాతపడిన పద్ధతులందును రుచులందును మరఁగి యున్నారు. ఇంకఁ గ్రొత్తరుచులు కనిపెట్టిన వారు సామాన్యముగ కవిత్వనిపుణులు లేక యున్నారు.

ఇంతియేగాక, ఆంగ్లేయ విద్యాసంపన్నులగువారి రుచులు వేరు. సంస్కృతపాండిత్యముగలవారి రుచులు వేరు. ఇక సామాన్యజనులకు వాఙ్మయసంబంధమగు రుచులు సామాన్యముగా లేనే లేవు. బంగాళావారి యందువలె జాతీయాభిమానమును, ఆదర్శములందేశీభావమును ఆంధ్రులందింక నేర్పడలేదు. కవులకు దేశసేవాపరత్వమును దేశపరిస్థితులందు లోకపరిస్థితులందు తగినజ్ఞానమును-దేశాభిమానులకును జనసామాన్యమునకును సారస్వతవిషయములందాసక్తియును-జనించి వర్ధిల్లినఁగాని ఆంధ్రవాఙ్మయస్థితి బాగుపడదు.

## ఆంధ్రాంగ్లేయసారస్వతములు

నేనిచట ఆంధ్రాంగ్లేయసారస్వతముల తారతమ్యము విమర్శింపఁ బూనుకొనలేదు. ఒకటి రెండు చిన్న విషయములుమాత్రమే నివేదించుచున్నాఁడను. ఆంగ్లేయవిద్యాప్రవీణతగలవారికి మాతృభాషయందత్యాదరము లేకపోవుటకుఁ గారణమేమి? ఈరెండువాఙ్మయములకును బాలతారతమ్యముగలదు. నన్నయభట్టు ఆంధ్రభారతరచనకు దొడఁగిన కాలమున నాంగ్లేయసారస్వతము ఆరంభమైనదని చెప్పవచ్చును. కొన్ని విషయములందు ఆంధ్రసారస్వతము నన్నయకాలమునఁ గన్నప్పటివలెనే యిప్పటికిని ఉన్నది. ఇంక నాంగ్లభాషావాఙ్మయమన్ననో మిక్కిలి యభివృద్ధిఁ గాంచినది. పదునాఱవ శతాబ్దానంతరమున నాంగ్లేయకవిత్వము పరిపూర్ణదశ నొందెను. ౧౯-౨౦ శతాబ్దములలో వచనకావ్యములు సుప్రసిద్ధములయ్యెను కావున, ఇంగ్లీషుభాషాపరిజ్ఞానముగలవారు ఆసాంతముఁ జదివి వినోదించుటకై, వారివారి రుచులకుఁ దగినట్టి పుస్తకరాశి యాంగ్లేయసారస్వతమునఁ గలదు. పాఠకుల కింతకంటెఁ గావలసినదేమి? షేక్స్పియరు నాటకములఁబోలిన నాటకములును, స్కాటు, డికెన్సుల నవలలతో సాటియగు నవలలును, డిక్వెన్సీ, మెకాలె, న్యూమనుల విస్తృతగ్రంథములవంటి వచనగ్రంథములును ఆంధ్రవాఙ్మయమునఁ గానరావు. కావుననే యాంగ్లేయవాఙ్మయమును జదివిన నాంధ్రపాఠకులకు నాంధ్రగ్రంథములందు సామాన్యము విముఖత గలుగుచున్నది.

కాని, విమర్శించిచూచినచో నంత నిరుత్సాహము నొందనక్కఱలేదు. తిక్కనపోతనల కవిత్వములందు షేక్స్పియరు మిల్టనుల కవితానైపుణ్యమే కొంత గన్పట్టకమానదు. ఆంధ్రభారతమును సాంతముగను సావధానముగను జదివినవారే యాంధ్రసారస్వతముయొక్క యుత్కృష్టతను గ్రహింపఁగలరు. షేక్స్పియరునందు గానవచ్చు నానాభావవ్యక్తి విమర్శనానైపుణ్యమును, స్వాభావికవర్ణనాసక్తియును, నాటకీయమును హృదయాకర్షము నగు శైలిసౌలభ్యమును, తిక్కనకవిత్వమందెల్లెడలను గానఁబడవా? ఇంకమిల్టను కవిత్వమునందలి సొబగులు భాగవతమునందు గానవచ్చుచునే యున్నవి. ఇందలి యమకాద్యలంకారములు, భక్తిరసము, ముద్దులమూటగట్టు పదజాలమును, ఏ సజ్జనుని హృదయము నానందమున మురిపఁజాలవు! ఆంధ్రకవితయందలి లోపములు కొంతవరకు ఆరోపితములే. దీనికి ఆంధ్రపాఠకుల యజ్ఞానమును స్వభాషాభిమానము నెడల కొఱతయును కారణములు. వేయిసంగీతములకంటె తల్లికంఠస్వరమె శిశువువీనులకు శ్రావ్యతరముగ నుండునట్లు పరసారస్వతముల వేయిసొంపులకంటె మాతృభాషయగు నాంధ్రవాఙ్మయముయొక్క సహజసౌందర్యము మనకు ప్రియకరముగ నుండుట సహజము. ఆంధ్రకవితయొక్క స్వాభావికమృదుత్వమాధుర్యములు, ఆంగ్లభాషావాఙ్మయమునందే కాదు మఱియెచ్చటను సామాన్యముగ నాంధ్రపాఠకునికి బోధపడవు. ఇంక నాంధ్రవాఙ్మయమునందు లేనిగుణములను గుఱించి యూరక వగచిన లాభములేదు. మనయాత్మీయస్నేహితులగు వంగదేశీయులవలెను, పశ్చిమదేశపు సోదరులగు మహారాష్ట్రులవలెను మనము దేశభాషాసేవాతత్పరులమై నూతనపద్ధతులవలంబించి, మంచిగ్రంథముల వ్రాయఁదొడంగెదముగాక. ఆంధ్రవాఙ్మయమున గానరాని యుత్కృష్టభావములును, వర్ణనములును గొనివచ్చి భాషామాతకలంకారము చేయుదముగాక! ఇతరార్థములగు సేవకంటె మాతృభాషాసేవ యేమా

త్రము తీసిపోవునది కాదు. సాంఘిక రాజకీయ మతవిషయికములగు నుద్యమము లందువలెనే సారస్వతాభివృద్ధి విషయమై సల్పు సేవయును శాశ్వత ఫలదాయకమును పరోపకారయుతమునగుట మాతృభాషా సేవా తత్పరులమై మనవిధాయక కృత్యముల నుత్సాహముతో నెరవేర్చునట్లు దైవము మనల నాశీర్వదించుగాక! ✓

పిఠాపురము కార్యదర్శులలో నొకరగు తాడంకి వేంకయ్యగారు గతసంవత్సరమున సంఘము చేసిన పనియొక్క నివేదికను చదువుచు ౧౯౧౭ సం॥రం॥ఆఖరున ౧౧౨ గ్రంథాలయములు కలవనియు ౧౯౧౮ సం॥రం మేయి నెల ఆఖరువరకు ౨౮ నూతనముగా యేర్పడినవనియు చెప్పిరి.

పిఠాపుర గ్రంథాలయోద్యమమును గురించి చింతమనేని భావయ్య దమ్మాలపాటి వేంకట్రావు తుమ్మలగుంట కేశవరావు ములుకుట్ల మల్లయ్య అక్కిరాజు వాసుదేవరావు గార్లు ప్రముఖముగ నుపన్యసించిరి.

## తీర్మానములు.

౧ ఇప్పుడు జరుగుచున్న యుద్ధములో మన చక్రవర్తిగారికిని మిత్రమండలి వారికిని జయము కల్గుగాక అని యీ సభవారు కోరుచున్నారు.

౨ బహుభాషావిశారదు లగు వంగిపురపు కృష్ణమాచార్యులు రెంటాల వేంకటసుబ్బారావుపంతులు చింతమనేని గోపాలకృష్ణయ్యగార్ల, అకాలమరణమునకు యీ సభవారు చింతించుచు వీరిఆత్మలకు భగవంతుడు శాంతి నిచ్చుగాక అని దైవమును, ప్రార్థించుచున్నారు.

3 ఈమండలములో స్థాపింపబడినట్టియు స్థాపింపబడబోవునట్టియు గ్రంథాలయములకు పఠనమందిరములకు డిస్ట్రిక్టుబోర్డులనుండియు ప్రావిన్షియల్ రివిన్యూనుండియు మ్యునిసిపాల్టిలనుండియు ధనసహాయముచేయవలెనని ఈసభవారు కోరుచున్నారు.

౪ దొరతనమువారు ప్రచురించు పరిశ్రామిక ఆరోగ్య విషయిక వ్యవసాయక ప్రచురములను జిల్లాగెజటీలను ఆంధ్రభాషయందు ముద్రింపబడు గ్రంథముల పట్టికల గ్రంథాలయములకు ఉచితముగా దయచేయవలెనని ఈ సభవారు ప్రభుత్వమువారిని కోరుచున్నారు.


౫ ఈ మండలములోని అన్ని గ్రామములలో నుండెడు ప్రాచీన తాళపత్రగ్రంథములను, శిలా శాసనములను సంరక్షణచేసి సురక్షితమయిన స్థలమున చేర్చుటకు మండలములోనుండెడు గ్రంథాలయములవారిని ఈ సభవారు కోరుచున్నారు.

౬ సత్తెనపల్లి, లక్ష్మీపుత్రులకును వైశ్యశిఖామణులకు పుట్టినిల్లు అయియుండియు గ్రంథాలయము లేకపోవుట కడుంవిచారము గనుక ఈగ్రామవాసులు వెంటనే ఒక గ్రంథాలయమును స్థాపించవలెనని ఈ సభవారు కోరుచున్నారు.

౭ ప్రతితాలూకావారు మండల గ్రంథాలయమువారికి సహాయముగానుండి తాలూకా సంఘములు ఏర్పాటుచేసి ఉద్యమమును అభివృద్ధిచేయవలెనని ఈసభవారు కోరుచున్నారు.

౮ గ్రంథాలయోద్యమమునకు ఆగత్యమైనట్టియు, ఆంధ్రదేశ గ్రంథాలయసంఘమువారిచే ప్రచురింపబడుచున్నట్టియు, గ్రంథాలయసర్వస్వములను ప్రతిగ్రంథాలయమువారు తీసికొని ప్రోత్సహించవలెననియు—ఇదివరకు వారికి వచ్చిన నష్టముక్రింద ప్రతి గ్రంథాలయమువారు రు ౨-౦-౦ లకు తక్కువ లేకుండను, ఇతరులు తమ శక్తికొలదిని సహాయముచేయవలెననియు ఈ సభవారు కోరుచున్నారు.

౯ గుంటూరుమండల గ్రంథాలయ సంఘపక్షమున ఒక సంచార కార్యదర్శిని ఏర్పరచి గ్రంథాలయోద్యమము విపులముగా వ్యాపింపజేయవలెనని ఈ సభవారు నిశ్చయించి, శ్రీ కోన వేంకట్రాయశర్మగారిని ఆ ఉద్యోగమునకు నియమించుచున్నారు.



ఆంధ్ర పరిశోధక మహామండలి - పిఠాపురము.

లిఖితపుస్తక మాతృగ్రంథాలయము.

# ఆంధ్ర పరిశోధక మహామండలి.

పిఠికాపురమునందీ సంఘము ౧౯౧౨ వ సంవత్సర ప్రారంభమున స్థాపింపబడినది. ప్రప్రథమమున వీరొక లిఖిత పుస్తకాలయమును నెలకొల్పిరి. దానికొక చిన్న నూతన భవనమును కొనియున్నారు. ఒకవత్సరములోనే ఆ భవనము నిండిపోవునట్లు లిఖితగ్రంథములను సంపాదింపగలిగిరి. దీనినిబట్టియే స్థాపకుల కార్యోత్సాహము విశదమగుచున్నది. వీరు సంపాదించిన గ్రంథములన్నియు అముద్రితములు గాకపోయినను, కొన్నియైన మరియేగ్రంథాలయమునందును లేనివి గలవు. ముద్రితగ్రంథముల ప్రతులు కూడ పాఠభేదముల కుపకరించును. నూతనసూత్రములకట్టుచు ప్రస్తుతము గ్రంథరక్షణ మొనర్చుచున్నారు. కృష్ణాపత్రిక, సుదర్శని, హితకారిణి, గ్రంథాలయసర్వస్వము మొదలగు వానియందు వీరు పరిశీలించిన గ్రంథవిమర్శనములు ప్రకటించుచున్నారు. ఆపరిశోధనల విమర్శనములను గ్రంథరూపమున ప్రకటించినచో, చరిత్రకారులకు అమితసహాయము కాగలదు. ఈమండలిని యర్నగూడెంజమీందారులగు శ్రీ శ్రీ చెలికానిధర్మారావుగారు, (బా.ఎట్.లా), చెలికాని లచ్చారావుగారు, చెలికాని సూర్యారావుగారును స్థాపించి ఇంతవరకు ఏనికగు వ్యయమంతయు స్వయముగ భరించుచున్నారు. దీనిని వీరు ఆంధ్రలిఖితకేంద్ర గ్రంథాలయముగ ఒనర్పప్రయత్నించుచున్నారు. లక్షలకొలది ధనము గాబడిగలఅనేకులు భాషావిషయమున ఉదాసీనులైయుండ, ధనవంతులగు భాషాపోషకులగు కొందరు ప్రభువులవలె వీరును ఉదారభావముతో భాషారక్షణముజేయుచు దేశోపకారమొనర్చుచున్నారు.

లిఖితకేంద్రగ్రంథాలయమున వేలు, లక్షలు, వ్యయపరచి చేయవలసినకార్యము. అట్లు వ్యయపెట్టినను దేశీయుల ఏకీభావము లేనిది ఇతర ముద్రిత గ్రంథాలయములవలె గ్రంథములు సేకరించుట సులభకార్యము కాదు. ఈ మహాకార్యమునకు దేశమునందలి ప్రభువులు, ప్రజలు, గ్రంథాలయములును ఈ ప్రతిష్ఠాపనము దేశీయులందరిదేయను విశుద్ధభావముతో గోడ్పడి, ధనగ్రంథసముదాయముల నర్పించినగాని స్థాపకుల యభీష్టము సంపూర్ణత నొందజాలదు. వీరు సంపాదించిన అపూర్వగ్రంథముల వివరములు, పరిశీలనలు, విమర్శనములు ముద్రించి, ఆంధ్రదేశమునందలి గ్రంథాలయములకును, పరిశోధకులకును ఉచితముగ అందజేయుట కేర్పాటుచేయుట అత్యంతావశ్యకము. ఇంతేగాక నైజాము రాష్ట్రమునందు అముద్రిత గ్రంథములును, శాసనములును అమితముగ నున్నవి. ప్రత్యేక పరిశ్రమవలనగాని వానిని సంపాదించు భాగ్యము లభింపదు. ఇదివరకా ప్రదేశమునందు ఆంధ్రసాహిత్యపరిషత్తునకై శేషాద్రి రమణ కవులు సంచారముచేసి అమూల్యగ్రంథములను సంపాదించియున్నారు. వారేకారణముననో ఆపనిని ఇపుడు చేయించుటలేదు. వారు విడచినపనిని వీరు తిరిగి ప్రారంభింపజేసి, ఆంధ్రుల కృతజ్ఞతకు పాత్రులయ్యెదరుగాక. ఈ మండలియందున్న గ్రంథములయొక్క పటమును ఈ భాగమునందు ముద్రించియున్నారము.

# జనసామాన్యమందలి విద్య.

దేశాభివృద్ధి ముఖ్యముగ జనసామాన్యముయొక్క విద్యాభివృద్ధిపై నాధారపడియుండును. ప్రాచీనకాలమునందు, ఇంగ్లాండు, జపాన్, మున్నగు పాశ్చాత్యదేశములు అభ్యున్నతి యన నేమో యెఱుగనికాలముననే మనదేశ మభివృద్ధినందియుండెను. ఇందులకు మనదేశమందలి ప్రజాసామాన్యమందలి విద్యాభివృద్ధియే ప్రాముఖ్యమని వచించుటకు నిదర్శనము లనేకము లున్నవి. కాని పాశ్చాత్యదేశీయులు విద్యావంతులగుకాలమున మనవా రజాగరూకతచే విద్యావిహీనులై తమ వెనుకటి వైభవమునంతయు పోగొట్టుకొనుటచే నానారాను ప్ర

కృతపు హైన్యస్థితికి వచ్చుట తటస్థించినది. ఒక దేశ మభివృద్ధినందినదనగా అందలి జనులు విద్యావంతులును, బలవంతులును నై సకలపథముల నారితేరి వారగుటని భావము. మరియును, శరీరబలముకన్న విద్యాబలము ఎన్నియో మడుంగు లతిశయమని యందఱెఱింగినదియే. ఇప్పుడు నూతనముగ పాశ్చాత్యఖండ వాసులచే గనిపెట్టబడిన ఆకాశయానములు, విద్యుద్దీపములు, తంత్రీవార్తలు, మున్నగు సాధనాంతరములన్నియు సాధారణముగా మన ప్రాచీనగ్రంథముల జెప్పఁబడియుంటచే, అప్పటి భారతీయుల కీవిషయములు గ్రాహ్యమేయనియు, అందుచే వారు శాస్త్రముల నభ్యున్నతి నందించిరనియు, తెలియుచున్నది. గ్రంథములయందు వ్రాయబడిన యద్భుతవర్ణనలును, ఇప్పటికిని మనదేశమందచ్చటచ్చట గన్పట్టుచు నేత్రములకు మిరుమిట్లు గొలుపు చిత్రముల శిల్పకళా చాతుర్యములును, అప్పటి శిల్పకళాదక్షతను వేనోళ్ళ జాటుచున్నవి. హృదయంగమములగు వర్ణనలును, కల్పనలును గలిగి తమసృష్టికర్తలగు నప్పటి భారతీయుల భాషావాఙ్మయమును వెల్లడిజేయు గ్రంథరాజములు సయిత మెన్నియో మనదేశమందు గలవు. ప్రాచీన భారతవర్షమున నెన్నియో కళ లభివృద్ధిబొందినవనియు, ఆయావిద్యలకు సంబంధించిన గ్రంథాలయము లనేకము లుండి పిదప మ్లేచ్ఛ దండయాత్రికాలమున నా తురక ప్రభువులచే తగులబెట్టబడి చిరకాలము తమస్మృతిజాగరూకతతో పెంచిన భారతవర్షమున కెడతెగని విషాదమునకు గారణములగుటయే గాక వాని నాశనానంతరమే ఈ దేశ మిట్టి హైన్యస్థితికి రా మొదలిడెననియు, చరిత్రకారులు సయితము వ్రాసియున్నారు. దీనివలన గ్రంథభాండాగారములే నిఖిలవిద్యలకు అధారభూతములనియు, అట్టి గ్రంథాలయములు క్షీణించుటచేతనే యీ దేశమున ప్రాచీనవిద్యలన్నియు అంతమొంది అందుమూలమున మనోబలము గతించి మన భారతవర్షమునకు వెనుకటి ప్రాభవము పోయినదనియు మన మూహించుకోవలసియున్నది. కావున మాతృభూమికి మరల నెన్నడైన నట్టి యభ్యున్నతి రావలయునని కోరెదమేని తిరిగి మనదేశజులందు మనోబలాభివృద్ధి జేయ బ్రయత్నింపవలెను. దేశజులందు మనోబలమభివృద్ధిబొందించుటకు అందరికుచితవిద్య నీయవలెను. వెనుకటి గ్రంథాలయనిర్మూలనమే మన దేశీయుల నిట్లు కళావిహీనులుగను, శాస్త్రజ్ఞానశూన్యులుగను జేయజాలినదని జెప్పియుంటిని. కావున ప్రకృతి నట్టి గ్రంథభాండాగారములే మరల నెలకొల్పి వృద్ధిబొందించుటయే మన యుద్యమమునకు సాధనవిధానమని వేఱుగ జెప్ప నవసరములేదు. మన మాతృభూమి నిప్పుడు వణిగ్వ్యాపారాదులలో గీర్తిగన్న పాశ్చాత్యదేశములన్నిటికన్న పట్టణములకన్న పల్లెటూళ్ళనే యెక్కుడుగ గలిగియున్నది. కాన నిట్టిదేశమున విద్యాభివృద్ధి జేయనెంచినయెడ నగరములనేగాక ముఖ్యముగా గ్రామములనె బాగుపరచవలసియున్నది. విద్యాధికులగు దేశసేవకులు జనసామాన్యముకొఱకు పాటుపడనెంచిన యచిరకాలములో బల్లెటూళ్ళయందు విద్యాభివృద్ధిగలిగి వారందఱును వివేకవంతులగుదురు. గ్రామజనులందఱు విద్యావంతులగుదురేని మన భారతవర్షము చిరకాలములో పూర్వప్రాభవము నందగలదు. దేవాలయములేని యూరే యుండఁగూడదని యెంచి వేలకొలది ద్రవ్యము వ్యయపఱచి గుడిగోపురముల నిర్మించి యందు దేవతాప్రతిష్ఠ చేసియు, నాటగోలె నిత్యనైవేద్యములును, ప్రతివత్సర కల్యాణోత్సవములును, జేయునట్టి మహానీయులకు నొక కళాశాలయు, దీనికి గావలసిన గ్రంథాలయమును స్థాపించి తమయూరిలోని వారలకు విద్య గఱపించుట కష్టసాధ్యము కాదు. కావున ప్రతియూర నొక పాఠశాలయు, నొక గ్రంథాలయమును స్థాపించి వానిని పోషించుచుంటిరేని కొలదికాలములో మనదేశమభివృద్ధికి రాగదు. అప్పుడీదేశజులును విద్యావంతులునై వణిగ్వ్యాపారాదుల నన్యదేశజుల కేమాత్రము తీసిపోవక స్వగౌరవమును ప్రతిష్ఠింపజాలుదురు.

—కోన వేంకటరాయశర్మ.

# జాతీయగ్రంథ ప్రచురణసమాజము. ౬౩

—* ఈకాలమున చదవవలసిన గ్రంథములివియే *—

౧ లోకమాన్య బాలగంగాధరతిలకు జీవితము-ఉపన్యాసములు ౦—౪—౦

౩ స్వరాజ్యము. ... ... ౦—౪—౦

ఈరీతినే గాంధి, లజపతిరాయి మొదలగు మహనీయుల చరిత్రలు, ఉపన్యాసములు క్రమముగా ప్రకటించెదము. కావున ఈ సమాజగ్రంథములకు చందాదారులై దేశాభ్యుదయమునకు తోడ్పడెదరని కోరుచున్నారము. ప్రవేశరుసుము లేదు. సంవత్సరమునకు రు ౩-౦-౦ లకన్న ఎక్కువగాదు. దేశాభిమానముగల ప్రతివారును ప్రతిగ్రంథాలయమును ఈ గ్రంథములను తప్పక తెప్పించుకొనవలయును.

చిరునామా:—గాడేపల్లి సూర్యనారాయణశర్మ,
జాతీయగ్రంథప్రచురణసమాజము, పిఠాపురం, గోదావరిజిల్లా,

# గ్రంథాలయములకు ఉచితము.

గుంటూరు మండలమందలి గ్రంథాలయములకు అష్టావధాని అబ్బరాజు హనుమంతరావుగారిచే రచియింపబడిన "సుగ్రీవపట్టాభిషేక" మను అయిదాశ్వాసముల ప్రబంధమును ఉచితముగా పంపబడును. కొలది ప్రతులుమాత్రమే ఉండుటచే దరఖాస్తులయొక్క వరుస సంఖ్యల ప్రకారము పంపబడును.

చిరునామా:—అబ్బినేని రాఘవచౌదరి, నల్లూరు, రేపల్లితాలూకా.

ఉచితము:—అంచెకూలికై అరణాచీటి పంపెడు ఆంధ్రదేశ గ్రంథభాండాగారములకన్నిటికిని "శ్రీరఘునాథవర్మ జీవితము" (ప్రథమభాగము) అను గ్రంథ ముచితముగ నొసంగఁబడును. తత్క్షణము క్రింది విలాసమునకు వ్రాయుఁడు:—
శ్రీమాన్ చింతల రఘునాథవర్మగారు, వాయల్పాడు, చిత్తూరు జిల్లా.

# ఆంధ్ర గ్రంథాలయములకు ఉచితము.

మాచే ప్రకటింపబడిన ఈదిగువ గ్రంథములు ఆంధ్రగ్రంథాలయములకు ఉచితముగా పంపెదము. కావున పోస్టుఖర్చులకుగాను రు ౦-౧-౬ పోస్టుబిళ్లలు ఈదిగువ చిరునామాకు పంపినచో బుక్కుపోస్టుగా గ్రంథములు పంపుచున్నాము.

౧ కవిదర్పణచ్ఛందము, ౨ నాథవ్రతకల్పము, ౩ స్త్రీనీతిసారము, ౪ బాలికారత్నబోధిని, ౫ వేంకటరమణశతకము, ౬ శ్రీరంగనాయక దండకము.

చిరునామా:— కే. యే. నరసింహము, ఆయుర్వేదయూనాని డాక్టరు, రాజమండ్రి.

# When you Buy a book, try this test:-

## ఒక గ్రంథమునుకొనునపుడు పరిశీలింపవలసిన ముఖ్యవిషయములు.

౧ అందముగనున్నదా?

౨ మంచిభాషయందు వ్రాయబడినదా?

౩ మనజీవిత విధానమును తెలుపునా?

౪ మనజ్ఞానమును అభివృద్ధిచేయునా?

౫ మనవ్యవహారమునకు ఉపకరించునా?

౬ హితమును బోధించునా?

౭ సన్మార్గజీవితమునకు సాయపడునా?

౮ మనజీవితములను సారవంతముచేయునా?

౯ ఆప్తునివలె ప్రేమింపతగియున్నదా?

ఈ విషయములన్నిటిని సంతృప్తిపరచగల మంచి గ్రంథముల ప్రకటనకొరకు, రాబోవు గ్రంథాలయ సర్వస్వముయొక్క ఈ పుటనే జూడుడు.

---

## సైనికులకు సహాయము.

దక్షిణాఫ్రికాయందు యుద్ధముచేయుచున్న యుద్ధభటులకు పత్రికలు, సబ్బుబిళ్లలు, తెల్లకాగితము, మొదలగు చిల్లరవస్తువులు కావలెను. అందరును సహాయముచేయుదురని ప్రార్థన. అక్కడకు పంపు వస్తువులకు పోస్టుబిళ్లలక్కరలేదు. ద్రవ్యమును వసూలుచేసి పంపెదరేని, వారికి ఆవశ్యకములగు గ్రంథములను, పత్రికలను, వస్తువులను కొనిపంపెదము. పత్రికలుమొదలగువానిని తమంతటతామే పంపదలచుకొన్నవారికి చిరునామాలు అచ్చువేసియున్న కాగితములను పంపెదము.

బెజవాడ,
౧—౮—౧౮.

ఇట్లు విన్నవించువిధేయుడు,
అయ్యంకి వేంకటరమణయ్య.

| | మనసు ఫౌండేషన్<br>పుస్తకాల పరిశీలనాపట్టిక |
|---|---|
| పుస్తకం సంఖ్య | RSVM01 A109 |
| పుస్తకం పేరు | గ్రంథాలయ సర్వస్వము |
| తారీఖు | 7/6/24 |
| ముందు అట్ట | NO |
| వెనుక అట్ట | NO |
| మొత్తం పేజీలు | 51 |
| పెద్ద సైజు పేజీలు | NO |
| ఖాళీ పేజీలు | 35, 100B |
| లేని పేజీలు | 1to 36 |
| తయారు చేసినది | Sandhya |
| పేజీలు విడదీసినది | Sandhya |
| స్కాన్ చేసినది | Sandhya |
| పరీక్ష చేసినది | pragathi |
| పేజీలు సరిచూసినది | |
| బైండింగు చేసినది | |
| ప్యాకింగు చేసినది | |
| స్కాన్ చెయ్యనివి | |
| తప్పులు | NO |
| పరిస్థితి | good |